ఏళ్లు గడుస్తున్నా దళితులపై ఆగని వివక్ష
- పోరాటాలతోనే సమస్యల పరిష్కారం
- మోడీ పాలనలో ప్రమాదంలో భారత రాజ్యాంగం
- రాష్ట్ర దళిత సదస్సులో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు

లోపలి పేజీలో..

PRAJASAKTI Regd.No. 15795/68

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 43 సంచిక : 76 | విజయవాడ, సోమవారం 16 అక్టోబర్ 2023 | 6 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Monday 16 October 2023 | Rs

ఇంగ్లాండ్‌కు షాక్



- అఫ్గాన్ చేతిలో అనూహ్య ఓటమి 6



సిఎం క్యాంప్ కార్యాలయం కోసం సిద్ధమవుతున్న రుషి కొండపై నిర్మించిన భవనాలు

ఎంత జాగా కావాలి..

- అన్ని శాఖలకు సర్క్యులర్ జారీ
- విశాఖలో కార్యాలయాల ఏర్పాటుకు సన్నద్ధం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

విశాఖపట్నంలో కార్యాలయాల ఏర్పాటు దిశగా ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తోంది. సిఎం క్యాంపు కార్యాలయంతోపాటు వివిధ శాఖల కార్యాలయాలు ఏర్పాటు చేసేదిశగా ఉన్నతాధికారులు చర్యలు తీసుకుంటున్నారు. దీనికోసం ఎవరికి ఎంత విస్తీర్ణంలో కార్యాలయాలు అవసరమో వెంటనే తెలపాలని కోరుతూ ప్రభుత్వ కార్యదర్శి పోలా భాస్కర్ శుక్రవారం అనఫిషియల్ నోటు నెంబరు 2237565/Ser.A/A1/2023-1ను జారీచేశారు. ఈ ప్రక్రియ మొత్తానికి ప్లానింగు డిపార్టుమెంటు నోడల్ ఏజెన్సీగా ఉంటుందని సర్క్యులర్లో పేర్కొన్నారు. 17వ తేదీలోపు అడిగిన సమాచారాన్ని ఇవ్వాలనీ ఆదేశించారు. మంత్రుల కార్యాలయాలు, ప్రిన్సిపల్ సెక్రటరీలు, కార్యదర్శులు, విభాగాల అధిపతులు వెంటనే దీనికి సంబంధించిన నివేదిక ఇవ్వాలనీ సూచించారు. ముఖ్యమంత్రి ఉత్తరాంధ్ర జిల్లాల పర్యటన నేపథ్యంలో అధికారులు కూడా క్షేత్రస్థాయి పర్యటనలు చేయాల్సి ఉంటుందనీ, దీనికి అనుగుణంగా విశాఖపట్నంలో బస చేయాల్సి ఉంటుందనీ పేర్కొన్నారు. దీనికి వీలుగా అక్కడ (ట్రాన్సిట్ అకామిడేషన్) కార్యాలయాల ఏర్పాటు కూడా వెంటనే చేసుకోవాలని సూచించారు. జిఓ 2015 ఆధారంగా అధికారులు, మంత్రులకు వేర్వేరుగా ప్రొఫార్మా పంపించారు. అధికారులకు పంపిన ప్రొఫార్మాలో ఇప్పటికే భవనం గుర్తించారా ? గుర్తిస్తే అడ్రస్, ఎంత విస్తీర్ణంలో ఉంది అనే వివరాలు తెలపాలని కోరారు. దీనిలో స్పెషల్ చీఫ్ సెక్రటరీలు, ప్రిన్సిపల్ సెక్రటరీలు, విభాగాల అధిపతులకు ఎంతెంత కావాలో స్పష్టంగా తెలపాలని కోరారు. ఒకవేళ గుర్తించకపోతే ఎంత విస్తీర్ణంలో కావాలో తెలపాలని సూచించారు. మంత్రులకు పంపిన ప్రొఫార్మాలోనూ ఇదే తరహా సమాచారం కోరారు. దీన్ని విశాఖపట్నం ట్రాన్సిట్ అకామిడేషన్‌గా పేర్కొన్నారు.

వెనుకబడిన గిరిజన ప్రాంతాల అభివృద్ధి పేరుతో విశాఖకు కార్యాలయాలు తరలించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన సంగతి తెలిసిందే. దీనిలో భాగంగా రుషికొండ మీద ఈ వారంలో సిఎం సతీసమేతంగా పూజలు నిర్వహించి కార్యాలయాలు, నివాసాలను ప్రారంభించనున్నట్లు తెలిసింది.

ఏ క్షణంలోనైనా భూతల దాడులు

- అరబ్ నేతలతో అమెరికా మంతనాలు
- ఇజ్రాయిల్‌కు నేడు బ్లింకెన్

టెల్ అవీవ్ : ఇజ్రాయిల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు శనివారం గాజా సరిహద్దును సందర్శించి భూతల దాడులకు జరుగుతున్న సన్నాహాలను పరిశీలించారు. గాజా దక్షిణ భాగాన్ని ఆక్రమించుకునేందుకు ఇజ్రాయెల్ సాగిస్తున్న వైమానిక దాడులు పదవ రోజుకు చేరుకున్నాయి. ఇజ్రాయిల్ దాడుల్లో శనివారం ఒక్క రోజే 320 మంది పాలస్తీనియన్లు మరణించారు. దీంతో ఈ వారం రోజుల్లో ఇజ్రాయిల్ దాష్టీకానికి బలైన పాలస్తీనియన్ల సంఖ్య 2,215కి చేరింది. కాగా హమాస్ ఇజ్రాయిల్‌పై జరిపిన ప్రతిఘటన దాడుల్లో 1300 మంది చనిపోయినట్లు ఇజ్రాయిల్ ఆర్మీ తెలిపింది. గాజాపై భూతల దాడులకు ఇజ్రాయిల్‌ను ఎగదోస్తున్న అమెరికా, ఇందుకు అడ్డుతగలొద్దని అరబ్ నేతలపై ఒత్తిడి తెస్తున్నది. అమెరికా విదేశాంగ మంత్రి అంటోని బ్లింకెన్ ఈ ఎజెండాతోనే అరబ్ దేశాల పర్యటనకు వచ్చారు. ఆదివారం ఈజిప్టు రాజధాని కైరోలో అరబ్ నేతలతో చర్చలు జరిపారు. సోమవారం ఇజ్రాయిల్ ప్రధాని నెతన్యాహుతో టెల్ అవీవ్‌లో ప్రత్యేకంగా భేటీ కానున్నారు. ఇజ్రాయిల్ అనుసరించాల్సిన తదుపరి వ్యూహం గురించి నెతన్యాహుకు ఆయన డైరక్షన్ ఇవ్వనున్నారని సమాచారం. ఈజిప్టు అధ్యక్షుడు అబ్దుల్ ఫతా అల్ సిసితో కైరోను కలుసుకున్నారు. అంతకుముందు యునైటెడ్ ఎమిరేట్స్, బహ్రెయిన్, ఖతార్, జోర్డాన్ నేతలతో ఆయన చర్చలు జరిపారు. గాజాపై ఇజ్రాయిల్ భూతల దాడులకు మద్దతుగా నిలవాలని అరబ్ దేశాల నేతలపై ఒత్తిడి తెచ్చినట్లు తెలిసింది. గత వారం చైనా పై కూడా ఇదే విధమైన ఒత్తిడి తెచ్చేందుకు అమెరికా ప్రయత్నించింది. అయితే, చైనా అందుకు ససేమిరా అన్నది. స్వతంత్ర పాలస్తీనా ఏర్పాటుకు, శాంతియుత చర్చలకే తాము కట్టుబడి ఉన్నామని అమెరికాకు అది తేల్చి చెప్పింది.

అసైన్డ్ భూముల్లో
90% పెద్దల చేతుల్లోనే

- పేదల సాగులో పది శాతమే!
- కృష్ణా జిల్లా సర్వేలో తేలిన లెక్క
- ఆ మేరకే లబ్ధిదారులకు తాజా హక్కులు



భూముల రికార్డులను పరిశీలిస్తున్న రెవెన్యూ అధికారులు

ప్రజాశక్తి- కృష్ణా ప్రతినిధి

పేదలకు 2003కు పూర్వం పంపిణీ అయిన అసైన్డ్ భూములపై పూర్తి స్థాయి హక్కు పత్రాలు ఇచ్చేందుకు కృష్ణా జిల్లా రెవెన్యూ యంత్రాంగం క్షేత్రస్థాయి సర్వే పూర్తి చేసింది. అయితే, జిల్లాలో మొత్తం అసైన్డ్ భూముల్లో పదో వంతు భూమి మాత్రమే అసైనీలు, వారి వారసుల సాగులో ఉందనీ, ఆ మేరకు మాత్రమే హక్కుపత్రాలు అందజేయాలని అధికారులు నిర్ధారించారు. పేదలకు పంపిణీ అయినదాంట్లో 90 శాతం విస్తీర్ణంలోని భూములు నిబంధనలకు విరుద్ధంగా భూస్వాములు, పెద్దల స్వాధీనంలోకి వెళ్లిపోయినట్లు వారే అనుభవిస్తున్నట్లు సర్వేలో గుర్తించారు. పారదర్శకంగా ఉంచాల్సిన ఈ భూములకు సంబంధించిన సమాచారాన్ని అధికార యంత్రాంగం గోప్యంగా ఉంచడం పలు సందేహాలకు తావిస్తోంది. అసైన్డ్ భూములపై తాజా ఆర్డినెన్స్ తీసుకొచ్చే క్రమంలో ఏయే గ్రామంలో ఎంత అసైన్డ్ భూమి ఉంది? ఎవరి పేరుతో పట్టా ఉంది? ఎవరి స్వాధీనంలో ఆ భూమి ఉంది? అనే వివరాలను గ్రామ సచివాలయాలు, పంచాయతీల నోటీసు బోర్డుల్లో ఉంచుతామని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించారు. కానీ, క్షేత్రస్థాయిలో ఇది ఆచరణకు నోచుకోవడం లేదు. నోటీసు బోర్డుల్లో ఎక్కడా అసైన్డ్ భూముల వివరాలు, లబ్ధిదారుల జాబితాలు ప్రదర్శించలేదు. పెద్దల స్వాధీనంలోని అసైన్డ్ భూములు వివరాలు బహిర్గతం కాకుండా ఉండేందుకే పారదర్శకత పాటించడం లేదనే విమర్శలు వస్తున్నాయి.

20 ఏళ్ల క్రితమే అసైన్డ్ భూములకు బి-ఫారం పట్టాలు పొందిన వాస్తవ లబ్ధిదారులు, వారసుల స్వాధీనంలోని అసైన్డ్ భూములపై పూర్తి హక్కులు కల్పిస్తామని చెబుతూ రాష్ట్ర ప్రభుత్వం 9/23 ఆర్డినెన్స్‌ను తీసుకొచ్చింది. ఈ నేపథ్యంలో పంపిణీ అయిన భూములు ఎవరి స్వాధీనంలో ఉన్నాయో నిర్ధారించేందుకు రెవెన్యూ యంత్రాంగం క్షేత్రస్థాయిలో పరిశీలన పూర్తి చేసింది.

కృష్ణా జిల్లాలో పంపిణీ అయిన అసైన్డ్ భూమి 33,730.58 ఎకరాలకుగాను కేవలం 3,393.39 ఎకరాలు మాత్రమే వాస్తవ లబ్ధిదారుల స్వాధీనంలో ఉన్నట్లు నిర్ధారించారు. మిగిలిన 30,337 ఎకరాల భూములు పెద్దల చేతుల్లోకి వెళ్లాయి. నిబంధనలకు విరుద్ధంగా ఈ భూముల్లో ఆక్వా చెరువులు తవ్వి రొయ్యలు, చేపల పెంపకం సాగిస్తున్నారు. దున్నేవానికే భూమి నినాదంతో గతంలో పెద్ద ఎత్తున జరిగిన భూ పోరాటాల ఫలితంగా గత ప్రభుత్వాలు భూములను పేదలకు పంపిణీ చేశాయి. దళితులు, గిరిజనులు, ఇతర పేదలకు బి-ఫారం పట్టాలు పొందారు. భూమి లభ్యతను ఆసరా చేసుకుని జిల్లాలో ఒక్కో ప్రాంతంలో ఒక్కో రకంగా 20 సెంట్ల నుంచి 2.5 ఎకరాల వరకూ లబ్ధిదారులకు పంపిణీ జరిగింది. ఈ భూములు పొందిన లబ్ధిదారుల కుటుంబాలు సేద్యం చేసి ఫలసాయం పొందుతూ ఆర్థిక స్వావలంబన సాధించాలనే ఉద్దేశంతో ఈ భూముల క్రయ విక్రయాలను ప్రభుత్వం నిషేధించింది. అసైన్డ్ భూములను లబ్ధిదారులు అమ్మడం, లబ్ధిదారుల నుంచి కొనడం నేరమని పేర్కొంది. ఈ భూముల క్రయవిక్రయాలు జరిగితే ప్రొహిబిషన్ ఆఫ్ ట్రాన్స్‌ఫర్ (పిఒటి) చట్టం కింద రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకోవాలి. కానీ, పాలకులు ఈ చట్టం అమలులో నిర్లక్ష్యంగా వ్యవహరించారు. పేదల పేరున పట్టాలు ఉన్నా అసైన్డ్ భూముల్లో అత్యధిక శాతం అనధికారికంగా పెద్దల స్వాధీనంలోకి మిగతా 2లో

ఎర్రజెండాతోనే ఏజెన్సీ అభివృద్ధి

- మోసపూరిత పార్టీలను తరిమికొట్టండి
- ఆదివాసీ అరణ్య ఘోష బహిరంగ సభలో బివి రాఘవులు
- ఎరుపెక్కిన రంపచోడవరం



బహిరంగ సభలో మాట్లాడుతున్న బివి.రాఘవులు

ప్రజాశక్తి- రంపచోడవరం (అల్లూరి సీతారామరాజు జిల్లా)

ఎర్రజెండాతోనే ఏజెన్సీ అభివృద్ధి సాధ్యమని సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బివి.రాఘవులు ఉద్ఘాటించారు. కేంద్రంలోని బిజెపి అనుసరిస్తోన్న ప్రజా, కార్మిక, గిరిజన వ్యతిరేక విధానాలను ఐక్య పోరాటాలతో తిప్పికొడతామని పిలుపునిచ్చారు. అల్లూరి జిల్లా రంపచోడవరం నియోజకవర్గ కేంద్రంలోని జూనియర్ కళాశాల మైదానంలో సిపిఎం ఆధ్వర్యాన ఆదివాసీ అరణ్యఘోష బహిరంగ సభ ఆదివారం జరిగింది. రంపచోడవరం కేంద్రంగా మరో ఏజెన్సీ జిల్లా ఏర్పాటు చేయాలని, ఆదివాసీల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ నిర్వహించిన ఈ సభకు వేలాది మంది గిరిజనులు ఎర్రజెండాలు చేబూని తరలివచ్చారు. దీంతో, రంపచోడవరం ఎరుపెక్కింది. సిపిఎం ఎఎస్ఆర్ రంపచోడవరం జిల్లా కార్యదర్శి బొప్పెన కిరణ్ అధ్యక్షతన జరిగిన బహిరంగ సభలో ముఖ్య అతిథిగా పాల్గొన్న బివి.రాఘవులు మాట్లాడుతూ కేంద్రంలోని మోడీ సర్కారు గిరిజనులను తీవ్రంగా నష్టపర్చే విధానాలను అవలంబిస్తోందన్నారు. అటవీ హక్కుల చట్టానికి సవరణ చేసి ఆదివాసీలకు తీరని ద్రోహం చేసిందని తెలిపారు. మైనింగ్ చట్టానికీ సవరణలు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. గతంలో వామపక్షాలు అనేక పోరాటాలు చేసి యుపిఎ ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చి చేసిన చట్టాలను నేడు మిగతా 2లో

మూడు రాష్ట్రాల్లో తొలి జాబితాల విడుదల
- తెలంగాణలో 55 మందిని ప్రకటించిన కాంగ్రెస్

లోపలి పేజీలో..

మాజీ ఎన్నికల కమిషనర్ ఎంఎస్ గిల్ కన్నుమూత

లోపలి పేజీలో..

రాజ్యాంగం కల్పించిన హక్కుల్ని కాపాడుకోవాలి
- మహిళలకు ఐద్వా జాతీయ ప్రధాన కార్యదర్శి మరియం దావలె పిలుపు

లోపలి పేజీలో..



రాజమహేంద్రవరంలోని క్యాంప్ సైట్ వద్ద నిరసన తెలుపుతున్న భువనేశ్వరి, టిడిపి నేతలు

'న్యాయానికి సంకెళ్లు'

చంద్రబాబు అరెస్టును వ్యతిరేకిస్తూ టిడిపి నేతల నిరసనలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో, యంత్రాంగం

టిడిపి అధినేత నారా చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టును నిరసిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా ఆ పార్టీ నేతలు, కార్యకర్తలు వినూత్న రీతిలో నిరసనలు చేపట్టారు. 'న్యాయానికి సంకెళ్లు' పేరుతో చేతులకు రిబ్బన్లు, తాళ్లు, గొలుసులతో సంకెళ్లు వేసుకుని నిరసనలు తెలిపారు. ఆదివారం సాయంత్రం 7 నుంచి 7.05 గంటల వరకు ఈ కార్యక్రమం చేపట్టారు.

తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని క్యాంప్ సైట్ వద్ద నారా భువనేశ్వరి, మాజీ మంత్రులు చినరాజప్ప, బుచ్చయ్య చౌదరి చేతులకు సంకెళ్లు వేసుకొని నిరసనలో పాల్గొన్నారు. 'అధర్మం నశించాలి', 'అన్యాయం నశించాలి' అని నినదించారు. టిడిపి ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ హైదరాబాద్‌లోని తన నివాసంలో చేతులకు తాళ్లు కట్టుకుని తన భార్య బ్రాహ్మణితో కలిసి నిరసన తెలిపారు. ఏ ఆధారాలు లేకపోయినా రాజకీయ కక్షతో ప్రజల నుంచి చంద్రబాబును దూరం చేసేందుకు అక్రమంగా అరెస్టు చేశారని లోకేష్ ఈ సందర్భంగా మండిపడ్డారు. గుంటూరు జిల్లా మంగళగిరిలోని టిడిపి కార్యాలయంలో జరిగిన నిరసనలో ఆ పార్టీ నేతలు కళ్లం రాజశేఖర్ రెడ్డి, వల్లూరి కిరణ్ తదితరులు మిగతా 2లో

బాలాత్రిపుర సుందరిదేవిగా 'దుర్గమ్మ'

అమ్మవారిని దర్శించుకున్న గవర్నర్ నజీర్, మంత్రి రోజా



విజయవాడ కనకదుర్గమ్మ దర్శనం అనంతరం ఆలయం బయట గవర్నర్ దంపతులు, ఇఒ, అధికారులు

ప్రజాశక్తి- యంత్రాంగం

విజయవాడలోని శ్రీ దుర్గామల్లేశ్వరస్వామివార్ల దేవస్థానం ఇంద్రకీలాద్రి కనకదుర్గమ్మ అమ్మవారి దసరా మహోత్సవాలు అత్యంత వైభవోపేతంగా ఆదివారం ప్రారంభమయ్యాయి. మొదటి రోజు స్వపనాభిషేకం అనంతరం ఉదయం తొమ్మిది గంటల నుండి దర్శనం కల్పించారు. శ్రీ బాలాత్రిపుర సుందరీదేవిగా శ్రీ దుర్గమ్మ సందర్శకులకు దర్శనమిచ్చారు. అమ్మవారిని రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ దంపతులు దర్శించుకున్నారు. వారికి వేద పండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. దేవస్థానం కార్యనిర్వహణ అధికారి కెఎస్.రామరావు, ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.డిల్లీరావు, జాయింట్ కలెక్టర్ డాక్టర్ పి.సంపత్‌కుమార్, విజయవాడ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు, నగర పోలీస్ కమిషనర్ కాంతి రాణా టాటా, శ్రీ దుర్గా మల్లేశ్వరస్వామి వారి దేవస్థానం ట్రస్ట్ బోర్డు చైర్మన్ కర్నాటి రాంబాబు తదితరులు గవర్నర్‌ను అంతరాలయంలోకి తోడ్కొని వెళ్లారు. దర్శనానంతరం వేద పండితులు ఆశీర్వదించి అమ్మవారి శేష వస్త్రం, చిత్రపటాన్ని గవర్నర్ దంపతులకు అందజేశారు. అమ్మవారిని దర్శించుకున్న వారిలో రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి ఆర్‌కె రోజా ఉన్నారు. ఆదివారం సెలవు రోజు కావడంతో యాత్రికులు పోటెత్తారు. మొదటి రోజు సుమారు 80 వేల మంది వరకూ దుర్గమ్మను దర్శించుకున్నట్లు అధికారులు అంచనా వేశారు.

పెద్దశేష వాహనంపై పరమపద వైకుంఠనాథుడు

తిరుమల శ్రీవారి నవరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మొదటి రోజు రాత్రి శ్రీదేవి భూదేవి సమేత శ్రీమలయప్ప స్వామివారు పరమపద వైకుంఠనాథుని అలంకారంలో ఏడు తలల పెద్ద శేషవాహనం తిరుమాడ వీధులలో విహరించారు.

శ్రీశైలంలోనూ ప్రారంభమైన దసరా మహోత్సవాలు

శ్రీశైల క్షేత్రంలో దసరా మహోత్సవాలు సంప్రదాయ పద్ధతిలో ప్రారంభమయ్యాయి. నవదుర్గ అలంకరణలో అమ్మవారు దర్శనమిచ్చారు.

ఆసరా పెన్షన్లు పెంపు

- రూ.400కే గ్యాస్ సిలిండర్
- అసైన్డ్ భూములపై ఆంక్షలు తొలగింపు
- బిపిఎల్ కుటుంబాలన్నింటికీ జీవిత బీమా
- రూ.15 లక్షల వరకు ఉచితంగా వైద్యం
- మహిళలకు రూ.3 వేల భృతి
- బిఆర్ఎస్ మేనిఫెస్టో ప్రకటించిన కెసిఆర్



ఎన్నికల మేనిఫెస్టోను ప్రకటిస్తున్న ముఖ్యమంత్రి కెసిఆర్

ప్రజాశక్తి- హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో అధికార బిఆర్ఎస్ పార్టీ పలు ప్రజాకర్షక హామీలతో ఎన్నికల మేనిఫెస్టోను ప్రకటించింది. ఆదివారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో తమ పార్టీ అభ్యర్థులు 51 మందికి బిఆర్ఎస్ అధ్యక్షులు, రాష్ట్ర ముఖ్యమంత్రి కెసిఆర్ బి-ఫారాలను అందజేశారు. అనంతరం ఎన్నికల మేనిఫెస్టోను మీడియాకు ఆయన వెల్లడించారు. తమ పార్టీయే మళ్లీ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. అన్ని వర్గాల ప్రజలనూ పరిగణనలోకి తీసుకుని రాష్ట్ర ఆదాయ, వ్యయాలను అంచనా వేసిన తర్వాతే హామీలపై నిర్ణయం తీసుకున్నామని చెప్పారు. అధికారంలోకి వచ్చిన ఆరు మాసాల్లో హామీల అమలుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

బిఆర్ఎస్ మేనిఫెస్టోలో హామీలు

- కెసిఆర్ బీమా-ప్రతి ఇంటికి ధీమా పేరుతో రాష్ట్రంలో తెల్ల రేషన్ కార్డు కలిగి ఉన్న ప్రతి పేద కుటుంబానికీ రూ.5 లక్షల జీవిత బీమా
- ఆసరా పింఛన్లు రూ.5,016కి పెంపు. వికలాంగుల పింఛను రూ.6 వేలకు పెంపు
- ఆరోగ్యశ్రీ గరిష్ట పరిమితి రూ.15 లక్షలకు పెంపు
- సౌభాగ్యలక్ష్మి పథకం కింద అర్హులైన పేద మహిళలకు ప్రతి నెల రూ.3 వేలు చొప్పున భృతి
- అర్హులైన పేదలతో పాటు అక్రిడిడేషన్ ఉన్న ప్రతి జర్నలిస్టులకు రూ.400కే గ్యాస్ సిలిండర్
- 'రైతు బంధు' సాయం మొత్తాన్ని రూ.16 వేలకు దశల వారీగా పెంపు
- 'తెలంగాణ అన్నపూర్ణ' పథకం ద్వారా తెల్ల రేషన్ కార్డు ఉన్న కుటుంబాలకు సన్నబియ్యం పంపిణీ
- అగ్రవర్ణాల విద్యార్థుల కోసం ప్రతి నియోజకవర్గానికీ ఒక గురుకుల పాఠశాల
- రాష్ట్రంలో అనాథల కోసం ప్రత్యేక పాలసీ
- ప్రభుత్వ ఉద్యోగుల ఒపిఎస్ కోసం కమిటీ ఏర్పాటు

మహారాష్ట్రలో రోడ్డు ప్రమాదం

- 12 మంది మృతి

ముంబయి : మహారాష్ట్రలో ఆదివారం తెల్లవారు జామున ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. ఛత్రపతి శంబాజీ నగర్ జిల్లాలోని సమృద్ధి ఎక్స్‌ప్రెస్‌వేపై ఆగి ఉన్న ఒక కంటైనర్ ట్రక్కును మినీ బస్సు వెనుక నుంచి ఢీ కొన్న ప్రమాదంలో 12 మంది మృతి చెందారు. మరో 23 మంది గాయపడ్డారు. మృతుల్లో చిన్నారి, ఆరుగురు మహిళలు ఉన్నారు. ముంబయికి 350 కి.మీ దూరంలో వైజాపుర్ ప్రాంతంలో ఆదివారం అర్ధ రాత్రి 12:30 గంటల సమయంలో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. బుల్దానలోని ఒక దర్గాను సందర్శించుకుని నాసిక్‌కు తిరిగి పయనమవుతుండగా ఈ ప్రమాదం జరిగింది. అతి వేగం కారణంగానే ఈ ప్రమాదం జరిగినట్లు పోలీసులు భావిస్తున్నారు. మినీ బస్సు డ్రైవర్ నియంత్రణ కోల్పోయి ట్రక్కును ఢీ కొట్టినట్లు ప్రాథమిక విచారణలో తేలింది. అలాగే ఈ బస్సులో పరిమితికి మించి 35 మంది ప్రయాణీకులు ఉన్నారని గుర్తించారు. ఈ ప్రమాదంపై రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధానమంత్రి నరేంద్ర మోడీ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రధానమంత్రి సహాయ నిధి నుంచి మృతుల కుటుంబాలకు ఒక్కొక్కరికీ రూ 2 లక్షలు, రాష్ట్ర ప్రభుత్వం మరో 5లక్షలు పరిహారం ప్రకటించాయి.

వైసిపి దళిత ప్రజాప్రతినిధులు రాజీనామా చేయాలి

● నక్కా ఆనంద్‌బాబు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

వైసిపి దళిత ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలు రాజీనామా చేయాలని మాజీ మంత్రి నక్కా ఆనంద్‌బాబు డిమాండ్ చేశారు. వైసిపి అధికారంలోకి వచ్చిన నాటి నుంచి దళితులను జగన్ ఆర్థికంగా, రాజకీయంగా, సామాజికంగా అణిచివేస్తున్నారని వారికి ఆదివారం రాసిన లేఖలో పేర్కొన్నారు. దళితుడిని చంపి డోర్ డెలివరీ చేసిన ఎమ్మెల్సీ అనంత్‌బాబుకు బెయిల్ ఇప్పించి పార్టీ సభలు, సమావేశాల్లో జగన్ తన పక్కనే తిప్పుకుంటున్నారని ఆరోపించారు. పార్టీ నుంచి సస్పెండ్ చేస్తున్నామని ప్రకటించిన వైసిపి అధిష్టానం అనంతబాబును మరలా పార్టీలోకి రెడ్ కార్పెట్ వేసి ఎందుకు ఆహ్వానించిందని ప్రశ్నించారు. అనంత్‌బాబు తమను బెదిరిస్తున్నారని హత్యకు గురైన సుబ్రమణ్యం కుటుంబ సభ్యులు వాపోతున్నా రక్షణ కల్పించలేదని విమర్శించారు. దీంతో, వేరే ప్రాంతానికి వెళ్లి తలదాచుకుంటున్నారని తెలిపారు. నాలుగేళ్ల నుంచి దళితులకు ప్రతిరోజు అన్యాయాలు, అవమానాలు, వేధింపులు ఎదురవుతున్నా వైసిపిలోని దళిత మంత్రులు, ఎమ్మెల్యేలు ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు.

చంద్రబాబు ఆరోగ్యంపై నిర్లక్ష్యం తగదు

● పవన్‌కల్యాణ్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

టిడిపి అధ్యక్షులు చంద్రబాబునాయుడు ఆరోగ్య పరిస్థితిపై వైసిపి ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరి అమానవీయంగా ఉందని జనసేన అధ్యక్షులు పవన్‌కల్యాణ్ పేర్కొన్నారు. రాజమహేంద్రవరం కేంద్ర కారాగారంలో ఉన్న చంద్రబాబు ఆరోగ్య స్థితిగతుల విషయంలో నిర్లక్ష్యం తగదన్నారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఆరోగ్యపరమైన సమస్యలపై మానవతా దృక్పథంతో వ్యవహరించాలని, ఈ అంశంలోనూ రాజకీయ కక్ష సాధింపు ధోరణి సరికాదని పేర్కొన్నారు. చంద్రబాబు కుటుంబ సభ్యులు సామాజిక మాధ్యమాలు, మీడియా ద్వారా ఆందోళన వ్యక్తం చేశారని, వాటికి స్పందనగా ప్రభుత్వ సలహాదారులు, జైళ్ల శాఖ అధికారులు చేసిన వ్యాఖ్యలు, ప్రభుత్వ వైఖరిని సూచిస్తున్నాయని తెలిపారు. వైద్యుల నివేదికలను పట్టించుకోకపోవడం, ప్రభుత్వ వైఖరిపై న్యాయస్థానం జోక్యం చేసుకుని విచారణ చేపట్టాలన్నారు. ఆయన ఆరోగ్య విషయంలో ప్రభుత్వమే బాధ్యత వహించాలని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు. అభిప్రాయాలు పంపదలిస్తే..

**స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ,
ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ,
అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి,
గుంటూరు జిల్లా - 522 501**కు కానీ
editorprajasakthi@gmail.comకు పంపవచ్చు.

నాలుగు రోజుల పర్యటన కోసం వియత్నాంకు జైశంకర్

హనోయి : వియత్నాంలో నాలుగు రోజుల పర్యటన కోసం భారత విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్ ఆదివారం హనోయికి చేరుకున్నారు. జైశంకర్‌కు వియత్నాం విదేశాంగ మంత్రి బుయిథన్హాసన్ సాదరంగా స్వాగతం పలికారు. ఈ విషయాన్ని జైశంకర్ ట్వీట్ చేశారు. సోమవారం జరిగే 18వ జాయింట్ కమీషన్ సమావేశానికి సహ-అధ్యక్షునిగా ఉండేందుకు ఆసక్తిగా ఎదురుచూస్తున్నట్లు తెలిపారు.

హనోయికి జైశంకర్ చేరుకున్న వెంటనే అక్కడి చారిత్రక ట్రాన్ క్వోక్ పగోడాను సందర్శించారు. 'ట్రాన్ క్వోక్ పగోడాను సందర్శించాం. ఇక్కడ ఉన్న ఒక బోధి వృక్షం భారత్-వియత్నాం మధ్య ఏళ్ల తరబడి కొనసాగుతున్న సంబంధాలకు నిదర్శనంగా ఉంది. ఈ బోధి వృక్షాన్ని 1959లో అప్పటి భారత రాష్ట్రపతి బాబూ రాజేంద్ర ప్రసాద్ అప్పటి వియత్నాం అధ్యక్షులు హోచిమిన్‌కు బహుకరించారు' అని జైశంకర్ ట్వీట్ చేశారు. మరోవైపు విదేశాంగ మంత్రిత్వ శాఖ కూడా జైశంకర్ వియత్నాం పర్యటన గురించి ఒక ప్రకటనలో తెలిపింది.

'న్యాయానికి సంకెళ్లు'

(మొదటి పేజీ తరువాయి)

పాల్గొన్నారు. విశాఖలో టిడిపి రాష్ట్ర అధ్యక్షులు కింజరాపు అచ్చెన్నాయుడు నిరసనలో పాల్గొని మాట్లాడారు. కక్ష సాధింపు చర్యల్లో భాగంగానే చంద్రబాబును అరెస్టు చేశారన్నారు. నెల్లూరులో రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి తన నియోజకవర్గ ప్రజలతో కలిసి చేతులకు ఇనుప గొలుసులు కట్టుకొని నిరసన తెలిపారు. శ్రీకాకుళంలోని ఎంపి కింజరాపు రామ్మోహన్ నాయుడు నిరసన తెలిపారు. ఆమదాలవలసలో కూన రవికుమార్ ర్యాలీ నిర్వహించారు. కవిటి మండలం రామయ్యపుట్టుగలో ఎమ్మెల్యే బెందాళం అశోక్, టిడిపి నాయకులు చేతులకు సంకెళ్లతో ఆందోళన చేశారు. గుంటూరు, కృష్ణా, ఒంగోలు, విజయనగరం, కడప, కర్నూలు, అనంతపురం, తిరుపతి, చిత్తూరు జిల్లాలతోపాటు రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లోనూ టిడిపి నాయకులు నిరసనలో పాల్గొన్నారు.



వేదికపై మాట్లాడుతున్న ఐద్వా జాతీయ ప్రధాన కార్యదర్శి మరియం దావలె


మహిళా కన్వెన్షన్‌కు హాజరైన ఉపాధ్యాయులు

రాజ్యాంగం కల్పించిన హక్కుల్ని కాపాడుకోవాలి

మహిళలకు ఐద్వా జాతీయ ప్రధాన కార్యదర్శి మరియం దావలె పిలుపు

ప్రజాశక్తి- తిరుపతి సిటీ:

రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కులు ఈ దేశానికి రక్షణ అని ప్రత్యేకించి మహిళా రక్షణ కోసం రాజ్యాంగం రూపొందించిన హక్కుల్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతీ మహిళ మీద ఉందని ఐద్వా జాతీయ ప్రధాన కార్యదర్శి మరియం దావలె పిలుపునిచ్చారు. తిరుపతి జిల్లా అశోక్ కన్వెన్షన్ హాల్‌లో యుటిఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షులు ఎఎన్ కుసుమ కుమారి అధ్యక్షతన యుటిఎఫ్ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం మహిళా కన్వెన్షన్ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మరియం దావలె హాజరై మాట్లాడారు. మనుస్మృతి పేరుతో మహిళలను కించపరుస్తూ పాలకులు మాట్లాడుతున్నారని, కులం, మతం, ప్రాంతం, ధనిక, పేద సంబంధం లేకుండా వారిని వివక్షకు గురిచేస్తున్నారని తెలిపారు. రాజ్యాంగంలో ఆర్టికల్ 12 నుంచి 35 వరకు ప్రాథమిక హక్కులు ఉన్నాయని, దీనిలో ప్రధానంగా చట్టం ముందు అందరూ సమానమని తెలిపారు. కానీ నేడు చట్టం ముందు కాదు కదా సమాజంలో మహిళలు సమానంగా చూడడానికి కూడా పాలకులు అంగీకరించడంలేదని అన్నారు. మహిళలను రెండవ తరగతి పౌరులుగా చూసేటువంటి మనుస్మృతిని తిరస్కరించాలని కోరారు. ప్రతి వెయ్యి మంది పురుషులకు 906 మంది మహిళలు మాత్రమే ఉన్నారని తెలిపారు. ఇవాళ గర్భంలోనే బాలికలను చంపేసే భ్రూణహత్యలు జరగడం అత్యంత దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. ఏ మహిళా గర్భస్రావం చేయించుకోవడానికి ఇష్టపడదని, మగపిల్లలు కావాలని కుటుంబం ప్రత్యేకించి పురుషాధిక్యత సమాజం ఆ స్థితికి దిగజారుస్తుందని తెలిపారు. మహిళలకు ఆస్తి హక్కు ఉండడం ద్వారా మనోధైర్యాన్ని, ఆర్థిక స్వతంత్రాన్ని కలిగి ఉంటుందని, అలాంటి ఆస్తి హక్కు మహిళలకు లేకుండా చేస్తున్న పరిస్థితులు ఏర్పడ్డాయని, మహిళ ఆస్తిహక్కు చట్టం పకడ్బందీగా అమలు చేయాలని కోరారు. నేటి పాలకులు హిందుత్వాన్ని ముందుకు తీసుకొస్తున్నారని, ఆ పేరుతో విభజన చేస్తున్నారని, తాము మతాలకు వ్యతిరేకం కాదని, కానీ ఉన్మాదతత్వాలకు కచ్చితంగా వ్యతిరేకమని తెలిపారు. ఎక్కడ ఎలాంటి అరాచకాలు జరిగినా అక్కడ మహిళలపై దారుణాలు జరగడం నిత్యకృత్యమైందని ఆవేదన వ్యక్తం చేశారు. పిల్లలందరూ సమానం అనే భావన పెంపొందించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులు తీసుకోవాలని కోరారు. భారత రాజ్యాంగం కల్పించిన లౌకిక విధానం, సమానత్వం, స్వేచ్ఛ భావనని విద్యార్థి దశలోనే విద్యార్థులకు చెప్పాలన్నారు. మనుస్మృతి హఠావో మహిళలు, రాజ్యాంగం బచావో నినాదాన్ని అందుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌టిఎఫ్‌ఐ జాతీయ ఉపాధ్యక్షులు ఎం సంయుక్త, ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమాదేవి, శ్రీపద్మావతి మహిళా యూనివర్శిటీ ప్రొఫెసర్ మధుజ్యోతి ప్రసంగించారు. యుటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కెఎస్ఎస్ ప్రసాద్ నిర్మాణ కర్తవ్యాలను, ఎస్‌టిఎఫ్‌ఐ జాతీయ కార్యదర్శి ఎన్ అరుణ కుమారి నివేదికను ప్రవేశపెట్టారు. అంతకు ముందు జాతీయ జెండాను యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్ఎస్ నాయుడు, ఎస్‌టిఎఫ్‌ఐ జెండాను సంయుక్త, యుటిఎఫ్ జెండాను రాష్ట్ర అధ్యక్షులు వెంకటేశ్వర్లు ఎగురవేశారు.

చర్మ సమస్యలు 35 రోజులకు గుర్తుకు వచ్చాయా?

● టిడిపి నేతలకు అంబటి ప్రశ్న

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

చంద్రబాబు నాయుడుకు కొన్నేళ్లుగా ఉన్న చర్మ సమస్యలపై వారి కుటుంబ సభ్యులు, టిడిపి నాయకులు 35 రోజులు తరువాత స్పందించడం విడ్డూరంగా ఉందని రాష్ట్ర జలవనరులశాఖ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. గుంటూరులోని తన కార్యాలయంలో ఆయన ఆదివారం మీడియాతో మాట్లాడారు. చంద్రబాబు అరెస్టయిన వెంటనే మందులు, భోజనం ఇంటి నుంచి పంపేందుకు అనుమతి ఇవ్వాలని కోరిన కుటుంబ సభ్యులు చర్మ సమస్యలను కోర్టు దృష్టికి ఎందుకు తీసుకువెళ్లలేదని ప్రశ్నించారు. ప్రభుత్వంపై బురద జల్లడానికే ఎసి విషయాన్ని ముందుగా కోర్టును కోరలేదని తెలిపారు.

వివిధ రాష్ట్రాల్లోనూ పలువురు మాజీ ముఖ్యమంత్రులు అవినీతి ఆరోపణలపై అరెస్టయ్యారని, చంద్రబాబు విషయంలోనూ చట్టం తన పని తాను చేసుకుపోయిందని చెప్పారు. ఆర్థిక నేరాల్లో తప్పు చేయకపోతే ఒక్కొక్క న్యాయవాదికి రోజుకు రూ.కోటి ఇచ్చి 16 మందితో కూడిన బృందాన్ని ఎందుకు నియమించుకున్నారని ప్రశ్నించారు. కేంద్రంలో ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీలో దగ్గుబాటి పురందేశ్వరి ఉంటారని, ఆమె బిజెపిలో ఉన్నా టిడిపి అధ్యక్షురాలిగా పనిచేస్తున్నారని విమర్శించారు.

పులిచింతల నుంచి కృష్ణాడెల్టాకు నీరు

ప్రస్తుతం పట్టిసీమ నుంచి చాలినంత నీరు రావడంలేదని, అందువల్ల పులిచింతల నుంచి కృష్ణాడెల్టాకు నీరు ఇస్తున్నామని మంత్రి అంబటి రాంబాబు తెలిపారు. నీటిని రైతులు పొదుపుగా వాడుకోవాలని సూచించారు. వర్షాభావ పరిస్థితుల వల్ల రబీలో ఆరుతడి పంటలు వేసుకోవాలని కోరారు. వరి పంటను కాపాడేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.

చంద్రబాబు బాడీ చెకప్ చేయాలి

● టిడిపి ఎమ్మెల్సీ అశోక్ బాబు డిమాండ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాజమండ్రి జైల్లో ఉన్న తమ పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు బ్యారెక్‌లో ఎసి పెడితే చాలదని ఆయనకు బాడీ చెకప్ చేయాలని టిడిపి ఎమ్మెల్సీ అశోక్ బాబు డిమాండ్ చేశారు. టిడిపి కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 74 ఏళ్ల చంద్రబాబు డీహైడ్రేషన్, ఎలర్జీ సమస్యలతో బాధపడుతున్నారని, కేవలం డెర్మటాలజీ చెకప్ చేయిస్తే చాలదని తెలిపారు. జైళ్ల అధికారులు వైద్యులు చెప్పింది యథాతథంగా చెప్పడం లేదని, వివరాలు దాస్తున్నారని, హెల్త్ బులిటెన్ విడుదల చేయటం లేదని పేర్కొన్నారు. జైళ్ల డిఐజి రవికిరణ్ ఒక డాక్టర్‌లా వ్యవహరించారని, పాత మెడికల్ హిస్టరీ తెలుసుకోకుండా బాధ్యతారహితంగా మాట్లాడారని ఆగ్రహం వ్యక్తం చేశారు. చంద్రబాబు ఆరోగ్యంపై సజ్జల రామకృష్ణారెడ్డి, జైళ్ల డిఐజి, మంత్రులు ఇష్టమొచ్చినట్లు మాట్లాడుతున్నారని విమర్శించారు. జగన్ చంచల్‌గూడ జైల్లో ఎంజాయ్ చేసినట్లు చంద్రబాబు ఎంజాయ్ చేయటం లేదన్నారు. టిడిపి అధికారంలోకి వస్తే వైసిపి నాయకులు బయట తిరిగే పరిస్థితి ఉండదని హెచ్చరించారు. చంద్రబాబు ఆరోగ్యంతో జగన్ చెలగాటమాడటం దుర్మార్గపు చర్య అని సినీ నటుడు నారా రోహిత్ పేర్కొన్నారు. ఆయన ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతీయలేక భౌతికంగా ఇబ్బంది పెడుతున్నారని ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

వెంకట్రామిరెడ్డి జీవితం యువతరానికి స్ఫూర్తిదాయకం



వెంకట్రామిరెడ్డి సంతాపసభలో మాట్లాడుతున్న తెలకపల్లి రవి

● సంస్మరణ సభలో వక్తలు

ప్రజాశక్తి- కర్నూలు కార్పొరేషన్

వెంకట్రామిరెడ్డి జీవితం విద్యార్థులకు, యువతరానికి స్ఫూర్తిదాయకమని పలువురు వక్తలు పేర్కొన్నారు. కర్నూలు నగరంలోని కెకె.భవన్లో వెంకట్రామిరెడ్డి సంస్మరణ సభ ఎస్ఎఫ్ఐ కర్నూలు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. ఈ సభకు ఎస్ఎఫ్ఐ కర్నూలు జిల్లా కార్యదర్శి అబ్దుల్లా అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వెంకట్రామిరెడ్డి చిత్రపటానికి పూలమాలవేసి అతిథులు నివాళులర్పించారు. ఎస్ఎఫ్ఐ రాష్ట్ర మాజీ కార్యదర్శి వి.కృష్ణయ్య, ఎస్ఎఫ్ఐ జిల్లా మాజీ అధ్యక్షులు తెలకపల్లి రవి, మాజీ కార్యదర్శులు డాక్టర్ లక్ష్మీనారాయణ, ధనుంజయ, ఎస్ఎఫ్ఐ జిల్లా మాజీ నాయకులు ప్రభాకర్‌రెడ్డి, వెంకట్రామిరెడ్డి తమ్ముని కుమారుడు శేషాద్రిరెడ్డి తదితరులు మాట్లాడారు. వెంకట్రామిరెడ్డి అధ్యాపకునిగా పనిచేస్తూనే 1970వ సంవత్సరం డిసెంబర్‌లో తిరువనంతపురంలో జరిగిన ఎస్ఎఫ్ఐ వ్యవస్థాపక సమావేశంలో కర్నూలు జిల్లా నుండి పాల్గొన్న విద్యార్థి ప్రతినిధుల బృందానికి నాయకత్వం వహించారన్నారు. విద్యార్థి దశలోనే కమ్యూనిస్టు ఉద్యమంలోకి వచ్చారన్నారు. నిరంతరం అధ్యయనమే ఊపిరిగా భావించి తన ఇంటిని పుస్తకాల నిలయంగా మార్చారని తెలిపారు. ఒక అంశం పట్ల పూర్తి అవగాహనతో ఉండాలనే పట్టుదలతో వాటి గురించి తెలుసుకోవడానికి ఎంతగానో ఆసక్తి చూపేవారన్నారు. అధ్యాపకునిగా పనిచేస్తూనే ప్రజా ఉద్యమాల్లో చురుకైన పాత్ర పోషించారని, జిల్లాలో సిపిఎం ఉద్యమాభివృద్ధికి కృషి చేశారని గుర్తు చేశారు. మార్క్సిస్టు భావజాలంపై అచంచల విశ్వాసంతో చివరి శ్వాస విడిచే వరకు సిపిఎం అభిమానిగా, శ్రేయోభిలాషిగా ఉన్నారని వివరించారు. ఆయన ఆశయాల సాధనకు కృషే వెంకట్రామిరెడ్డికి అర్పించే నిజమైన నివాళని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ కర్నూలు జిల్లా ఉపాధ్యక్షులు సాయి, జిల్లా నాయకులు అంజి, అమర్‌బాబు, మల్లేష్, నగర నాయకులు యోగి, పలువురు ఎస్ఎఫ్ఐ మాజీ నాయకులు పాల్గొన్నారు.


రెండవ రోజు పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు

రసవత్తరంగా హ్యాండ్‌బాల్ పోటీలు

ప్రజాశక్తి - కడప

కడప నగరంలోని డిఎస్ఎ క్రీడామైదానం వేదికగా 9వ ఎపి హ్యాండ్‌బాల్ సీనియర్ మహిళలు, అండర్-19 బాలుర విభాగం ఛాంపియన్‌షిప్ పోటీలు రసవత్తరంగా సాగుతున్నాయి. రెండో రోజు ఆదివారం నిర్వహించిన మ్యాచ్‌లను హ్యాండ్‌బాల్ జిల్లా అసోసియేషన్ అధ్యక్షులు కె చిన్నపరెడ్డి ప్రారంభించారు.

హ్యాండ్‌బాల్ అండర్-19 విభాగంలో నిర్వహించిన పూల్ మ్యాచ్‌లో కడప జట్టు తూర్పుగోదావరి జట్టుపై విజయం సాధించింది. మరో మ్యాచ్‌లో పశ్చిమగోదావరి జట్టు శ్రీకాకుళంపై, శ్రీకాకుళం జట్టు తూర్పుగోదావరి జట్లుపై విజయం సాధించాయి. ఇంకో మ్యాచ్‌లో పశ్చిమగోదావరి జట్టు కడప జట్టుపై, చిత్తూరు జట్టు ప్రకాశం జట్టుపై, వైజాగ్ జట్టు కృష్ణాజట్టుపై, విజయనగరం జట్టు కర్నూలుపై గెలుపొందాయి. అనంతరం నిర్వహించిన క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లో విజయనగరం జట్టు గుంటూరుపై విజయం సాధించి సెమీఫైనల్‌కు చేరింది.సీనియర్ మహిళల విభాగంలో నిర్వహించిన క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లలో విజయనగరం, కృష్ణా జట్లు తలపడగా, కృష్ణా జట్టు విజయం సాధించి సెమీస్‌కు చేరింది. మరో మ్యాచ్‌లో కడప జట్టు తూర్పుగోదావరిపై విజయం సాధించి సెమీస్‌కు చేరుకుంది. మూడోమ్యాచ్‌లో వైజాగ్ జట్టు చిత్తూరుపై విజయం సాధించి సెమీఫైనల్‌కు చేరింది.

కొనసాగుతున్న ఎసిఎ సౌత్‌జోన్ క్రికెట్ మ్యాచ్‌లు

మొదటి ఇన్నింగ్స్ లో అనంతపురం జట్టు 284/8 డిక్లేర్

ప్రజాశక్తి - కడప

జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎసిఎ సౌత్ జోన్ అండర్ - 23 మెన్ మల్టీ డే క్రికెట్ టోర్నీలో భాగంగా ఆదివారం కెఒఆర్ఎం క్రికెట్ మైదానంలో ప్రారంభమైన మ్యాచ్‌లో అనంతపురం జట్టు ఎనిమిది వికెట్ల నష్టానికి 284 పరుగుల వద్ద డిక్లేర్ ప్రకటించింది. టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన అనంతపురం జట్టు 76.0 ఓవర్లలో ఎనిమిది వికెట్ల నష్టానికి 284 పరుగులు చేసి డిక్లేర్ ప్రకటించింది. ఆ జట్టులోని రోహిత్ రోషన్ 60 పరుగులు చేశాడు. కర్నూలు జట్టులోని సబ్జాన్ బాష నాలుగు వికెట్లు తీసుకున్నాడు. అనంతరం బ్యాటింగుకు దిగిన కర్నూలు జట్టు మొదటి రోజు ఆట ముగిసే సమయానికి 12.0 ఓవర్లలో ఒక వికెట్ నష్టానికి 26 పరుగులు చేసింది.


126 పరుగులు చేసిన తేజారెడ్డి

మొదటి ఇన్నింగ్స్‌లో చిత్తూరు జట్టు 219/10...

కెఎస్ఆర్ఎం క్రికెట్ మైదానంలో జరుగుతున్న మ్యాచ్‌లో చిత్తూరు, నెల్లూరు జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన చిత్తూరు జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 48.3 ఓవర్లలో 219 పరుగులకు ఆలౌట్ అయింది. ఆ జట్టులోని తేజ రెడ్డి అద్భుతంగా బ్యాటింగ్‌లో రాణించి 126 పరుగులు (సెంచరీ) చేశాడు. నెల్లూరు జట్టులోని నారాయణ మూడు, అఖిల్ సాలుంకే మూడు వికెట్లు తీసుకున్నారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన నెల్లూరు జట్టు మొదటి రోజు ఆట ముగిసే సమయానికి 39.0 ఓవర్లలో నాలుగు వికెట్ల నష్టానికి 129 పరుగులు చేసింది. ఆ జట్టులోని సోహన్ వర్మ 52 పరుగులు చేశాడు. చిత్తూరు జట్టులోని అనిల్ కుమార్, దీపన్ సాయినాథ్, సూర్య చరణ్, ఆశిష్ రెడ్డి ఒక్కో వికెట్ తీసుకున్నారు.

అసైన్డ్ భూముల్లో 90% పెద్దల చేతుల్లోనే

(మొదటి పేజీ తరువాయి)

వెళ్ళిపోయాయి.

ఆర్డినెన్స్‌తో పేదల భూములు కాజేసే ప్రమాదం

అసైన్డ్ భూముల లబ్ధిదారుల రక్షణకు అనేక చట్టాలున్నా ఆచరణలో అవి అమలు కావడం లేదు. దీంతో, ఈ భూములు ఎక్కువ మొత్తం భూస్వాములు, పెద్దల చేతుల్లోకి వెళ్లిపోయాయి. భూములపై లబ్ధిదారులకు హక్కులు కల్పిస్తామని చెబుతూ ప్రభుత్వం ఆర్డినెన్స్ తీసుకొచ్చింది. ఈ ఆర్డినెన్స్‌తో భూములను అమ్ముకోవచ్చని ఆశ చూపి పేదల వద్ద ఉన్న ఆ కొద్ది అసైన్డ్ భూములను పెద్దలు కాజేసే ప్రమాదం ఏర్పడింది.

-ఆర్.రఘు, వ్యవసాయ కార్మిక సంఘం కృష్ణా జిల్లా ఉపాధ్యక్షులు

మండలం	అసైన్డ్ భూములు (ఎకరాల్లో)	హక్కులు కల్పించడానికి గుర్తించినది (ఎకరాల్లో)
అవనిగడ్డ	27.93	0.00
కృత్తివెన్ను	8,512.44	752.78
కోడూరు	3,729.12	746.83
గూడూరు	9.22	0.00
ఘంటసాల	31.92	6.36
చల్లపల్లి	699.13	75.09
నాగాయలంక	6170.71	924.27
పెడన	337.18	11.94
బంటుమిల్లి	5,960.06	170.32
మోపిదేవి	3733.23	24.85
మచిలీపట్నం డివిజన్	**32278.88**	**2997.64**
ఉంగుటూరు	18.60	5.85
గన్నవరం	86.79	57.91
గుడివాడ	27.82	3.35
గుడ్లవల్లేరు	90.40	11.49
నందివాడ	80.81	0.56
పెదపారుపూడి	5.41	0.00
బాపులపాడు	1034.82	281.95
గుడివాడ డివిజన్	**1344.64**	**361.11**
ఉయ్యూరు	13.19	2.83
కంకిపాడు	1.05	0.11
పామర్రు	30.61	16.35
పెనమలూరు	37.84	4.09
మొవ్వ	24.37	11.07
ఉయ్యూరు డివిజన్	**107.06**	**34.45**

మొత్తం మూడు డివిజన్‌లో అసైన్డ్ భూములు 33730.58 ఎకరాలు
హక్కులు కల్పించడానికి గుర్తించిన భూములు 3,393.40 ఎకరాలు

చంద్రబాబు గదిలో టవర్ ఎసి ఏర్పాటు

● సెంట్రల్ జైలు సూపరింటెండెంట్ వెల్లడి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి

తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని సెంట్రల్ జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్న చంద్రబాబు గదిలో టవర్ ఎసిని ఏర్పాటు చేశామని డిప్యూటీ జైలు సూపరింటెండెంట్ రాజ్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎసిబి కోర్టు ఆదేశాల మేరకు ఈ చర్యలు చేపట్టామని తెలిపారు. ఇటీవల జైలులో ఉన్న చంద్రబాబు చర్మ సంబంధిత వ్యాధితో బాధపడుతున్నారన్నారు. ఉక్కపోత వల్ల ఇబ్బందులు పడుతున్నట్టు వైద్యులు గుర్తించారని తెలిపారు. ఎసిబి కోర్టు ఆదేశాల మేరకు చంద్రబాబు ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని టవర్ ఎసిని ఏర్పాటు చేశామని వెల్లడించారు. అలాగే చంద్రబాబు హెల్త్ బులెటిన్‌ను విడుదల చేశారు. ఆయన ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని పేర్కొన్నారు. బ్లడ్ ప్రెషర్ 140/80, పల్స్ - 70/మినిట్, శరీర ఉష్ణోగ్రత నార్మల్‌గా ఉందని తెలిపారు. ఊపిరితిత్తులు, హార్ట్‌బీట్ సక్రమంగా ఉందని పేర్కొన్నారు. ప్రస్తుతం ఆయన బరువు 67 కేజీలు ఉన్నారని ప్రకటనలో వెల్లడించారు.


మాట్లాడుతున్న మంత్రి ఆర్‌కె రోజా

సంస్కృతీ సంప్రదాయాలను కాపాడుకోవాలి

● వెంపటి చినసత్యం జయంతి వేడుకలో మంత్రి రోజా

ప్రజాశక్తి - మొవ్వ (కృష్ణా జిల్లా)

కూచిపూడి నృత్యాన్ని విశ్వవ్యాప్తం చేసిన డాక్టర్ వెంపటి చినసత్యం మహానీయులని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి ఆర్‌కె రోజా కొనియాడారు. పద్మభూషణ్ అవార్డు గ్రహీత డాక్టర్ వెంపటి చిన సత్యం జయంతి వేడుకలను కృష్ణా జిల్లా మొవ్వ మండలం కూచిపూడి గ్రామంలోని శ్రీ సిద్ధేంద్ర యోగి కళాక్షేత్రంలో రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ, సేవ్ కూచిపూడి ఆర్టిస్ట్, కూచిపూడి అకాడమీ చెన్నై, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, జయహో భారతీయం సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి రోజా మాట్లాడుతూ మన సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. డాక్టర్ వెంపటి చిన్న సత్యం మరణించి 13 సంవత్సరాల అయినప్పటికీ వారి శిష్యులు ప్రదర్శించే హావభావాలు నృత్యంలో సజీవమై కనిపిస్తున్నారని తెలిపారు. తల్లిదండ్రులు తమ ఆడ పిల్లలను కూచిపూడి నృత్యం నేర్చుకునేందుకు ప్రోత్సహించాలని, తద్వారా వారికి వ్యాయామంతోపాటు ఆరోగ్యం కూడా పొందుతారని చెప్పారు. ఈ కార్యక్రమంలో మంత్రి జోగి రమేష్, ప్రముఖ నర్తకి, కేంద్ర సంగీత నాటక అకాడమీ అవార్డు గ్రహీత మంజు భార్గవి, కేంద్ర సంగీత నాటక అకాడమీ సభ్యులు ఎస్‌పి భారతి, రాష్ట్ర సృజనాత్మక సంస్కృతి సమితి చైర్‌పర్సన్ వంగపండు ఉష, అధికార బాషా సంఘం సభ్యులు డాక్టర్ డి.మస్తానమ్మ పాల్గొన్నారు.



బండి శ్రీనివాసరావును సన్మానిస్తున్న అసోసియేషన్ నాయకులు

పంచాయతీరాజ్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

● ఎపి జెఎసి చైర్మన్ బండి శ్రీనివాసరావు

ప్రజాశక్తి-గుంటూరు

పంచాయతీరాజ్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎపి జెఎసి చైర్మన్ బండి శ్రీనివాసరావు అన్నారు. గుంటూరులోని జడ్‌పి సమావేశ మందిరంలో ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర విస్తృత స్థాయి సమావేశం ఆదివారం జరిగింది. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ రికార్డు, ల్యాబ్, లైబ్రరీ అసిస్టెంట్‌లు సుమారు 30 సంవత్సరాల నుండి ఉద్యోగాలు చేస్తున్నా ప్రమోషన్లు పొందలేని స్థితిలో ఉండడం బాధాకరమని అన్నారు. ఎంపిడిఒ ప్రమోషన్లలో ఎఒలకు 34 శాతం కోటా గురించి ప్రభుత్వ పెద్దలతో మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు. ఎపిఎన్‌జిఒ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.వి.శివారెడ్డి మాట్లాడుతూ పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో తమవంతు కృషి చేస్తామన్నారు. అనంతరం ఇప్పటి వరకూ పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులుగా పనిచేసి, ఎంపిడిఒగా ఉద్యోగోన్నతి పొందిన బి శ్రీనివాసరావును నాయకులు సత్కరించారు. కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర జనరల్ సెక్రెటరీ ఆర్.నాగిరెడ్డి, రాష్ట్ర అసోసియేట్ ప్రెసిడెంట్ ఆర్.వి.రమేష్, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీ కూచిపూడి మోహనరావు, తదితరులు పాల్గొన్నారు.



రంపచోడవరంలో ఆదివాసీ అరణ్యఘోష ప్రదర్శన

ఎర్రజెండాతోనే ఏజెన్సీ అభివృద్ధి

(మొదటి పేజీ తరువాయి)

బిజెపి ప్రభుత్వం నిర్వీర్యం చేస్తూ గిరిజన హక్కులను కాలరాస్తోందన్నారు. అడవులు, కొండలపై హక్కు లేకుండా చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ దుశ్చర్యలను యావత్తు గిరిజనం ప్రతిఘటించాలని కోరారు. వారికి సిపిఎం అండగా ఉంటుందన్నారు. ఏజెన్సీ అభివృద్ధికి కేంద్రం నుంచి రావాల్సిన నిధులు రావడం లేదన్నారు. అధికారంలో ఉన్న వైసిపి ఈ విషయమై ప్రశ్నించకుండా బిజెపికి వంతపాడుతూ గిరిజనులకు అన్యాయం చేస్తోందని విమర్శించారు. ఆదివాసీల సంక్షేమాన్ని రాష్ట్ర ప్రభుత్వం గాలికొదిలేసిందన్నారు. ఏజెన్సీలో గిరిజన యువత సరైన ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కరువై వలసలు పోతోందని తెలిపారు. అటవీ సంపదను కార్పొరేట్ శక్తులకు దోచిపెట్టే కుట్రలు జోరుగా సాగుతున్నాయని, వీటిని గిరిజనులు తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. మణిపూర్‌లో ఆదివాసీల మధ్య బిజెపి ఎలాంటి ఘర్షణలు సృష్టించిందో వివరించారు. ఆ చిచ్చులో వేలాది మంది ఆదివాసీలకు తీవ్ర నష్టం జరిగిందన్నారు. జాతీయ స్థాయిలో ఇండియా వేదిక బలపడుతుండడంతో బిజెపి భయపడి కుట్రలకు దిగుతోందని విమర్శించారు. బిజెపి డైరక్షన్‌లో వెళ్లి వైసిపి ప్రభుత్వం నేడు చంద్రబాబును అరెస్టు చేసి జైల్లో పెట్టినప్పటికీ.. బిజెపిని టిడిపి పల్లెత్తు మాట్లాడే ధైర్యం చేయడం లేదన్నారు. గత టిడిపి, నేటి వైసిపి ప్రభుత్వాల వల్ల పోలవరం నిర్వాసితులకు అన్యాయమే జరిగిందన్నారు. నిర్వాసితుల సమస్యలను పూర్తిగా పరిష్కరించాకే ప్రాజెక్టు నిర్మాణ పనులు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఎపికి ప్రత్యేక హోదా సహా ఇతర హక్కుల కోసం తాము పోరాడుతున్నామన్నారు. పెట్టుబడిదారులకు వత్తాసు పలికే బిజెపి, వైసిపి, టిడిపి, జనసేన పార్టీలకు రాష్ట్ర ప్రజలను ఓటు అడిగే నైతిక హక్కు లేదని విమర్శించారు. ఆ పార్టీలను ప్రజలు తిరస్కరించాలని కోరారు. గిరిజనులు, కార్మికులు, కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ సిబ్బంది, ప్రజల పక్షాన నిరంతరం పోరాడుతున్న సిపిఎం అభ్యర్థులను అసెంబ్లీకి పంపడం ద్వారా సమస్యలు పరిష్కరించుకునే అవకాశముందన్నారు. ఆ దిశగా ప్రజలు ఆలోచించాలని కోరారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం, వి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రజల ఓట్లతో గెలిచి ప్రజలను దోచుకునే పార్టీలను ఈసారి ప్రజలు ఓడించాలని విజ్ఞప్తి చేశారు. పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు కె.ధనలక్ష్మి, ఎవి.నాగేశ్వరరావు, విఆర్.పురం ఎంపిపి కారం లక్ష్మి, విద్యార్థి సంఘం నాయకులు కె.ప్రసన్న కుమార్, సిపిఎం జిల్లా నాయకులు మర్లపాటి నాగేశ్వరరావు, లోతా రాంబాబు, మట్ల వాణిశ్రీ, కుంజం సీతారామయ్య తదితరులు పాల్గొన్నారు. సభ ప్రారంభానికి ముందు స్థానిక ఐటిడిఎ కార్యాలయం నుంచి జూనియర్ కళాశాల వరకు భారీ ప్రదర్శన నిర్వహించారు. ఈ ప్రదర్శనలో గిరిజన నృత్యాలు ప్రజలను ఉత్సాహపరిచాయి.

ఏళ్లు గడుస్తున్నా దళితులపై ఆగని వివక్ష

- పోరాటాలతోనే సమస్యల పరిష్కారం
- మోడీ పాలనలో ప్రమాదంలో భారత రాజ్యాంగం
- రాష్ట్ర దళిత సదస్సులో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు



రాష్ట్ర సదస్సులో మాట్లాడుతున్న వి.శ్రీనివాసరావు

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

స్వాతంత్ర్యం వచ్చి 76 ఏళ్లు గడుస్తున్నా నేటికీ దళితులు కుల వివక్షను ఎదుర్కొంటున్నారని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు అన్నారు. బిజెపి అధికారంలోకొచ్చిన తర్వాత అగ్రకుల దురహంకారులు, మనువాదులు మరింత పేట్రేగిపోతున్నారని, ఈ తరుణంలో దళితుల సమస్యలు పరిష్కారం కావాలంటే పోరాటమే మార్గమని తెలిపారు. దళితుల సమస్యలపై కాకినాడలోని సూర్య కళామందిరంలో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు అంద్ర మాల్యాద్రి అధ్యక్షతన రాష్ట్ర దళిత సదస్సు ఆదివారం జరిగింది. ఈ సదస్సులో శ్రీనివాసరావు మాట్లాడుతూ.. సామాజిక న్యాయం కావాలని, కులవివక్ష పోవాలని, సమసమాజ స్థాపన కోసం కమ్యూనిస్టులు కృషి చేస్తున్నారని తెలిపారు. ఎస్‌సి సబ్ ప్లాన్ దేశంలోనే మొదటిసారి ఆంధ్రప్రదేశ్‌లో అమలు పరచడానికి దళితులు, వామపక్షాలు చేసిన పోరాటాలే కారణమన్నారు. నేడు సబ్‌ప్లాన్ నిధులను జగన్ ప్రభుత్వం ఇతర అవసరాలకు తరలించి దళితులకు అన్యాయం చేసిందని తెలిపారు. జగనన్న కాలనీలు ఆధునిక వంటరి కివాడలుగా మారాయని విమర్శించారు. బీహార్‌లో మాదిరిగా రాష్ట్రంలోనూ కేంద్రంతో సంబంధం లేకుండా కుల గణన నిర్వహించాలని డిమాండ్ చేశారు. అంబేద్కర్ రచించిన రాజ్యాంగాన్ని కాపాడుకోవాలని కోరారు. రాష్ట్రంలో అధికార పార్టీతో పాటు టిడిపి, జనసేన పార్టీ కూడా బిజెపి వెంటే ఉన్నాయన్నారు. కుల వివక్షను పెంచి పోషిస్తోన్న బిజెపికి సమాధి కట్టే సమయం ఆసన్నమైందని తెలిపారు. 2024లో బిజెపి ప్రభుత్వాన్ని భూస్థాపితం చేయాలని పిలుపునిచ్చారు. సామాజిక న్యాయం, ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ కోసం, అసమానతలు లేని అభివద్ధి కోసం, ఎస్‌సి, ఎస్‌టి సబ్ ప్లాన్ చట్టం అమలు కోసం సిపిఎం ప్రజా రక్షణ బేరి కార్యక్రమం నిర్వహిస్తుందని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా మూడు బస్సు యాత్రలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు దడాల సుబ్బారావు మాట్లాడుతూ అసమానతలు లేని అభివద్ధి కోసం రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లోనూ వివిధ సమస్యలపై సదస్సులు నిర్వహిస్తున్నామని తెలిపారు. దీనిలో భాగంగానే దళితుల స్థితిగతులను తెలుసుకొని వారి సమస్యలను పరిష్కరించడంతోపాటు సిపిఎం ప్రత్యామ్నాయ మార్గాలను సూచించిందన్నారు.

దళిత యువకుడిని హత్య చేసి నేరుగా డోర్ డెలివరీ చేసిన ఎమ్మెల్సీ అనంతబాబు వంటి వ్యక్తులను ప్రభుత్వం వెనకేసుకుని రావడం సరికాదన్నారు. ఎమ్మెల్సీ ఇళ్ల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కుల నిర్మూలన కోసం దళిత సమస్యల పరిష్కారం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సీనియర్ దళిత నాయకులు అయితాబత్తుల రామేశ్వరరావు మాట్లాడుతూ బిజెపి, వైసిపి పాలనలో దళితులపై దాడులు విపరీతంగా పెరిగాయన్నారు. నేటికీ అనేక గ్రామాల్లో వివక్షను ఎదుర్కొంటున్నారని తెలిపారు. సదస్సులో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు ఎవి.నాగేశ్వరరావు, రాష్ట్ర నాయకులు నల్లప్ప, సిఐటియు అఖిలభారత ఉపాధ్యక్షులు జి.బేబిరాణి, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు, ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

దసరా రద్దీ నేపథ్యంలో... కాచిగూడ- కాకినాడ మధ్య ప్రత్యేక రైళ్లు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

దసరా పండుగ నేపథ్యంలో ప్రయాణికుల రద్దీని దృష్టిలో పెట్టుకుని కాచిగూడ - కాకినాడ మధ్య ప్రత్యేక రైళ్లు నడుపుతున్నట్లు దక్షిణ మధ్య రైల్వే పేర్కొంది. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేసింది. ఈనెల 19, 26 తేదీల్లో కాచిగూడ నుంచి ప్రత్యేక రైలు (07653) రాత్రి 8.30 గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 8 గంటలకు కాకినాడ పట్టణానికి చేరుకుంటుంది. తిరిగి ఈనెల 20, 27 తేదీల్లో కాకినాడ పట్టణం నుంచి ప్రత్యేక రైలు (7654) సాయంత్రం 5.10 గంటలకు బయలుదేరి మరుసటి రోజు తెల్లవారుజామున 4.50 గంటలకు కాచిగూడ చేరుకోనుంది. ఇది మల్కాజ్‌గిరి, నల్గొండ, పిడుగురాళ్ల, గుంటూరు, విజయవాడ, ఏలూరు, తాడేపల్లిగూడెం, నిడదవోలు, రాజమండ్రి, సామర్లకోట స్టేషన్లలో ఆగుతుందని దక్షిణ మధ్య రైల్వే అధికారులు తెలిపారు.

నేడు సిఎం విశాఖ, అనకాపల్లి జిల్లాల పర్యటన

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

సిఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈనెల 16న విశాఖపట్టణం, అనకాపల్లి జిల్లాల్లో పర్యటించి పలు ప్రారంభోత్సవ కార్యక్రమాల్లో పాల్గొననున్నారు. సోమవారం ఉదయం 9 గంటలకు తాడేపల్లి నుంచి బయలుదేరి విశాఖకు చేరుకుంటారు. మధురవాడ ఐటి హిల్ నెంబరు 2 వద్ద ఇన్ఫోసిస్ డెవలప్‌మెంట్ సెంటర్ ప్రారంభోత్సవం చేస్తారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో పాల్గొని ప్రసంగిస్తారు. అనంతరం హెలీప్యాడ్ వద్ద జివిఎంసి బీచ్ క్లీనింగ్ మిషన్లను ప్రారంభిస్తారు. అక్కడ నుంచి అనకాపల్లి జిల్లా పరవాడ బయలుదేరి వెళ్తారు. స్థానికంగా జవహర్‌లాల్ నెహ్రూ ఫార్మాసిటీలో యుజియా స్టెరైల్ ప్రైవేట్ లిమిటెడ్ ప్రారంభోత్సవంలో పాల్గొంటారు. అనంతరం అచ్యుతాపురం సెజ్‌కు చేరుకుని లారస్ ల్యాబ్స్ యూనిట్ 2 ఫార్ములేషన్ బ్లాక్ ప్రారంభిస్తారు. సాయంత్రం బయలుదేరి తాడేపల్లి చేరుకుంటారు.

అధికారులు సమన్వయంతో పని చేయాలి

- రాష్ట్ర ప్రణాళిక మండలి ఉపాధ్యక్షులు మల్లాది విష్ణు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

అధికారులంతా సమన్వయంతో పని చేసి, ఇంద్రకీలాద్రి దుర్గమ్మ అమ్మవారిని దర్శించుకునే వారికి అన్ని సౌకర్యాలు కల్పించాలని రాష్ట్ర ప్రణాళిక మండలి ఉపాధ్యక్షులు మల్లాది విష్ణు అన్నారు. ఆదివారం కనకదుర్గమ్మను ఆయన కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. అనంతరం మీడియా పాయింట్ వద్ద విష్ణు మాట్లాడుతూ సందర్శకులకు ఇబ్బందులు కలగకుండా అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయాలని అధికారులకు సూచించారు. పారిశుధ్యం, మంచినీరు, పసిపిల్లలకు పాలు పంపిణీ వంటి అంశాలపై జాగ్రత్తగా వ్యవహరించాలన్నారు. ఆయన వెంట ఆలయ కమిటీ చైర్మన్ కర్నాటి రాంబాబు ఉన్నారు.

ఆరోగ్యాన్ని ప్రాథమిక హక్కుగా గుర్తించాలి

- ప్రభుత్వాస్పత్రుల్లో వైద్యులు, సిబ్బందిని పెంచాలి
- 'వైద్యం-ప్రజారోగ్యం'పై రాష్ట్ర స్థాయి సదస్సులో వక్తలు



మాట్లాడుతున్న కెఎస్ లక్ష్మణరావు

ప్రజాశక్తి - గుంటూరు

రాజ్యాంగంలో విద్య మాదిరిగా వైద్యాన్నీ ప్రాథమిక హక్కుగా గుర్తించాలని ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు, ప్రజారోగ్య వేదిక నాయకులు డిమాండ్ చేశారు. ప్రయివేటీకరణ, కార్పొరేటీకరణ పెరిగిన నేపథ్యంలో సామాన్యుడికి వైద్యం ఆర్థిక భారం అవుతోందని తెలిపారు. 'వైద్యం-ప్రజారోగ్యం'పై సిపిఎం ఆధ్వర్యంలో గుంటూరులోని ఆ పార్టీ కార్యాలయంలో రాష్ట్ర స్థాయి సదస్సు ఆదివారం నిర్వహించారు. ఎన్ఆర్ఐ మెడికల్ కాలేజీ ప్రొఫెసర్ డాక్టర్ ఎ.సత్యనారాయణ ప్రసాద్ అధ్యక్షతన జరిగిన సదస్సును లక్ష్మణరావు ప్రారంభించి మాట్లాడారు. రాష్ట్రంలోని పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో 1700 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, 175 సిహెచ్‌సిలు, 53 ఏరియా ఆస్పత్రులు, జిల్లా ఆస్పత్రులు ఉన్నాయని తెలిపారు. అన్ని స్థాయిల్లోనూ వైద్యులు, సిబ్బంది కొరత తీవ్రంగా ఉందన్నారు. భవనాలు కడితే సరిపోదని, వైద్యులు, మందులను అందుబాటులో ఉంచాల్సిన అవసరం ఉందని తెలిపారు. మంగళగిరి ఎయిమ్స్ లో ఇన్‌పేషెంట్ వైద్యం అందుబాటులోకి తేవాలని, తాగునీటి సదుపాయం కల్పించాలని కోరారు. 'కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆరోగ్య విధానాలు-ప్రస్తుత పరిస్థితులు' అంశంపై మాజీ ఎమ్మెల్సీ, జెవివి రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ గేయానంద్ మాట్లాడుతూ.. ఆరోగ్యం అంటే రోగం లేకుండా ఉండడమే కాదని, సామాజిక, ఆర్థిక, మానసిక పరిస్థితులు బాగుండాలని తెలిపారు. వైద్యంపై ఖర్చులు పెరిగిపోవడం వల్ల ప్రతి ఏటా దేశంలో తొమ్మిది కోట్ల మంది ప్రజలు దారిద్ర్యరేఖకు దిగువకు నెట్టబడుతున్నారని అన్నారు. ఆరోగ్య సురక్ష క్యాంపులే అన్ని సమస్యలకు పరిష్కారం అన్నట్లుగా ప్రభుత్వం వ్యవహరించడం సరికాదని, సమగ్రమైన వైద్య విధానం అవసరమని తెలిపారు. ప్రపంచ బ్యాంకు సంస్కరణలు అమల్లోకి వచ్చినప్పటి నుండి దేశంలో వైద్యం బాధ్యత నుండి ప్రభుత్వాలు వైదొలుగుతూ ఆరోగ్య బీమాను ప్రోత్సహిస్తున్నాయని విమర్శించారు. ఆయుష్మాన్ భారత్, ఆరోగ్యశ్రీ వంటివి ఈ కోవలోకే వస్తాయన్నారు. 'ఆంధ్రప్రదేశ్‌లో ప్రజారోగ్యం- ప్రస్తుత పరిస్థితులు' అనే అంశంపై నెల్లూరు పీపుల్స్ పాలీక్లినిక్ సూపరింటెండెంట్ డాక్టర్ బి.రాజేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్రంలో ఇటీవల ఏర్పాటు చేసిన ఐదు మెడికల్ కాలేజీల్లో దాదాపు సగం సీట్లు వివిధ రకాల ధరలకు విక్రయిస్తూ వైద్య విద్య వ్యాపారానికి తెరతీసిందని, ఇది భవిష్యత్‌లో చాలా ప్రమాదకరమని తెలిపారు. ప్రజారోగ్య వేదిక రాష్ట్ర గౌరవాధ్యక్షులు డాక్టర్ కె.సాయిప్రసాద్ ఆరోగ్య హక్కు చట్టం-2023 ముసాయిదాపై ప్రసంగించారు. ఇటీవల రాజస్థాన్ ప్రభుత్వం ఆరోగ్యాన్ని హక్కుగా చేసిన విధంగా రాష్ట్రంలోనూ చేయాలన్నారు. అందుకుగాను ప్రజారోగ్య వేదిక ముసాయిదా ప్రతిని తయారు చేసినట్లు చెప్పారు. దీనిద్వారా వైద్యాన్ని ప్రజలకు పూర్తి ఉచితంగా అందించాల్సి ఉంటుందని తెలిపారు. సదస్సులో ప్రజారోగ్యవేదిక రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ ఎం.వి.రమణయ్య, రాష్ట్ర కార్యదర్శి టి.కామేశ్వరరావు, గుంటూరు నగర ప్రముఖ వైద్యులు డాక్టర్ గొంది శివరామకృష్ణ, ప్రజారోగ్య వేదిక నాయకులు ఎల్.ఎస్.భారవి, సిపిఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు, నగర కార్యదర్శి కె.నళినీకాంత్ పాల్గొన్నారు.


నందివెలుగు కూడలిలో రాస్తారోకో

సాగునీటి కోసం రైతుల రాస్తారోకో

- వరిపైరు ఎండిపోతోందని కొడవలిని మెడకు పెట్టుకున్న రైతు వినూత్న నిరసన
- కలెక్టర్ హామీతో ఆందోళన విరమణ

ప్రజాశక్తి-తెనాలి/తెనాలిరూరల్ (గుంటూరు జిల్లా)

గుంటూరు జిల్లాలో హైలెవల్ ఛానల్ పరిధిలోని దుగ్గిరాల, కొలకలూరు, హాఫ్‌పేట, ఖాజీపేట ప్రాంతాల్లో భూములకు సాగునీరు అందక పంటలు ఎండిపోతున్నాయని తెనాలి మండలంలోని నందివెలుగు కూడలిలో రైతులు ఆదివారం మానవహారంగా ఏర్పడి రాస్తారోకో నిర్వహించారు. ఎండిపోతున్న పైరును తీసుకొచ్చి ఆందోళన చేశారు. తాను సాగు చేస్తున్న పదెకరాల వరి పొలం ఎండిపోయి బీటలు వారిందని ఓ రైతు కొడవలిని మెడకు పెట్టుకుని నిరసన తెలిపారు. మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ రైతులకు మద్దతుగా ఆందోళనలో పాల్గొన్నారు. డెల్టా ప్రాంతంలో ప్రస్తుతం ఎనిమిది వేల క్యూసెక్కుల నీరు అవసరం కాగా మూడువేల క్యూసెక్కులే విడుదల చేస్తే ఎలా సరిపోతుందని ప్రశ్నించారు. ఎకరాకు కౌలు, పెట్టుబడి మొత్తంగా దాదాపు రూ.50 వేలవుతోందని, రైతు కన్నీరు పెడుతుంటే వ్యవసాయ, నీటి పారుదల శాఖ మంత్రులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. కృష్ణా జలాలపై హక్కులు వదిలేసేందుకు జగన్ సిద్ధపడ్డారని, ఇది చేతకాని ప్రభుత్వమని ధ్వజమెత్తారు. ధర్నా వద్దకు చేరుకున్న ఇఇ ఎస్.మల్లికార్జున, దుగ్గిరాల డిఇ ఎన్‌కెవి ప్రసాద్‌లను రైతులు అడ్డుకోవడంతో వారు కలెక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడారు. సాగునీరు విడుదల చేస్తామని హామీ ఇవ్వడంతో రాస్తారోకో విరమించారు. కార్యక్రమంలో రైతులతో పాటు టిడిపి నాయకులు నక్కా ఆనందబాబు, పి.మాణిక్యరావు, కె.చంద్రమోహన్ తదితరులు పాల్గొన్నారు.

జనసేనతో సమన్వయం కోసం టిడిపి కమిటీ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

జనసేన పార్టీతో సమన్వయం కోసం టిడిపి కమిటీని నియమించింది. వచ్చే ఎన్నికల్లో టిడిపి - జనసేన కలిసి పోటీ చేస్తాయని ఇరు పార్టీల నాయకులు ప్రకటించిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా ఏర్పాటు చేసిన టిడిపి కమిటీలో ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు అచ్చెన్నాయుడు, పొలిట్‌బ్యూరో సభ్యులు యనమల రామకృష్ణుడు, ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్, మాజీ మంత్రి పితాని సత్యనారాయణ, మాజీ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య ఉన్నారు.

పాలిటెక్నిక్ విద్యార్థులకు కొత్త పుస్తకాలు

- సులువుగా అర్థమయ్యే విధంగా కూర్పు
- ఈ విద్యా సంవత్సరం ఫస్ట్ ఇయర్ బుక్స్

ప్రజాశక్తి- విజయవాడ ప్రతినిధి

పాలిటెక్నిక్ కోర్సుల అకడమిక్ బుక్స్‌పై అధికారులు దృష్టి సారించారు. సిలబస్‌కు అనుకూలంగా పాఠ్యపుస్తకాలను తయారు చేయాలని నిర్ణయించి ఆ మేరకు ఆయా సబ్జెక్టుల్లో అనుభవం కలిగిన ప్రిన్సిపళ్లు, లెక్చరర్ల సహకారంతో బుక్స్ రూపకల్పన చేపట్టారు. గతంలో పాఠ్యాంశాలకు సంబంధించి పుస్తకాల ఎంపికలో విద్యార్థుల్లో కన్ఫ్యూజన్ ఉండేది. ఒక సబ్జెక్టుకు సంబంధించి అనేక పుస్తకాలు మార్కెట్‌లో ఉండడంతో ఏది చదవాలనే దానిపై తికమకపడేవారు. దీనికి తోడు వీటి ధరలు కూడా అధికంగా ఉండేవి. ఒక్కో విద్యార్థికీ ఏడాదికి సగటున రూ. 3 వేల నుంచి రూ.4 వేల వరకు వెచ్చించాల్సి వచ్చేది. ఈ నేపథ్యంలో ఈ సమస్యలకు చెక్ పెట్టాలని బోర్డ్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ తక్కువ ధరలకే అకడమిక్ పుస్తకాలను అందుబాటులోకి తేవాలని నిర్ణయించినట్లు అధికారులు చెప్తున్నారు. తొలుత పాలిటెక్నిక్ మొదటి సంవత్సరం చదువుతున్న వారికి వీటిని అందుబాటులోకి తేవాలని తలపెట్టారు. ఆటోమొబైల్, సివిల్, మెకానికల్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్, కంప్యూటర్ ఇంజనీరింగ్‌తో కలిపి ఆరు విభాగాలకు 17 థియరీ పాఠ్యపుస్తకాలు, పది ల్యాబ్ మాన్యువల్స్ రూపొందించారు. 2023-24 విద్యా సంవత్సరం నుంచి వీటిని అందుబాటులోకి తేనున్నారు. వచ్చే ఏడాది సెకెండ్ ఇయర్‌కు, ఆ తర్వాత థర్డ్ ఇయర్‌కు తయారు చేయనున్నారు. మామూలు ధరల కంటే రూ. 20 శాతం తక్కువ రేట్లకు విద్యార్థులకు అందించనున్నట్లు అధికారులు చెప్తున్నారు.

ప్రశాంతంగా ఎస్‌ఐ రాత పరీక్షలు

- పోలీసు రిక్రూట్‌మెంట్ బోర్డు చైర్మన్ అతుల్‌సింగ్

ప్రజాశక్తి-అమరామతి బ్యూరో

రాష్ట్రంలో గత రెండు రోజులుగా నిర్వహిస్తున్న ఎస్‌ఐ రాత పరీక్షలు ప్రశాంతంగా ముగిసినట్లు పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు ఛైర్మన్ అతుల్ సింగ్ తెలిపారు. ఆదివారం ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రవ్యాప్తంగా విశాఖపట్నం, ఏలూరు, గుంటూరు, కర్నూల్‌లో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. దరఖాస్తు చేసిన వారిలో పేపర్ 1కు 98.09 శాతం మంది అటెండ్ అయినట్లు ఆయన పేర్కొన్నారు. పేపర్-2 పరీక్షకు 98.03 శాతం మంది హాజరైనట్లు తెలిపారు. 15వ తేదీన నిర్వహించిన పరీక్షల్లో పేపర్-3కు 98శాతం అభ్యర్థులు హాజరైనట్లు పేర్కొన్నారు. పేపర్-4 పరీక్షల్లో 633 మంది అభ్యర్థులు గైర్హాజరు కాగా, 97.97శాతం అభ్యర్థులు హాజరైనట్లు బోర్డు చైర్మన్ అతుల్‌సింగ్ తెలిపారు.

చంద్రబాబు ఆరోగ్యాన్ని దెబ్బతీసే కుట్ర

- ఎంపి కింజరాపు రామ్మోహన్ నాయుడు

ప్రజాశక్తి - పొందూరు (శ్రీకాకుళం)

అక్రమంగా అరెస్టు చేసిన మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును ఎక్కువ రోజులు జైల్లో ఉంచి ఆయన ఆరోగ్యాన్ని, టిడిపిని దెబ్బతీయాలని వైసిపి ప్రభుత్వం కుట్ర పన్నిందని ఎంపి కింజరాపు రామ్మోహన్ నాయుడు ఆరోపించారు. శ్రీకాకుళం పొందూరు మండలం కృష్ణాపురంలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. చంద్రబాబుపై రాజకీయ కక్షతో తప్పుడు కేసులు పెట్టి అక్రమంగా అరెస్టు చేశారని, జాతికి మంచి చేసే నాయకుడిని కాపాడుకునే ఉద్యమంలో ప్రతిఒక్కరూ భాగస్వాములై పోరాటం చేస్తున్నారని చెప్పారు. చంద్రబాబు ఆరోగ్యంపై రాష్ట్ర ప్రజలు ఆందోళన చెందుతున్నారని, బరువు తగ్గడంతో పాటు చర్మ సంబంధ సమస్యలు తలెత్తడం ద్వారా ఆయన్ను ఆరోగ్యపరంగా ఇబ్బంది పెట్టాలనే ప్రభుత్వ ఆలోచనను తిప్పికొట్టాలని కోరారు. దీన్ని న్యాయస్థానాలు పరిగణనలోకి తీసుకోవాలన్నారు. టిడిపి జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్ మాట్లాడుతూ చంద్రబాబు కడిగిన ముత్యంలా బయటకు వస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. సాధు పరిషత్ రాష్ట్ర అధ్యక్షులు శ్రీనివాసానంద సరస్వతి మాట్లాడుతూ వైసిపి ప్రజా వ్యతిరేక పాలనను ప్రశ్నించే వారిని ఇబ్బందులకు గురిచేసి, వారి గొంతులను నొక్కుతున్నారని విమర్శించారు. సమావేశంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి కిమిడి రామ్‌మల్లిక్‌నాయుడు, మండల అధ్యక్షుడు చిగిలిపల్లి రామ్మోహన్, తెలుగు యువత జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి మెండ దాసునాయుడు, బలగ శంకరభాస్కరరావు, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ లోలుగు వెంకట్ పాల్గొన్నారు.

అబ్దుల్ కలామ్ ఆదర్శ ప్రాయుడు : పురందేశ్వరి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

భారతరత్న డాక్టర్ ఎపిజె అబ్దుల్ కలామ్ అందరికీ ఆదర్శ ప్రాయుడని బిజెపి రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి పేర్కొన్నారు. విజయవాడలోని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ఆదివారం కలామ్ జయంతి సందర్భంగా ఏర్పాటుచేసిన సభకు పార్టీ మైనార్టీ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు షేక్ బాజీ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రపతిగా పనిచేసిన అబ్దుల్ కలామ్ గొప్ప దేశ భక్తుడు అని, డిఆర్‌డిఎ, ఇస్రోల్లో ఆయన చేసిన పరిశోధనలు నేటి శాస్త్రవేత్తలకు మార్గదర్శమని అన్నారు.

అక్షరం

ప్రజాశక్తి
www.prajasakti.com
facebook/prajasakti, twitter/prajasakti

4 | విజయవాడ
సోమవారం 16 అక్టోబర్ 2023



ఎక్కడికి పోతున్నాం మనం?
ఎక్కవలసిన లక్ష్యాల ఎవరెస్టు
శిఖరాల పైకా
దిక్కుమాలిన పాపాల పాతాళ కుహరాల్లోకా
ఎక్కడికి పోతున్నాం?
ఏ చిక్కుల్లో పడిపోతున్నాం?

– సినారె



అక్టోబర్ 8

ఇదో నూతన ప్రతిఘటనా సంకేతం
అమెరికోన్ని మూడు చెరువుల
నీళ్ళు తాగించిన వియత్నాం వారసత్వం

చిట్టెలుకలన్నీ కూడబలుక్కుని
పిల్లిని కాదు పులిపై ఒక్కసారిగా
విరుచుకుపడి బెంబేలెత్తించిన
ప్రతిఘటనా పోరాటం!

అగ్ర రాజ్యాల అండతో
తమకో దేశమంటూ లేకుండా చేసి
వేలాదిమందిని ఊచకోత కోసి
నిత్యమూ భయంతో తెల్లారే
తమ బతుకు నుండి
పెట్టిన రాకెట్ల పొలికేక !

వాడు గొప్పగా చెప్పుకునే
ఇనుప తెరను చీల్చి
నగరం నడిబొడ్డుపై నడయాడిన
నెలవంకల నెత్తుటి పాదాలు

వాడు ప్రపంచానికి చూపే
అబద్ధపు సాక్ష్యాలను
మోసే మీడియాకు
వాళ్ళొట్టి ఉగ్రవాదులే !
కానీ, తమ నెత్తుటి బాకీ
తీర్చుకునే వాళ్ళు
బలహీనులకు ఓ భరోసా కదా?

(ఇజ్రాయిల్‌పై హమాస్ ప్రతిఘటనకు స్పందనగా)

– కెక్యూబ్ వర్మ
94934 36277

అన్నానికి బదులు

ఎందుకో ఈ పూట అన్నం
సయించటం లేదు
గిన్నెలో తెల్లని మల్లెపూల
మెతుకులు
రక్తం రంగులోకి మారిపోతుంటే
గుండె కంపనంతో పగుళ్లు దీరుతోంది!

కంచంలో అన్నానికి బదులు
రాకెట్ లాంచర్లు.. మోర్టార్లు
మెషిన్ గన్లు.. క్షిపణీ పొగ బాంబులు
చేతికి తగుల్తున్నాయి

గటగటమని నీళ్లు తాగుదామన్నా సరే
యుద్ధం యుద్ధమనే అరుపులు
గొంతుకు అడ్డుపడి
దాడి చేసి చంపుతున్నాయి

ఏ దేశమైనా సరే యుద్ధ శిబిరాల్లో
ఆడవాళ్లే బలి పశువులవ్వాలా?
పసిపిల్లల మెదళ్లే పేలిపోవాలా?
నువ్ ఇశ్రాయేలీయుడవైతే ఏంటి
పాలస్తీనా పౌరుడవైతే ఏంటి
చంపేది.. చంపుతున్నది.. చచ్చేది
ఆ మనిషే కదా.. జీవ వాయువూదిన
దేవుడు పోలికని.. పోల్చుకున్నది నువ్వే కదా!

అది గాజుల్లా భళ్ళున నేలరాలిన
గాజా కావొచ్చు.. వెస్ట్ బేంక్ డోమ్ విరిగి పడొచ్చు
నడుస్తున్న దేహాలు తూట్లు తూట్లు పడి
రక్తం స్రవించే ప్రభు అంగీలై గాంచి
మీ చేతి గాయాల్లో వేలు పెట్టి చూసి
పశ్చాత్తాపంతో దు:ఖించే
పేతుర్లు ఎవ్వరూ ఉండరిక్కడ !

జాగా ఇవ్వని శపించబడ్డ
భూమి అవ్వొచ్చు
మసీదుల ప్రాకారాలు..
ప్రార్ధనాలయ బంగారు గోపురాలు
జన సమ్మర్దన రోడ్లు
మాల్సు.. హాల్సు..
భగ్గున మండి నల్లని మసిపొగల్లో
శరీరాలు తెగి ఎగిరిపడుతుంటే
ఆకాశపు ధ్వనులు..
మరణ లేఖల్ని వినిపిస్తుంటే
నా మనిషితనం.. ఏ మతం మీదైనా
తిరగబడమని చెబుతుంది
రక్తపాతమే మతం అభిమతమైతే
మనుషుల చావులతోనే దాని ఆకలి తీరుతుందనేది
నిజమైతే..
ఆ మతం పులిని మట్టుబెట్టడానికి
ఆ దేవుణ్ణి శిక్షించే తీరతాను !


– నేలపూరి రత్నాజీ
89199 98753

యుద్ధ హైకూలు

పొద్దు తిరుగుడు పూలు
తలలు వాల్చేశాయి –
గాజా నింగిలో సూర్యుడు లేడు

మేఘాలు
బుల్లెట్లు కురుస్తున్నాయి –
గాజా ఆకాశం

యుద్ధం తరువాత
ఏదో మిగులుతుందనుకున్నారు –
శ్మశానాల దిబ్బ



ఉరుము
ఉలిక్కి పడింది
బాంబుల మోత

యుద్ధం తల
బొప్పికట్టాలని –
పిల్లాడు రాయిసిరాడు

యుద్ధమేఘాలు . . .
పొద్దుతిరుగుడు పూలు
తలలు వాల్చేశాయి

యుద్ధ విమానాల రొద –
పక్షికూతలూ, పిల్లల ఏడుపుల్ని
పొట్టన పెట్టుకుంది!

– చిత్తలూరి
91338 32246


నీలి మేఘాల్లోంచి నీలి మేఘాల్లోకి ...

అక్టోబరు 3, 2023 తెలుగు కవిత్వంలో ఒక గుర్తుంచుకోదగిన రోజు. 30 ఏళ్ళ కిందట తెలుగు కవిత్వాన్ని ఒక కుదుపు కుదిపిన 'నీలిమేఘాలు' నాల్గవ ముద్రణ హైదరాబాదులో ఆవిష్కరణ జరిగిన రోజు. మళ్ళీ మూడు దశాబ్దాల తర్వాత అదే నగరంలో ఆవిష్కరణకు అందరూ కలిసిన రోజు.

తెలుగు కవిత్వంలో భావ కవిత్వం, అభ్యుదయ కవిత్వం, విప్లవ కవిత్వం ... ఇలా ఎన్నో విభిన్న పాయలున్నాయి. ఇంచుమించు ఈ కవిత్వమంతా పురుషులు రచించిందే. పితృస్వామ్య వ్యవస్థలో సమాజం, సాహిత్యం, కవిత్వం అన్నిట్లో పురుషులదే పైచేయి. స్త్రీల ప్రవేశం, పాత్ర ఇంచుమించు శూన్యం అని చెప్పవచ్చు. స్త్రీలూ పురుషులూ సమానమే అన్నారు. ఆకాశంలో సగం అని అతిశయోక్తులు పలికారు. వాస్తవంలో మాత్రం అంతా విరుద్ధమే!

కవిత్వం మీద కాపీ రైటు మాదే అన్నారు. అందుకే పురాణ యుగంలో నన్నయ, తిక్కనల దగ్గర నుంచి శ్రీశ్రీ, కృష్ణశాస్త్రి, అజంతా, బైరాగి, నగముని, చెరబండ రాజుల వరకు అందరి పేర్లూ పురుషులవే. ఎక్కడా స్త్రీల పేర్లు కనిపించవు. ఆనాడు ప్రబంధ యుగంలో కవులందరు స్త్రీలంటే శరీరాలే అని భావించారు. అంగాంగ వర్ణన చేశారు. భావకవులు మాత్రం ఊర్వశి, ప్రేయసి అని భావించారు. మాతృదేవత అని పూజించారు. కానీ విచిత్రం ఏమిటంటే ఎవరూ స్త్రీలను తమతో సమానంగా మనుషులుగా భావించలేదు. 'ఆమె కన్నులలో ననంతాం బరపు నీలినీడలు కలవు' అని చెప్పారు. స్త్రీల బాధలు, అనుభూతుల గురించి ఎవరూ నోరు విప్పి చెప్పలేదు.

సమాజంలో స్త్రీ పురుషులకు వేరు వేరు ధర్మాలు. పురుషుడు మహారాజు. స్త్రీ బానిస. చదువులో, ఉద్యోగాల్లో, సాహిత్యంలో, రాజకీయంలో అన్నిటా అసమానతలు. కనిపించని సంకెళ్ళు, మాటలకందని హింస. అంతా బాగున్నట్లే వుంటుంది. కానీ లోపల ఏమీ బాగా లేకపోవడం వివాహం, సంతానం, ఉద్యోగం అన్నిట్లో అణచివేత. ఈ సమయంలో 80లలో స్త్రీవాద కవిత్వం ప్రారంభమైంది. 81లో రేవతీదేవి అనురాగ దగ్ధా సమాధి వచ్చింది. 84లో సావిత్రి బందిపోట్లు వచ్చింది. ఇక అక్కడ నుంచి పితృస్వామ్యం నిర్ణయించిన నీతులను బద్దలు కొడుతూ, లేబర్ రూం, అబార్షన్ స్టేట్‌మెంట్, జుగల్‌బందీ, వంటిల్లు, సర్పపరిష్వంగం, పైటను తగలేస్తాను కవితలు వచ్చాయి. కవిత్వరంగంలో పెను సంచలనాన్ని కలిగించాయి. 10 ఏళ్ళ తర్వాత ఓల్గా గారు స్త్రీవాద కవితలతో ఒక సంకలనం తేవాలని సంకల్పించారు. 31 మంది కవయిత్రులతో 'నీలిమేఘాలు' కవితాసంపుటి ప్రచురించారు. 30 ఏళ్ళ కిందట హైదరాబాదులో ఆవిష్కరించారు.



మళ్ళీ 3 దశాబ్దాల తర్వాత రవీంద్ర భారతిలో నీలిమేఘాలు ఆవిష్కరణ సభకు వెళ్తున్నపుడు మనసులో కలిగిన జ్ఞాపకాలివి. ఆ రోజు సాయంత్రం రవీంద్రభారతి ఆవరణలో అడుగుబెడుతూనే ఎస్. రఘు గారు చిరునవ్వుతో ఆహ్వానించారు. మీ 'ద్విపాత్రాభినయం' మా యూనివర్శిటీ వాళ్ళకు 6 ఏళ్ళుగా సిలబస్‌లో ఉన్నదని చెప్పారు. ఆయన ఉస్మానియా యూనివర్శిటీలో ప్రొఫెసర్. ఇంకా లోపలికి వెళుతున్నాను. సభాప్రాంగణంలోనే ఓల్గా గారు కూర్చున్నారు. ఓల్గా గారితో మాటలాడి సభలోకి అడుగుపెడుతూనే మెర్సీ మార్గరెట్ వచ్చి... ఈ సభ అంతా సర్పాలే. పాకుతున్న సర్పాలే. మీ సర్పపరిష్వంగం కవితే నాకు పదే పదే గుర్తుకువస్తుంది అన్నది. ఆ తర్వాత ఎంతోమంది పలకరించారు. మృణాళిని గారు మాటలాడారు. అప్పటికే కొండేపూడి నిర్మల, కుప్పిలి పద్మ వచ్చారు. సభ మొదలయింది. వేదిక మీద మృణాళిని గారు, నీరజ గారు, సూరేపల్లి సుజాత, మెర్సీ మార్గరెట్, పింగళి చైతన్య ఉన్నారు.

స్త్రీవాద కవిత్వం విద్యార్థులను ఎలా ప్రభావితం చేసిందో మృణాళిని చెప్పారు. హైదరాబాద్ సిటీ కాలేజీలో లెక్చరర్ జె.నీరజ గారు 'ఈ రోజు సారంగలో నీలిమేఘాల మీద మందరపు హైమవతి రాసిన వ్యాసం బావుంది' అనే మాటలతో తన ఉపన్యాసం మొదలుపెట్టారు. సూరేపల్లి సుజాత– నీలిమేఘాలులోని కవితల గురించి చెప్పారు. ఆ తర్వాత పింగళి చైతన్య 'నీలిమేఘాలు' తన జీవితంపై కలిగించిన ప్రభావం గురించి చెప్తూ... ఆత్మహత్య చేసుకోవాలనిపించిన ఒకానొక సమయంలో నీలిమేఘాలు ఎలా ధైర్యమిచ్చిందో, నిత్య జీవితంలో లేబర్ రూం, వంటిల్లు, సర్పపరిష్వంగం, జుగల్‌బందీ కవితలు ఎలాంటి ప్రభావం కలిగించాయో, ఎంత ఆత్మవిశ్వాసాన్ని, ధైర్యాన్ని ఇచ్చాయో చెప్పారు. ఒక గొప్ప భావోద్వేగంతో చేసిన ఆ ప్రసంగం శ్రోతలను విపరీతంగా ఆకర్షించింది. పైగా తను మాట్లాడుతూ ఈ సభ ఇలా జరగకూడదు. వేదిక మీద కాకుండా కింద అందరూ కలిసి మాట్లాడుకుంటే బాగుంటుంది అన్నారు. "ఈ ఆనంద సమయంలో డాన్స్ చేయాలి. పాటలు పాడాలి. 30 ఏళ్ళ తర్వాత ఇలా ఈ సంపుటి ఆవిష్కరణ జరగడం ఎంతో ఆనందంగా వుంది. ఉద్వేగంగా ఉంది. ఈ కవయిత్రులందరూ మా దృష్టిలో హీరోయిన్లు. ఈ సభ తర్వాత మేమొక సభ పెడతాము. ఈ కవయిత్రులందర్ని పిలిచి మాట్లాడతాము. కొంతమంది రాయడం ఆపేసారు. ఎందుకు ఆపేసారో ప్రశ్నలడుగుతాము. కొన్ని సందిగ్ధ సమయాల్లో, కొన్ని సంక్షుభిత సమయాల్లో మాకు వెన్నుతట్టి ధైర్యమిచ్చిన ఈ కవితలు రచించిన కవయిత్రులు, మమ్మల్ని ఆత్మవిశ్వాస గీతికలుగా మార్చిన కవయిత్రులకు అభినందనలు" అని ఉద్వేగపూర్వకంగా మాటలాడారు.

ఆ తర్వాత మెర్సీ మార్గరెట్– తన కవిత్వ జీవితాన్ని నీలిమేఘాలు, నల్లపొద్దు సంపుటాలు ఎలా ప్రభావితం చేసాయో చెప్పారు. కవితా రంగంలో తాను ఎదుర్కొన్న సమస్యల గురించి చెప్పారు. 'నేను రాసినవి కవితలే కాదన్నారు. ఒక దళితుని మీద ఉచ్చపోస్తే ఆ సంఘటన గురించి కవితా సంపుటి తెస్తున్నాను అని తెలిసి– మణిపూర్ సంఘటన మీద కూడా కవితా సంపుటి తెమ్మన్నారు. ఒకపక్క కులాలుగా, గ్రూపులుగా విడిపోయిన కవులు ఎలా స్పందిస్తారో తెలియక తేవడం లేదు' అన్నారు. అప్పటికంటే ఇప్పుడే వివక్ష ఎక్కువగా ఉందని అన్నారు.

తర్వాత కొండేపూడి నిర్మల, విమల, ఘంటశాల నిర్మల, సుధ, బి.పద్మావతి, కె.వరలక్ష్మి, జయ, మందరపు హైమవతి కవితలు చదివారు. చాలామంది 'నీలిమేఘాలు'లో కవితలు చదివారు. నేనూ 'సర్పపరిష్వంగం' చదివాను. 'ఓల్గా గారు ఈ సభకు రమ్మన్నారు. తప్పకుండా రమ్మని చెప్పారు. 30 ఏళ్ళ తర్వాత నీలిమేఘాల పునర్ముద్రణ జరిగిన ఈ చారిత్రక సందర్భంలో పాల్గొనడాన్ని నేను ఆనందిస్తున్నాను. గర్విస్తున్నాను' అని చెప్పి 'సర్పపరిష్వంగం' కవిత చదివాను. 'జీతమెప్పుడిస్తారు' ఆ వాక్యం చదవగానే సభంతా చప్పట్లు. చాలా మంచి స్పందన వచ్చింది.

ఈ సభ విశేషం ఏమిటంటే సభలో అందరూ కొత్తవాళ్ళు. యూనివర్శిటీ విద్యార్థులు, యువతరం ఉన్నారు. శ్రద్ధగా విన్నారు. సభ అంతా సజీవ స్రవంతిలాగా సాగింది. ఒక ఉత్సాహపూరిత, ఉద్విగ్నభరిత వాతావరణంలో కవిత్వం పల్లవించింది. పరిమళించింది. యాంత్రిక జీవితాలతో చచ్చుబడిన క్షణాలకు ఒక నూతన ఉత్తేజం, అద్భుతమైన చైతన్యం కలిగించింది. ప్రతి ఒక్కరినీ సమ్మోహపరిచిన కవిత్వ క్షణాలను ఆనందించడానికి కారణమైన ఓల్గా, వసంత కన్నభిరాన్, కల్పన కన్నభిరాన్ గార్లకు కృతజ్ఞతలు.

నీలిమేఘాలు వచ్చాక సమాజంలో స్త్రీలను చూసే విధానం మారింది. ఇదివరకటి లాగా చులకనగా మాట్లాడడానికి భయపడుతున్నారు. పురుషులలో మార్పు వచ్చింది. ఇంటి పనులు చేస్తున్నారు. వంటలో సాయం చేస్తున్నారు. ఈ మార్పులో నీలిమేఘాలు పాత్రా ఉంది.

ఈ సభలోనే 'ప్రభా విభాతములు' 'వాయిసెస్ ఆఫ్ రెసిస్టెన్స్' పుస్తకాలు కూడా ఆవిష్కరించారు. ఈ చారిత్రాత్మక సభలో పాల్గొన్నందుకు ఆ ఉద్విగ్న క్షణాలను హృదయంలో పదిలపరుచుకొంటూ అపూర్వ పారవశ్యంతో... నేను.

– మందరపు హైమవతి
82473 67061

'కవిత్వం నేను ఆత్మతో చేసుకునే సంభాషణ'

కవిగా, విమర్శకుడిగా, బోధకుడిగా, విద్యావేత్తగా బహుముఖీన ప్రతిభ చూపిస్తున్న సృజనశీలి డాక్టర్ సుంకర గోపాలయ్య. ఇటీవల రొట్టమాకు రేవు అవార్డు, శిఖామణి యువ సాహిత్య పురస్కారాలు పొందిన సందర్భంగా సంభాషణ ...



ఈ పురస్కారాలకు ఎంపిక కావటంపై మీ అనుభూతి?

ఈ రెండూ రావడం చాలా సంతోషాన్ని ఇచ్చింది. ఇవాళ మనం వేసిన కవితా సంపుటికి ఏదో ఒక అవార్డు రాకపోతే దాన్ని అస్సలు పట్టించుకోని స్థితిలో మనం ఉన్నాము.

ఆధునిక కవిత్వంలో మీకు ఎవరు స్ఫూర్తి?

ఇది చాలా క్లిష్టమైన ప్రశ్న సార్. నా అధ్యయనంలో భాగంగా నన్ను కదిలించిన, కుదిపిన కవిత ఎవరు రాసినా సరే వాళ్లని నేను అభిమానిస్తాను. గౌరవిస్తాను. అప్పటి శ్రీశ్రీ నుండి ఇప్పటివరకు పుస్తకం వేయని పైడికొండల వెంకటేష్ అనే కవి వరకు నేను స్ఫూర్తి పొందుతూనే ఉన్నాను. నన్ను కవిత్వం వైపు తీసుకెళ్లిన రాధేయ గారు, అనంతపురం నుండి వచ్చాక నెల్లూరు జిల్లాలో పెరుగు రామకృష్ణ గారు ఇచ్చిన ప్రోత్సాహం కూడా మరువలేనిది.

కవిత్వంలో జానపద శైలి మీకెలా అబ్బింది?

మా నాయన వీధి భాగవతపు కళాకారుడు. నాకు ఊహ తెలిసిన తర్వాత ఆయన ఊరు తిరిగి భాగవతం ఆడటం మానేశాడు. కానీ అప్పుడప్పుడు రాత్రిపూట దక్ష యజ్ఞం, చెంచులక్ష్మి నాటకం, భైరావణవధ లాంటి వీధి బాగోతాల పాటలు పాడుతూ ఉండేవాడు. మధ్యాహ్నం పూట ఆయన దగ్గరికి చాలామంది వచ్చి కూర్చునే సందర్భాల్లో ఆయన రామాయణ భారత భాగవత ఘట్టాలు తనదైన శైలిలో చెప్పడం విన్నాను. పదిమందిని ఆకట్టుకునే శైలి ఆయన మాటల్లో గమనించాను. అలా అప్రయత్నంగానే జానపద శైలి వచ్చిందనుకుంటాను.

ప్రాచీన, ఆధునిక సాహిత్య అంశాల వక్తగా విస్తృత పర్యటనలు చేస్తున్న అనుభవం ఏం నేర్పుతుంది?

తెలుగు సాహిత్యం చదువుకున్నవాడిగా ఎవరైనా ఒక అంశం మీద మాట్లాడమని అడిగితే, మాట్లాడతానని ఒప్పుకున్నాక తీవ్రమైన పరిశ్రమ చేస్తాను. కాకినాడలో మాట్లాడిన శల్య పర్వ ప్రసంగం, తాడేపల్లిగూడెంలో మాట్లాడిన మొల్ల రామాయణం నా పట్ల నాకు నమ్మకాన్ని పెంచాయి. ఆ ప్రసంగాలు విన్న సురతులు చాలా ఆనందించారు. అభినందించారు. గుంటూరులో మాట్లాడిన బసవపురాణం, కాకినాడలోనే ఈమధ్య మాట్లాడిన రాఘవ పాండవీయం కూడా మంచి పేరు తీసుకొచ్చాయి. ఆచార్య బేతవోలు గారి ప్రశంస కూడా లభించింది. అందువల్ల ప్రాచీనాన్ని, ఆధునికాన్ని రెండు కళ్ళగా భావిస్తూ, సాహిత్యం పట్ల ఆసక్తితో ఇష్టంతో కొనసాగుతున్నాను.

కవిత్వానికి మీరిచ్చే నిర్వచనం?


కవిత్వం నేను ఆత్మతో చేసుకునే సంభాషణ. నా లోపల జరిగే సంఘర్షణ. నా బతుకు దీపాన్ని ఎగదోస్తున్న అమ్మ చేయి. నాతో నడుస్తూ నడుపుతున్న నా సహచరి.

కవి, విమర్శకుడు ... ఈ రెంటిలో ఏది ప్రాధాన్యతాంశం మీకు?

నేను అధ్యయనం చేసుకుంటూ వెళుతున్న క్రమంలో ఎవరైనా కవి నన్ను ప్రభావితం చేస్తే ఆ కవి గురించి నాదైనా ఆలోచనలోంచి నాదైన చూపులోంచి వ్యాసాలు రాస్తూ ఉన్నాను. ఆ వ్యాసాలు నన్ను విమర్శకుడిగా నిలబెడుతున్నాయి. ఆ క్రమంలో కవిత్వం, విమర్శ రెండూ కూడా నన్ను మెరుగుపరుస్తూ ఉన్నాయి. కానీ కవిత్వం సృజనాత్మక ప్రక్రియ. విమర్శ కంటే కూడా కవిత్వమే మనకు ఆత్మ సంతృప్తిని ఇస్తుంది.

సంభాషణ : డాక్టర్ పెరుగు రామకృష్ణ
98492 30443

శేషేంద్రలా కవిత్వం చెప్పే శక్తి అందరికీ రాదు..



కందుకూరి వీరేశలింగం, గురజాడ, శ్రీశ్రీల తర్వాత తెలుగు సాహిత్యంలో వైతాళికుడిగా స్మరించదగిన వ్యక్తి గుంటూరు శేషేంద్ర. ఆయన్ని కేవలం కవిగానో లేదూ కవిసేన మేనిఫెస్టో రాసిన విమర్శకుడిగానో గుర్తించటానికి అలవాటు పడ్డామే తప్ప, కామోత్సవ్ రాసిన మహా అరుదైన నవలాకారుడిగా మనం చాలా వెనక అడుగులు వేస్తున్నామని మాత్రం ఖచ్చితంగా చెప్పగలను. కామోత్సవ్ నవలా శిల్పం గమనించినప్పుడు ఒక చేయి తిరిగిన నవలాకుడిగా శేషేంద్ర విశ్వరూపం చూపించాడు. ఆయన మాటల్లోనే చెప్తే 'ఈస్తెటిక్ రూపంలో వున్న ఇంటలెక్చువల్ జైంట్'గా శేషేంద్ర మనకి రూపుగడ్తాడు (కామోత్సవ్ నవల పేజి 126). ఎన్నో వేల నవలలు చదివిన రచయితగా కామోత్సవ్ నవల చదివి నేను విస్తుబోయాను. నాకు ప్రీతిపాత్రమైన హెరాల్డ్ రాబిన్స్‌లా ఉన్నత, అభిజాత్య వంశాల్లో ఉన్న స్త్రీ, పురుషుల కామ సంబంధాలను ఆయన ఎంతో చాకచక్యంగా దృశ్యమానం చేశాడు. ఇక్కడ కామోత్సవ్ నవలలో ఆయన చూపిన ప్రతిభని కొనియడాటానికే ప్రస్తావన తెస్తున్నానే తప్ప కామోత్సవ్ నవలపైన చర్చించటానికి కాదు.

శేషేంద్ర శైలీశిల్పాలు ఎంతగా విస్మృతికి గురిచేయబడ్డాయో మన పరిశోధకులు గమనిస్తారని ఈ మాత్రంగా గుర్తు చేస్తున్నాను. నిత్య స్మరణీయుడైన శేషేంద్ర జ్ఞాపకాలని మనం పదిలపరుచుకో లేకపోతున్నామనే ఒక దుగ్ధ నా చేత ఈ మాటలు పలికిస్తున్నది. ఆ అలవాటు, ఆ సంస్కృతి మన తెలుగునాట లేదు. కనీసం ఒక డాక్యుమెంటరీగా కూడా ఈ రోజుకీ ఆయన సాహిత్య ప్రస్థానాన్ని మనం దాచుకోలేక పోయాము. అందుకు ఎవర్నీ నిందించి లాభం లేదు.

వ్యక్తి పూజ తప్పుగానీ వీర పూజలో ఎంతో ఔచిత్యం ఉంది. ఆ నడవడికకి శేషేంద్ర ఎంతో అనుకూలమైన స్మరణీయుడు, ఆయన రాణివాసం పట్ల కొంత వెగటు వుండవచ్చు కొంతమందికి, కానీ ఆయన ప్రజల మనిషి గానే తన కవిత్వాన్ని ప్రసారం చేశాడు. కమ్యూనిస్టుగా ముద్రవేసి ఆయనని వేధించిన సంగతి ఎంత మందికి తెలుసు. శ్రీశ్రీ 1955 ఎన్నికల్లో నిలబడి మతిస్థిమితం కోల్పోయినప్పుడు శేషేంద్ర అండగా నిలబడి ప్రోత్సాహం చూపిన ధైర్యజీవిగా మనం కొంచం అయినా గుర్తు చేసుకుంటే మనమేమీ కోల్పోము. అమెరికన్ సామ్రాజ్య వాదాన్ని నిరసిస్తా, గల్ఫ్ యుద్ధానికి వ్యతిరేకంగా 'నీతులు చెప్పే అమెరికా – ఇదీ నీ చరిత్ర' అని వ్యాస సంపుటిని ఇది ఇప్పుడు ఎక్కడ ఉందో తెలియదు.

ఆయన రెండో కుమారుడు సాత్యకి కృషి మూలంగా ఎంతో కొంత శేషేంద్ర సాహిత్యం మనకి లభ్యం అవుతున్నది. గానీ ఇంకా శేషేంద్ర సాహిత్యం కొంత వెలుగు చూడాల్సిన సంగతులు మన పరిశోధకులు పట్టించుకోవల్సిన అవసరం ఎంతో ఉంది. శేషేంద్రకి ఎన్ని అనుకూల శక్తులు ఉన్నాయో, అన్ని ప్రతికూల శక్తులూ ఈ నాటికీ తారస పడ్తున్నాయి. పునరపి అనుకోకుండా ఉంటే కామోత్సవ నవల నర్సరావుపేట మున్సిఫ్ కోర్ట్, ఆంధ్రప్రదేశ్ హైకోర్ట్, సుప్రీం కోర్టుల్లో అశ్లీల కేసు ఎదుర్కొని విజయ ఢంకా మోగించిన సంచలనాత్మక సంగతి ఈరోజు ఎంత మందికి గుర్తు ఉందో లేదో తెలియదు గానీ,.. 'శేషేంద్ర వెలుగు నీడల్లో...' అనే పుస్తకంలో ఆ మహానుభావుడి వ్యక్తిగత జీవితంపై బురద చల్లిన వనమాలి 'నాన్నతో తన అనుభవాలు' ఎంత జుగుప్స కలిగించిందో చెప్పలేము. ఒక మహాకవి జీవితాన్ని బయటికి ఈడ్చి వనమాలి సాధించిన ఆనందమేదో అవగతం కావటం లేదు. నాకు సాహిత్యమే జీవితంగా, జీవితమే సాహిత్య పోరాటంగా నిప్పులు చిమ్మిన శేషేంద్ర కవిత్వంపై ఎంతగా బూడిద చల్లాలని ప్రయత్నించినా అవి విఫల కుట్రలుగానే చతికిలబడి పోతాయి, పోయాయి కూడా.

ఎడ్గార్ ఎలన్ పో మీద కూడా ఆయన వ్యతిరేకులు ఎడ్గార్ చనిపోయాక వారి మీద అవీ ఇవీ కల్పించి, చివరికీ డ్రగ్గిస్ట్‌గా, స్త్రీలోలుడిగా చిత్రీకరించి దుష్ప్రచారం చేశారు. కానీ వాళ్ళంతా కాని వాళ్ళు, కానీ శేషేంద్ర మీద అయిన వాళ్ళే జ్ఞాపకాల పేరిట వారి ప్రతిష్టకి మచ్చ వచ్చేలా రాతలు రాస్తే ఎలా? నిజానికి వ్యక్తిగత విషయాలు సాహిత్యలోకానికి పరిచయం చేయాల్సిన అవసరం లేదు. రాబోయే 4 యేళ్ళల్లో అంటే అక్టోబర్ 2027లో గుంటూరు శేషేంద్ర శతజయంతి ఉత్సవాలు రాబోతున్నాయి. అందుకు ఇప్పటి నుంచే సన్నాహక కమిటీ ఒకటి ఏర్పాటు చేసుకొని శేషేంద్ర సమగ్ర సాహిత్యం తేవాల్సిన అవసరం ఎంతో ఉంది. ఆయన అభిమానులు, సాహిత్య సంఘాలు విశ్వ విద్యాలయాలు పూనుకొని ఇప్పటి నుంచే ఒక కార్యక్రమ ప్రణాళిక తయారు చేసుకోవాల్సిన సందర్భం మనముందు ఉందని మనవి చేస్తున్నాను.

నిజానికి ఈ విశాల ప్రపంచమే ఆయన కుటుంబం. ప్రజలే ఆయన బిడ్డలు. ఆయన ప్రజల కోసమే తపించి తన సాహిత్యాన్ని ఆ దారిలో నడిపించాడు. ప్రజల కష్టాలు తీరాలని వగచాడు. ఆయన ఒక షాయరీతో వ్యాసం ముగిస్తాను. "ఎవడో ఇరవయ్యో శతాబ్దపు భక్తుడు / గుడి గంట మోగించాడు. దూరాన నాకు వినపించింది / ఆ ముసలి దేవాలయం దగ్గుతోంది / రాళ్ళు ఊడి పోయాయి. అక్కడక్కడా దంతాల్లా. / మనిషి కష్టాలు తీర్చే శక్తి ఎవరో / మనిషి ఇంకా వెతుకుతూనే ఉన్నాడు అక్కడే." ఇలా శేషేంద్రలా కవిత్వం చెప్పేశక్తి అందరికీ రాదు. అదో అరుదైన గొంతుక.

(అక్టోబర్ 20 : శేషేంద్ర 96వ జయంతి)

– సాగర్ శ్రీరామ కవచం



ఇప్పుడల్లా తెల్లారేలా లేదు
యుద్ధ భేరీల మధ్య
ఆట బొమ్మ కోసం
ఒక పసిపిల్ల ఏడుపులా ఉంది
నా పరిస్థితి
కత్తి అంచు మీద నడుస్తున్న కాలానికి
నా కవిత్వంతో పనేంటి?

యుద్ధం ఎక్కడ జరిగినా
ఎప్పుడు జరిగినా
అక్కడ నేనుంటాను
ఒక క్షతగాత్రంగానో.. ఒక మృతదేహంగానో..!
యుద్ధం అనివార్యమే కావచ్చు
శాంతి అసాధ్యం కాదు
నువ్వు యుద్ధం వైపా శాంతి వైపా అంటే
అటువైపూ ఇటువైపూ ఉండే
ప్రజల వైపే అంటాను

నేనూ యుద్ధంలోనే ఉన్నాను

క్రూరులు దాడులు చేస్తారు
వీరులు యుద్ధం చేస్తారు
రక్త దాహానికీ రక్త తర్పణకూ మధ్య
వేలాడుతున్న దేశం ఏదైనా
అక్కడ నేనుంటాను
ప్రాణభయంతో పారిపోతున్న తల్లిని
పట్టుకొని ఏడుస్తున్న పిల్లాడిలా
అక్కడ నేనుంటాను
అటైనా ఇటైనా మనుషులుంటారు
ఒక చెట్టు లాంటి ఇల్లు కోసమో..
పిట్టల్లాంటి పిల్లల కోసమో
కలలు కురిసే వేళ
కనురెప్పల కింద బాంబుల మోత–
కాలిపోతున్న తోటల్లోంచి
ఎవరిని ఎవరు మోసుకుంటూ
ఏ దిక్కుకు బెదిరి చెదిరిపోతున్నా
వారు భుజం మార్చుకునే చోట
నేనుంటాను

ప్రజలకు జీవితం కావాలి
పాలకులకు రాజ్యం కావాలి
విస్తరణ కాంక్షకూ అస్తిత్వ తపనకూ మధ్య
నెత్తురోడుతున్న దేశం ఏదైనా
అక్కడ నేనుంటాను

ఆరడుగుల నేలైనా
అది నా దేశమైతే చాలని
అలమటించే ఆత్మ ఆత్మలో
నేనుంటాను

అటా.. ఇటా.. ఎటో
తేల్చి చెప్పమంటే నేనేం చెప్పను..
అటువైపూ ఇటువైపూ వెలిగే
శాంతి కాగడాల ప్రతి కాంతిపుంజంలో
నేనుంటాను

ఆక్రమణ యుద్ధం
ఆధిపత్యం యుద్ధం
అణిచివేత యుద్ధం
యుద్ధాన్ని యుద్ధంతో ఎదుర్కొనే యుద్ధంలో
ఆత్మ రక్షణ శిరస్త్రాణగా ధరించి కదిలే
ఒక పిపీలికంతో పాటు
నేనూ యుద్ధంలోనే ఉంటాను

కాలం నిలువెల్లా తడిసిన నెత్తుటి సాక్షిగా
యుద్ధం అనివార్యమే కాని
శాంతి అసాధ్యం కాదు!

– ప్రసాదమూర్తి
84998 66699

చరిత్ర చెప్పని నిజం

అణచివేతల ఉక్కుపాదాన్ని
తుప్పులా తినేయడానికి
తిరుగుబాటు పురుడోసుకుంటుంది
నీ ప్రేమ చినుకైతే
నా ప్రేమ సముద్రం
నీ ద్వేషం ఆవగింజైతే
నా ద్వేషం అంతులేని
ఆకాశమనే మానవనైజం
ద్వేషాన్ని మాత్రమే
బడుగు దేశాలపై దిమ్మరిస్తుంటే
తిరుగుబాటు కాస్తా
యుద్ధమై గర్జిస్తుంది !

కాటాలు మొలిచిన
పందెం పుంజుల రంకెల్లో
పసిపిట్ట దేహమంతా
సలుపుతున్న గాయపు గాట్లే ...

ఏళ్లకేళ్ల గొంతులు బిగించేసిన
చీకటి పంజరాల్లోని
ఎముకల గూళ్ళ విముక్తికై
గాయపడ్డ దేశం మొత్తం
పొలికేకలేస్తూనే ఉంది

యుద్ధం చేస్తున్న మనుషులకు
మతం యూనిఫామ్ తొడిగింది
మనిషితనం మట్టికొరిగింది
స్వేచ్ఛకోరే ప్రతి గొంతూ



శరణార్ధ శిబిరంలో
అవిటితనపు ఆత్మగౌరవంతో
కన్నీటి పాటలే పాడుతుంది !

ఇప్పుడు కళ్ళన్నీ
గడ్డకట్టని నదులు
గుండెలు పగిలిపోయిన
అగ్నిపర్వత సమూహాలు
దేహాలన్నీ కుళ్ళిపోతున్న శవాల గుట్టలు
దేశమంతా తడారని నెత్తుటి మడుగులు
మానవత్వమేమో శిథిలమైన
జగతిజెండా ఆనవాలు !

నిన్నటి కలలు
రేపటి ఉదయాలు
యుద్ధంలో తడిచి
చివికిపోతున్నాయి
కొన్ని పిడికిళ్ల ప్రతిఘటన తప్ప
ప్రతిఫలమెరుగని పోరులో
పీడిత వర్గపు ప్రాణం విలువ
ట్రిగ్గర్ నొక్కే చేతితోపాటు
దూసుకుపోయే తూటాకి కూడా తెలీదు
యుద్ధమంటే సాధించడం కాదు;
కోల్పోవడం మాత్రమే!

చరిత్ర చెప్పని నిజమేమిటంటే
యుద్ధం రెండు దేశాల మధ్య కాదు
అదెప్పుడూ మన మనుషుల మధ్యే
జరుగుతుంది
జరుగుతూనే ఉంటుంది!

– మిరప మహేష్
99480 39026

రచనలకు ఆహ్వానం

ఈ పేజీలో ప్రచురణార్థం రచయితల నుంచి సాహిత్య వ్యాసాలను, సాహిత్య విమర్శలను ఆహ్వానిస్తున్నాం. వ్యాసాలను కంపోజు చేసి పంపేవారు సాఫ్ట్ కాపీని, పిడిఎఫ్‌ని కలిపి పంపాలి. సమకాలీన రచనలపై విమర్శనాత్మక వ్యాసాలకు ప్రాధాన్యం ఉంటుంది. పుస్తకాలను, వ్యాసాలను కింది చిరునామాకు పంపాలి.
అక్షరం, ప్రజాశక్తి కార్యాలయం, తాడేపల్లి, అరవిందా స్కూలు దగ్గర, గుంటూరు జిల్లా..
prajasavvadi@gmail.com

మాజీ ఎన్నికల కమిషనర్ ఎంఎస్ గిల్ కన్నుమూత

న్యూఢిల్లీ : మాజీ ప్రధాన ఎన్నికల కమిషనర్ (సిఇసి) మనోహర్ సింగ్ (ఎంఎస్) గిల్ ఆదివారం తుదిశ్వాస విడిచారు. ఆయన వయస్సు 86 ఏళ్లు. వయస్సు సంబంధిత అనారోగ్యంతో దక్షిణ ఢిల్లీలోని ఒక ఆసుపత్రిలో గిల్ కన్నుమూశారు. సోమవారం గిల్ అంత్యక్రియలు నిర్వహించనున్నారు. మన్మోహన్ సింగ్ ప్రభుత్వంలో గిల్ క్రీడలు, యువజన వ్యవహారాల మంత్రిగానూ, అలాగే స్టాటిస్టిక్స్- ప్రోగ్రామ్ ఇంప్లిమెంటేషన్ మంత్రిగానూ పనిచేశారు. గిల్‌కు భార్య, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. పంజాబ్ కేడర్‌కు చెందిన ఐఎఎస్ అధికారి గిల్ 1996 నుంచి 2001 వరకూ సిఇసిగా పని చేశారు. పద్మవిభూషణ్ అవార్డు కూడా గిల్ అందుకున్నారు.

2024 తరువాత కేంద్రంలో మోడీ ప్రభుత్వం ఉండదు : స్టాలిన్

చెన్నై : 2024 ఎన్నికల తరువాత కేంద్రంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం ఉండదని తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకె స్టాలిన్ తెలిపారు. చెన్నైలోని నందనం వైఎంసిఎ మైదానంలో డిఎంకె ఆధ్వర్యాన నిర్వహించిన మహిళా హక్కుల సదస్సులో స్టాలిన్ ప్రసంగించారు. 2024 ఎన్నికల తరువాత కేంద్రంలో మోడీ ప్రభుత్వం ఉండదని అన్నారు. ఇండియా ఫోరం కేవలం ఎన్నికల కూటమి కాదని, విధానపరమైన కూటమి అని తెలిపారు. వెనకబడిన తరగతుల మహిళలపై కేంద్ర ప్రభుత్వం రాజకీయ కుట్ర చేస్తోందని స్టాలిన్ విమర్శించారు. మహిళా రిజర్వేషన్ బిల్లును 'ఒక రహస్య ఉద్దేశంతో' మోడీ ప్రభుత్వం ప్రవేశపెట్టిందని ఆరోపించారు. అన్ని మతాలు సమాన హక్కులు పొందాలని స్టాలిన్ స్పష్టం చేశారు. ఈ సదస్సులో కాంగ్రెస్ అగ్రనేతలు సోనియాగాంధీ, ప్రియాంకా గాంధీ తదితరులు పాల్గొన్నారు.

27 మంది భారత జాలర్ల అరెస్టు

చెన్నై : తమిళనాడుకు చెందిన 27 మంది భారత జాలర్లను శ్రీలంక నేవీ సిబ్బంది అరెస్టు చేశారు. అరెస్టయిన వారంతా రామేశ్వరం, తంగచ్చిమడం ప్రాంతాలకు చెందినవారు. వీరికి చెందిన ఐదు మెకనైజ్డ్ బోట్లను కూడా శ్రీలంక నేవీ స్వాధీనం చేసుకుంది. ఈ నెల 14న పాల్క్ బే వెంబడి చేపల వేటలో నిమగ్నమై ఉండగా వీరిని శ్రీలంక అరెస్టు చేసింది. అరెస్టు చేసిన వారిని శ్రీలంకలోని మన్నార్, కంకేసంతురై ఓడరేవులకు తరలించారు. ఈ అరెస్టు వార్త తెలిసిన తమిళనాడులోని తీర ప్రాంత జాలర్లు, ప్రజలు దిగ్భ్రాంతికి గురయ్యారు. తమవారిని ఆదుకోవాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేశారు. అరెస్టులను ఖండిస్తూ ఆదివారం నుంచి రామేశ్వరం జాలర్లు నిరవధిక సమ్మె నిర్వహిస్తున్నారు.

సరిహద్దు చెక్‌పోస్ట్‌ల్లో రేడియేషన్ డిటెక్షన్ పరికరాలు

న్యూఢిల్లీ : విదేశాల నుంచి రేడియోధార్మిక పదార్థాల అక్రమరవాణా అడ్డుకట్టకు చర్యలు తీసుకోవాలని కేంద్రం భావిస్తుంది. ఇందులో భాగంగా పాకిస్థాన్‌తో సహా బంగ్లాదేశ్, మయన్మార్, నేపాల్‌లతో ఉన్న ఎనిమిది సరిహద్దు చెక్‌పోస్టుల్లో రేడియేషన్ డిటెక్షన్ పరికరాలను (ఆర్‌డిఇ) ఏర్పాటు చేసేందుకు సిద్ధమైంది. పాకిస్థాన్ సరిహద్దులోని సమీకృత చెక్‌పోస్టు (ఐసిపి)లు, ల్యాండ్ పోర్టులు, బంగ్లాదేశ్ సరిహద్దులోని పెట్రాపోల్, అగర్తలా, డాకీ, సుతార్‌కండీ, నేపాల్ సరిహద్దులోని రాక్సువల్ జోగ్‌బానీ, మయన్మార్‌లోని మోరే పోర్టుల్లో ఈ ఆర్‌డిఇలు ఏర్పాటు చేయనున్నారు. ఈ పరికరాల సరఫరా, ఏర్పాటు, నిర్వహణ కోసం ప్రభుత్వ ఇప్పటికే ఒప్పందం కుదుర్చుకుందని సంబంధిత అధికారులు తెలిపారు. ఈ ఆర్‌డిఇలకు ప్రత్యేక అలారం వ్యవస్థతోపాటు అనుమానిత వస్తువుల వీడియో ఫ్రేములను రూపొందించే సామర్థ్యం కూడా ఉంటుందని అధికారులు తెలిపారు.

ఢిల్లీలో భూప్రకంపనలు

న్యూఢిల్లీ: దేశరాజధాని ప్రాంతం (ఎన్‌సిఆర్), ఢిల్లీ పరిసర ప్రాంతాల్లో మరోసారి భూప్రకంపనలు సంభవించాయి. ఈ ప్రాంతంలో ఈ నెల 3న తీవ్ర భూప్రకంపనలు రాగా.. తాజాగా ఆదివారం మళ్లీ భూప్రకంపనలు సంభవించడం ఆందోళన కలిగిస్తోంది. మధ్యాహ్నం సమయంలో ఢిల్లీ- ఎన్‌సిఆర్ పరిసర ప్రాంతాల్లో కొద్దిసేపు భూమి బలంగా కంపించడంతో ప్రజలు భయాందోళనలకు గురయ్యారు. భయంతో ఇళ్ల నుంచి బయటకు పరుగులు తీశారు. సాయంత్రం 4.08గంటల సమయంలో హర్యానాలోని ఫరీదాబాద్‌లో భూకంప తీవ్రత రిక్టర్‌స్కేలుపై 3.1గా నమోదైనట్టు జాతీయ భూకంప కేంద్రం పేర్కొంది.

ఆఫ్ఘన్‌లో మరోసారి భూకంపం

కాబూల్ : ఆఫ్ఘనిస్థాన్‌లో ఆదివారం భారీ భూకంపం వచ్చింది. దీని తీవ్రత భూకంపలేఖినిపై 6.3గా నమోదైనట్లు అమెరికా జియోలాజికల్ సర్వే వెల్లడించింది. పశ్చిమ ఆఫ్ఘనిస్థాన్‌లోని హెరాత్ నగరానికి 34 కిలోమీటర్ల దూరంలో దాదాపు 8 కిలోమీటర్ల లోతున ఈ భూకంప కేంద్రం ఉన్నట్లు గుర్తించారు. ఆదివారం సంభవించిన భూకంపంలో నష్టాల వివరాలు ఇంకా వెల్లడి కాలేదు. ఈ నెల 7వ తేదీన హెరాత్ ప్రావిన్స్‌లో వచ్చిన భూకంపంలో ఇప్పటి వరకూ 2 వేల మందికి పైగా ప్రాణాలు కోల్పోయారు. ఆ దేశ చరిత్రలోనే అత్యంత తీవ్రమైన భూకంపాల్లో ఇది కూడా ఒకటిగా నిలిచింది. ఈ నెల 11వ తేదీన మరోసారి 6.3 తీవ్రతతో ఇక్కడ భూకంపం వచ్చింది. ఈ రెండో భూకంపంలో వేల ఇళ్లు నేలమట్టం అయ్యాయి. వరుస భూకంపాలతో ఆఫ్ఘనిస్థాన్‌లో సహాయక కార్యక్రమాలకు తీవ్ర ఆటంకం కలుగుతోంది.

శాంతి స్థాపనకు సహకరించండి

- ప్రజల ప్రాథమిక హక్కులను పరిరక్షించండి
- గవర్నర్‌ను కోరిన మణిపూర్ పార్టీలు



మణిపూర్‌లోని ఇంఫాల్‌లో భారీర్యాలీ నిర్వహిస్తున్న ప్రతిపక్ష పార్టీలు

ఇంఫాల్ : మణిపూర్‌లో కొనసాగుతున్న హింసాకాండను నివారించేందుకు అర్థవంతమైన శాంతి చర్చలు జరగడం లేదని ఆ రాష్ట్రానికి చెందిన పది ప్రతిపక్ష పార్టీలు ఆందోళన వ్యక్తం చేశాయి. రాష్ట్రంలో శాంతి స్థాపనలో, ప్రజాస్వామ్య పరిరక్షణలో, బాధితులకు అవసరమైన సహాయ పునరావాస చర్యలు చేపట్టడంలో సాయపడాలని గవర్నర్ అనుసూయా ఊకేకు విజ్ఞప్తి చేశాయి. ప్రతిపక్ష పార్టీలు గవర్నర్‌ను కలిసి ఈ మేరకు వినతిపత్రాన్ని అందించాయి. రాష్ట్రంలో ఐదు నెలలకు పైగా సంక్షోభం కొనసాగుతోందని, అయినప్పటికీ నేటి వరకూ కుకీలు, మైతీలతో అర్థవంతమైన శాంతి చర్చలు ప్రారంభం కాలేదని ఆ వినతిపత్రంలో తెలియజేశాయి. జాతుల మధ్య తలెత్తిన ఘర్షణల్లో జోక్యం చేసుకోరాదని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భావిస్తున్నాయని, పైగా సంక్షోభానికి దారితీసిన ప్రధాన కారణాలను పక్కదారి పట్టించేందుకు ప్రయత్నిస్తున్నాయని ప్రతిపక్ష నేతలు విమర్శించారు. వినతిపత్రాన్ని అందజేసిన పార్టీల్లో కాంగ్రెస్, ఐక్య జనతాదళ్, సీపీఐ, సీపీఐ (ఎం), తృణమూల్ కాంగ్రెస్, అమ్‌ఆద్మీ, ఆల్ ఇండియా ఫార్వర్డ్‌బ్లాక్, ఎన్సీపీ, శివసేన (ఠాక్రే), ఆర్‌ఎస్‌పీ ఉన్నాయి. మణిపూర్‌లో శాంతి భద్రతల పరిరక్షణలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ యంత్రాంగాలు విఫలమయ్యాయని ప్రతిపక్షాలు ఆరోపించాయి. రాష్ట్రంలో పరిపాలన లేకపోవడంతో స్థానిక పౌర సమాజాలు వివిధ రకాల ఆందోళనలు సాగిస్తూ ప్రకటనలు చేస్తున్నాయని అభిప్రాయపడ్డాయి. ప్రాథమిక హక్కులను వినియోగించుకోకుండా ప్రజలను అడ్డుకునేందుకు ప్రభుత్వం నిషేధ చర్యలకు పూనుకుంటోందని మండిపడ్డాయి. ప్రజాస్వామ్యానికి భారత్ తల్లి లాంటిదంటూ ప్రధాని మోడీ గొప్పగా చెబుతున్నప్పటికీ ఇలా జరుగుతోందని విమర్శించాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విధించిన ఆంక్షలను వెంటనే తొలగించి పౌరుల ప్రాథమిక హక్కులను పరిరక్షించాలని గవర్నర్‌కు సమర్పించిన వినతిపత్రంలో ప్రతిపక్షాలు కోరాయి. బాధితులకు అందజేస్తున్న సహాయ ప్యాకేజీ ఏ మాత్రం సరిపోదని తెలిపాయి. హింసాకాండలో చనిపోయిన వారి మృతదేహాలను ఆయా కుటుంబాలకు అందజేయాలని కోరాయి.

మూడు రాష్ట్రాల్లో తొలి జాబితాల విడుదల

- తెలంగాణలో 55 మందిని ప్రకటించిన కాంగ్రెస్



హైదరాబాద్ గాంధీభవన్‌లో అభ్యర్థుల జాబితా ప్రకటిస్తున్న టిపిసిసి అధ్యక్షులు రేవంత్ రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఎన్నికలు జరగనున్న ఐదు రాష్ట్రాల్లో మూడు రాష్ట్రాలకు సంబంధించిన తొలి జాబితాలను కాంగ్రెస్ పార్టీ ఆదివారం విడుదల చేసింది. విస్తృత సర్వేలు, సామాజిక సమీకరణాల అనంతరం కాంగ్రెస్ పార్టీ తెలంగాణలో 55 మంది అభ్యర్థులతో తొలి జాబితాను ఆదివారం ప్రకటించింది. పార్టీలో బిసిలకు ప్రాధాన్యం తగ్గుతుందని ఆ తరగతులకు చెందిన నాయకులు అసంతృప్తి వ్యక్తంచేస్తున్న నేపథ్యంలో పార్టీ అధిష్టానం అన్ని జాగ్రత్తలూ తీసుకుంది. టికెట్ కోసం దరఖాస్తు చేసుకున్న బిసి నాయకుల్లో సీనియర్లందరికీ అవకాశం ఇచ్చినట్లు తెలిసింది. రిజర్వుడ్ స్థానాలకు పెద్దగా పోటీ లేకున్నా జనరల్ స్థానాల్లో అభ్యర్థుల ఎంపికపై ఆదివారం రాత్రి వరకు హై కమాండ్ తుది నిర్ణయం తీసుకోలేదు. టికెట్ల వ్యవహారంలో ఢిల్లీ కాంగ్రెస్ నాయకులు గతంలో కంటే భిన్నంగా అత్యంత జాగ్రత్తగా వ్యవహరిస్తున్నారు. ఖమ్మం నియోజకవర్గం నుంచి మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, పాలేరు నుంచి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్లు ఫైనల్ అయినట్లు పార్టీ చెబుతున్నా.. మొదటి జాబితాలో వీరి పేర్లు లేకపోవడం గమనార్హం.

కుటుంబానికి ఒకటే టికెట్ అని పార్టీ ప్రకటించినా.. కొన్నిచోట్ల ఇద్దరికి ఇచ్చింది. బిఆర్ఎస్‌కి రాజీనామా చేసి ఇటీవల కాంగ్రెస్‌లో చేరిన మల్కాజ్‌గిరి సిట్టింగ్ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు కుటుంబానికి రెండు టికెట్లు దక్కాయి. కాంగ్రెస్ సిట్టింగ్ ఎంపి ఉత్తమ్ కుమార్ రెడ్డి హుజూర్ నగర్ నుంచి పోటీ చేస్తుండగా.. ఆయన భార్య పద్మావతి రెడ్డికి కోదాడ టికెట్ కేటాయించారు. కొడంగల్ నుంచి పిసిసి అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, నల్గొండ నుంచి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి పోటీ చేయనున్నారు. జగిత్యాల నుంచి మాజీ మంత్రి జీవన్ రెడ్డి, మంథని నుంచి శ్రీధర్ బాబు, ఆందోల్ నుంచి రాజనర్సింహ, నాగార్జున సాగర్ నుంచి జానారెడ్డి కుమారుడు జయవీర్, ములుగు నుంచి సీతక్క, మధిర నుంచి భట్టి విక్రమార్క బరిలో ఉన్నారు. పొత్తుల్లో భాగంగా భద్రాచలం టికెట్‌ను వామపక్షాలు డిమాండ్ చేసినప్పటికీ కాంగ్రెస్ సిట్టింగ్ ఎమ్మెల్యే, గిరిజన నేత పొదెం వీరయ్యకే మళ్లీ ఆ స్థానం కేటాయించారు. కమ్యూనిస్టులతో పొత్తు దాదాపు ఖరారైనప్పటికీ సీట్ల కేటాయింపులో స్పష్టత వచ్చిన తర్వాత ప్రకటిస్తామని కాంగ్రెస్ ముఖ్య నాయకుడు ఒకరు తెలిపారు.

మధ్యప్రదేశ్‌లో 144 స్థానాలకు, ఛత్తీస్‌గఢ్‌లో 30 స్థానాలకు అభ్యర్థులు ఖరారు

మొదటి జాబితాలో మధ్యప్రదేశ్‌లో 144 స్థానాలకు, ఛత్తీస్‌గఢ్‌లో 30 స్థానాలకు, తెలంగాణలో 55 స్థానాలకు అభ్యర్థులను ప్రకటించారు. 230 అసెంబ్లీ స్థానాలున్న మధ్యప్రదేశ్‌లో మొదటి జాబితాలో భాగంగా 144 స్థానాలకు అభ్యర్థులను ప్రకటించారు. మొదటి జాబితా ప్రకారం మాజీ ముఖ్యమంత్రి కమల్‌నాథ్ చింద్వారా నియోజకవర్గం నుంచి పోటీ చేయనున్నారు. మాజీ సిఎం దిగ్విజయ్ సింగ్ సోదరుడు లక్ష్మణ్ సింగ్ చచౌరా నియోజకవర్గం నుంచి బరిలోకి దిగుతున్నారు. రఘోగఢ్ స్థానం నుంచి మాజీ సిఎం కుమారుడు జైవర్ధన్ సింగ్ బరిలోకి దిగారు. మధ్యప్రదేశ్ సీఎం శివరాజ్‌సింగ్ చౌహాన్ పోటీ చేస్తున్న బుధ్ని నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ తమ అభ్యర్థిగా విక్రమ్ మస్తాల్‌ను పోటీకి దింపింది. చుర్హాట్ నుంచి అజయ్ సింగ్ రాహుల్, రౌ నుంచి జితు పట్వారీ, అతేర్ నుంచి హేమంత్ కటారే, ఝబువా నుంచి విక్రాంత్ భూరియాలను కాంగ్రెస్ పోటీకి దింపింది. తొలి జాబితాలో 30 ఎస్టీ కమ్యూనిటీ నియోజకవర్గాలకు, 22 ఎస్సీ సామాజిక వర్గం నియోజకవర్గాలకు కాంగ్రెస్ పార్టీ తమ అభ్యర్థులను ప్రకటించింది.

90 అసెంబ్లీ స్థానాలున్న ఛత్తీస్‌గఢ్‌లో తమ తొలి జాబితాలో భాగంగా 30 స్థానాలకు అభ్యర్థులను ప్రకటించింది. ఛత్తీస్‌గఢ్‌లో డిప్యూటీ సీఎం టిఎస్ సింగ్ డియో తన కంచుకోట అయిన అంబికాపూర్ నుంచి బరిలో నిలిచారు. ముఖ్యమంత్రి భూపేష్ బఘేల్ పటాన్ నుంచి పోటీ చేయనున్నారు. సిఎం బఘెల్ 2003 నుంచి పటాన్ నియోకవర్గం నుంచే ప్రాతినిధ్యం వహిస్తున్నారు. 2014 నుంచి 2019 వరకు ఛత్తీస్‌గఢ్ కాంగ్రెస్ చీఫ్‌గా పనిచేశారు. ఆయన పటాన్ నియోజకవర్గంలో తన మేనల్లుడు, బిజెపి నేత విజయ్ బాగెల్‌తో తలపడనున్నారు. అమర్జీత్ భగత్ మరోసారి సీతాపూర్ నుంచి పోటీ చేయనున్నారు. సీతాపూర్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి అమర్జీత్ భగత్ నాలుగుసార్లు గెలిచారు. ఛత్తీస్‌గఢ్‌లో ప్రకటించిన 30 మంది అభ్యర్థుల్లో 14 మంది ఎస్టీ వర్గానికి చెందిన వారున్నారు. ఈ మొదటి జాబితాలో ముగ్గురు మహిళలకు కూడా టికెట్లు ఇచ్చారు.



శివపురిలో కాంగ్రెస్ వ్యూహాత్మక అడుగులు

- జ్యోతిరాదిత్యపై పోటీకి పిచోర్ ఎమ్మెల్యే ఎంపిక
- మధ్యప్రదేశ్‌లో వేడెక్కిన రాజకీయం

శివపురి : మధ్యప్రదేశ్‌లో ఎన్నికల వేడి రాజుకుంటోంది. శాసనసభ ఎన్నికల్లో పోటీ చేసే 144 మంది అభ్యర్థుల జాబితాను కాంగ్రెస్ పార్టీ ఆదివారం ప్రకటించింది. శివపురి జిల్లాలోని మొత్తం ఐదు స్థానాలకూ ఆ పార్టీ అభ్యర్థులను ఖరారు చేసింది. శివపురి స్థానంలో పోటీ చేసేందుకు పిచోర్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి కేపీ సింగ్‌కు టిక్కెట్ కేటాయించి అందరినీ ఆశ్చర్యపరచింది. శివపురి నుండి బీజేపీ అభ్యర్థిగా పోటీ చేసేందుకు రాష్ట్ర క్రీడా మంత్రి యశోధర రాజె సింధియా నిరాకరించారు. ఆరోగ్య కారణాలతో ఎన్నికలకు దూరంగా ఉంటున్నానని ఆమె ప్రకటించారు. దీంతో ఈ స్థానం నుండి బీజేపీ అభ్యర్థిగా జ్యోతిరాదిత్య సింధియా పోటీ చేస్తారని వార్తలు వస్తున్నాయి. దీంతో ఆయనకు చెక్ పెట్టేందుకు కాంగ్రెస్ పార్టీ వ్యూహాత్మకంగా సీనియర్ నేత కేపీ సింగ్‌ను బరిలో దింపుతోంది.

కాంగ్రెస్‌కు చెందిన ఇతర నేతలతో పోలిస్తే జ్యోతిరాదిత్యకు సింగ్ గట్టి పోటీ ఇస్తారని రాజకీయ పండితులు అంచనా వేస్తున్నారు. ఆయన ప్రస్తుతం ప్రాతినిధ్యం వహిస్తున్న పిచోర్ స్థానానికి శివపురి పొరుగు ప్రాంతం. సింగ్ మద్దతుదారుల్లో చాలా మంది శివపురి ప్రాంతంలోనూ నివసిస్తున్నారు. పిచోర్ నుండి సింగ్ వరుసగా ఆరుసార్లు శాసనసభకు ఎన్నికయ్యారు. బీజేపీ కనుక జ్యోతిరాదిత్యను శివపురి నుండి పోటీకి దింపితే ఇరువురి మధ్య హోరాహోరీ పోరు సాగే అవకాశం ఉంది.

కాగా సింగ్ పేరు జాబితాలో చూసి కాంగ్రెస్ టిక్కెట్ ఆశిస్తున్న ఇతర నేతలు దిగ్భ్రాంతికి గురయ్యారు. ఎందుకంటే సింగ్ పేరు ఆ స్థానానికి అసలు పరిశీలనకే రాలేదు. అయితే ఆరుసార్లు ఎమ్మెల్యేగా పనిచేసినప్పటికీ పిచోర్‌లో పరిస్థితులు ప్రస్తుతం సింగ్‌కు అంత అనుకూలంగా లేవని, అందుకే ఆయన్ని శివపురిలో పోటీ చేయిస్తున్నారని రాజకీయ విశ్లేషకులు తెలిపారు.

అధికారాన్ని దుర్వినియోగం చేస్తున్న బిజెపి

- శరద్‌పవార్

ముంబయి : రాష్ట్రాలు, కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వాలు అధికారాన్ని దుర్వినియోగం చేస్తున్నాయని ఎన్‌సిపి అధ్యక్షులు శరద్‌పవార్ ఆదివారం ఆరోపించారు. బిజెపి ప్రభుత్వాల పాలనలో శాంతిభద్రతు పూర్తిగా క్షీణించాయని విమర్శించారు. అధికారాన్ని దుర్వినియోగం చేస్తున్నవారి నుంచి లాక్కొని సామాన్యులకు అప్పగిస్తామని శరద్‌పవార్ స్పష్టం చేశారు. మాజీ కార్పొరేటర్ రాఖీ జాదవ్‌ను ముంబయి ఎన్‌సిపి విభాగం అధ్యక్షునిగా నియమించిన సందర్భంగా ముంబయిలో ఆదివారం ఏర్పాటు చేసిన బహిరంగ ర్యాలీలో శరద్‌పవార్ ప్రసంగించారు. ' శాంతిభద్రతలు పూర్తిగా కుప్పకూలడం ఈ రోజు మనం చూస్తున్నాం. మహారాష్ట్రలో వేలాది మంది బాలికలు, మహిళలు అదృశ్యమయ్యారు. ఢిల్లీలో జర్నలిస్టులపైనా, రాజకీయ ప్రత్యర్థులపైనా పోలీసులను ప్రయోగిస్తున్నారు. అధికార బిజెపి అధికారాన్ని దుర్వినియోగం చేస్తోంది. బిజెపికి వ్యతిరేకంగా మనమందరం ఐక్యంగా నిలబడాల్సిన అవసరం ఉంది. 'ఇండియా' కూటమి ద్వారా అలా చేయాలని నిర్ణయించుకున్నాం' అని శరద్ పవార్ తెలిపారు. 'మనమంతా 'ఇండియా'లో భాగమే. మేం అందులో ఉన్నామంటే.. మీరు కూడా అందులో భాగమే. మనమంతా ఇందులో భాగమే. అధికారాన్ని దుర్వినియోగం చేస్తున్న వారి నుంచి లాక్కొని సామాన్యులకు అప్పగిస్తాం' అని శరద్ పవార్ తెలిపారు.

ఓటర్లు తక్కువ... అభ్యర్థులు ఎక్కువ

- రాజస్థాన్‌లోని కిషన్‌పోల్ ముఖచిత్రం

జైపూర్ : రాజస్థాన్ రాజధానిలోని జైపూర్‌లో ఉన్న కిషన్‌పోల్ శాసనసభ స్థానంలోని ఓటర్ల సంఖ్య చాలా తక్కువ. ఈ స్థానంలో ఓటర్ల సంఖ్య కేవలం 1,91,564 మాత్రమే. అక్కడ గత ఎన్నికల్లో 30 మంది అభ్యర్థులు పోటీ చేశారు. ఆశ్చర్యకరమైన విషయమేమంటే రాష్ట్రంలోని ఇతర నియోజవర్గాల్లో ప్రతిసారీ ఓటర్ల సంఖ్య పెరుగుతుండగా కిషన్‌పోల్‌లో ఈసారి తగ్గింది. గత శాసనసభ ఎన్నికలతో పోలిస్తే ఇప్పుడు ఓటర్ల సంఖ్య ఆరువేలు తగ్గింది. జైపూర్ నడిబొడ్డున ఉన్న కిషన్‌పోల్ నుండి మాజీ రాష్ట్రపతి భైరాన్‌సింగ్ షెకావత్ రెండుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. మొదటిసారి 1962లో, రెండోసారి 1967లో ఆయన శాసనసభ్యుడిగా గెలుపొందారు. 1985 తర్వాత కిషన్‌పోల్‌లో ఎనిమిది సార్లు అసెంబ్లీ ఎన్నికలు జరగ్గా బీజేపీ ఆరుసార్లు, కాంగ్రెస్ రెండుసార్లు విజయం సాధించాయి.

హిందువుల వలసలతో కిషన్‌పోల్ నియోజకవర్గం గత కొన్ని సంవత్సరాలుగా వార్తల్లోకి ఎక్కుతోంది. అనేక హిందూ కుటుంబాలు తమ ఆస్తులను తెగనమ్ముకొని శివారు ప్రాంతాలకు తరలిపోయాయని కొన్ని నెలల క్రితం మీడియాలో కథనాలు వెలువడ్డాయి. పేరుకు కిషన్‌పోల్ నియోజకవర్గం చిన్నదే అయినప్పటికీ అభ్యర్థులు అధిక సంఖ్యలో పోటీ చేస్తూ తమ అదృష్టాన్ని పరీక్షించుకోవడం విశేషం.

సోషలిజం ఒక అవకాశం మాత్రమే కాదు, అదే మార్గం

- అంతర్జాతీయ వామపక్ష నేతల సదస్సులో వక్తలు

జొహానెస్‌బర్గ్: 'మూడవ ఇంటర్నేషనల్ డైలమాస్ ఆఫ్ హ్యుమానిటీ' పేరుతో ఈ నెల 14 నుండి 18 వరకు జొహానెస్‌బర్గ్‌లోని కాన్స్టిట్యూషన్ హిల్‌లో వామపక్ష నేతల సదస్సు జరుగుతోంది. ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రజా ఉద్యమాలు, వామపక్ష రాజకీయ పార్టీల నాయకులకు సోషలిజం ఏం చేస్తుంది, సోషలిజాన్ని నిర్మించడమంటే ఏమిటి? అన్నదానిపై స్పష్టత కల్పించడమే ఈ సదస్సు ఉద్దేశం. ఈ సదస్సులో దాదాపు 500 మంది ఉద్యమ నాయకులు, ట్రేడ్ యూనియన్ నాయకులు, 70కి పైగా దేశాలకు చెందిన వామపక్ష పార్టీల ప్రతినిధులు పాల్గొంటున్నారు.

ఈ సదస్సు నిర్వాహకులుగా ఇంటర్నేషనల్ పీపుల్స్ అసెంబ్లీ (ఐపిఎ) వ్యవహరిస్తుండగా, దీనికి నేషనల్ యూనియన్ ఆఫ్ మెటల్‌వర్కర్స్ ఆఫ్ సౌత్ ఆఫ్రికా (నుమ్సా), అబహ్లాలీ బేస్ మ్జోండోలో, సోషలిస్ట్ రివల్యూషనరీ వర్కర్స్ పార్టీ ఆఫ్ సౌత్ ఆఫ్రికా ఆతిధ్యమిచ్చాయి.

నుమ్సా అధ్యక్షుడు ఆండ్రూ చిర్వా ప్రారంభ పలుకులతో మొదటి రోజు సమావేశం ప్రారంభమైంది, " సహజవనరులను దోపిడీ చేయడం, కష్టజీవులు, పేదలు, గ్రామీణ రైతులు , మూలవాసీలను దోపిడీ చేయడం ద్వారా ప్రపంచ పెట్టుబడిదారీ వ్యవస్థ మనుగడ సాగిస్తుంది, అభివద్ధి చెందుతుంది. కార్మికవర్గం నుంచి, పేదల శ్రమ నుంచి పిండుకున్న గరిష్ట విలువను వారికి చెల్లించకుండా ఇది తన జేబులో వేసుకుంటుంది ఈ సంక్షోభాన్ని అధిగమించి, సోషలిజాన్ని ఎలా నిర్మించాలో ప్లాన్ చేసేందుకు ఈ సదస్సు ఒక వేదిక అవుతుందని ఆయన అన్నారు. ఆ తర్వాత పాలస్తీనాలో ప్రస్తుత పరిస్థితిపై సదస్సు చర్చించింది. గాజా స్ట్రిప్‌పై ఇజ్రాయెల్ విచక్షణారహిత బాంబు దాడిని అది ఖండించింది. పాలస్తీనా ఆక్రమణను అంతం చేయడానికి అంతర్జాతీయ సంఘీభావ ఉద్యమాన్ని ఎలా బలోపేతం చేసుకోవాలి అనే అంశంపై చర్చలో పాలస్తీనా ఉద్యమకారులు లీలా ఖలీద్, పాపులర్ ఫ్రంట్ ఫర్ ది లిబరేషన్ ఆఫ్ పాలస్తీనా సభ్యురాలు, పాలస్తీనియన్ పీపుల్స్ పార్టీ ప్రతినిధి అర్వా అబు హష్హాష్, అలాగే దక్షిణాఫ్రికా విదేశాంగ మంత్రి నలేడి పండోర్, దక్షిణాఫ్రికా మాజీ ఇంటెలిజెన్స్ మంత్రి , జాతి వివక్షా వ్యతిరేక పోరాటంలో ఆఫ్రికన్ నేషనల్ కాంగ్రెస్ సాయుధ విభాగం వ్యవస్థాపక సభ్యుడు రోనీ కాస్రిల్స్,,క్లాడియా డి లా క్రజ్ తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్నం సెషన్‌లో 'సోషలిజం బిల్డింగ్ టుడే' అనే అంశంపై ప్రతినిధులు చర్చించారు. మానవాళి ఎదుర్కొంటున్న సమస్యలకు సోషలిస్ట్ పరిష్కారాలను కనుగొనడం గురించి ప్రతినిధులు నిర్దిష్ట అనుభవాలను పరస్పరం తెలియజేసుకున్నారు.

రెకోలేటా మునిసిపాలిటీ మేయర్, చిలీ కమ్యూనిస్ట్ పార్టీ సభ్యుడు డేనియల్ జాడ్యూ, తన మునిసిపాలిటీలో ప్రజలు ఎదుర్కొంటున్న ఆరోగ్యం, గహ ప్రవేశం వంటి ప్రాథమిక సమస్యలను పరిష్కరించేందుకు ఎలా కృషి చేసిందీ వివరించారు.. "సోషలిజం అనేది ఒక అవకాశం మాత్రమే కాదు, అదే మార్గం " అని రెకోలేటా మేయర్ ప్రకటించారు.

పీపుల్స్ రిపబ్లిక్ ఆఫ్ చైనా 1949 నుండి సోషలిజం వైపు తన స్వంత మార్గాన్ని నిర్మిస్తోంది,అనేక దశలను దాటింది. ఎన్నో పురోగతులు, ఎన్నో ఆటంకాలను అధిగమించి ముందుకు సాగుతోంది" అని డాంగ్‌షెంగ్ న్యూస్ కలెక్టివ్‌కి చెందిన టింగ్స్ చక్ తెలిపారు.

వెనిజులాలోని సైమన్ బొలివర్ ఇన్‌స్టిట్యూట్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కార్మెన్ నవాస్, మార్క్సిస్ట్ చరిత్రకారుడు విజయ్ ప్రసాద్ కూడా ఈ సదస్సులో పాల్గొన్నారు.

రేపటి లోగా నిల్వల వివరాలు ఇవ్వండి

- చక్కెర వ్యాపార సంస్థలకు కేంద్రం ఆదేశం

న్యూఢిలీ: చక్కెర వ్యాపారంలో ఉన్న చట్టబద్ధ సంస్థలన్నీ అక్టోబర్ 17లోగా తమ వద్ద ఉన్న నిల్వల వివరాలను అందజేయాలని కేంద్ర ప్రభుత్వం ఆదేశించింది. ఈ ఆదేశాలను ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాల్సి వస్తుందని హెచ్చరించింది. టోకు, రిటైల్ వ్యాపారులతో పాటు ప్రాసెసర్లు సైతం తమ వద్ద ఉన్న చక్కెర నిల్వల వివరాలను ప్రతివారం వెబ్‌సైట్‌లో అప్‌డేట్ చేయాలని గత నెల 23నే కేంద్ర ఆహార శాఖ ఆదేశించింది. కానీ, అనేక సంస్థలు ఇప్పటి వరకు నిల్వ వివరాలను సమర్పించలేదు. దీంతో తాజాగా కేంద్రం ఈ ఆదేశాలు జారీ చేసింది. కొన్ని సంస్థల వద్ద పెద్ద మొత్తంలో నివేదించని చక్కెర నిల్వలు ఉన్నట్లు డైరెక్టరేట్ ఆఫ్ షుగర్ అండ్ వెజిటెబుల్ ఆయిల్ ఇటీవల గుర్తించినట్లు ఆహార శాఖ తెలిపింది. ఆయా సంస్థలు తమ వద్ద ఉన్న చక్కెర నిల్వ వివరాలను అప్‌డేట్ చేయడం లేదని, ఈ నేపథ్యంలోనే నిల్వ వివరాలన్నింటినీ వెంటనే వెబ్‌సైట్‌లో పొందుపర్చాలని ఆదేశించినట్లు తెలిపింది. ప్రతివారం వివరాలను సమర్పించాల్సి ఉంటుందని తెలిపింది. అక్టోబర్ 17 నాటికి నిల్వ వివరాలన్నీ వెబ్‌సైట్‌లో ఉండాలని.. ఇదే చివరి అవకాశమని స్పష్టం చేసింది. లేదంటే జరిమానాలు, కఠిన ఆంక్షలు విధించాల్సి వస్తుందని పేర్కొంది.

మనీలాండరింగ్ కేసులో ఎన్‌సిపి మాజీ ఎంపీ రూ.315కోట్ల ఆస్తుల అటాచ్

ముంబై : మనీలాండరింగ్ కేసులో ఎన్‌సిపి మాజీ ఎంపీకి చెందిన రూ.315 కోట్ల ఆస్తులను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) జప్తు చేసింది. రాజ్యసభ మాజీ సభ్యులు ఈశ్వర్‌లాల్ శంకర్‌లాల్ జైన్ లాల్వానీకి పలు నగరాల్లో ఉన్న 70 ఆస్తులను జప్తు చేసినట్లు ఇడి తెలిపింది. లాల్వానీ రాజ్‌మల్ లఖిచంద్ జ్యువెలర్స్ ప్రైవేట్ లిమిటెడ్, ఆర్‌ఎల్ గోల్డ్ ప్రైవేట్ లిమిటెడ్, మన్‌రాజ్ జ్యువెలర్స్ ప్రమోటర్‌గా ఉన్నారు. ఆయనపై బ్యాంకులను మోసగించడం, మనీలాండరింగ్ తదితర అభియోగాలు ఉన్నాయి. జల్గావ్, ముంబయి, సిలోడ్, కచ్‌లో ఉన్న లాల్వానీ, ఆయన కంపెనీలకు చెందిన ఆస్తులను ఇడి అటాచ్ చేసింది. స్వాధీనం చేసుకున్న ఆస్తుల్లో భారీ మొత్తంలో కరెన్సీతోపాటు బంగారు, వెండి ఆభరణాలు ఉన్నాయని, వాటి విలువ రూ.315 కోట్లు ఉంటుందని అంచనా. మనీలాండరింగ్ నిరోధక చట్టం కేసులో సిబిఐ మూడు ఎఫ్ఐఆర్‌లను నమోదు చేసింది. కంపెనీల ప్రమోటర్లు తప్పుడు పత్రాలు ఇవ్వడంతో పాటు ఆర్థిక వివరాలను పెంచి చూపేందుకు రౌండ్ ట్రిప్ లావాదేవీలు జరపడం, ఆడిటర్లతో కుమ్మక్కు కావడంతో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాకు రూ.352 కోట్ల నష్టం వాటిల్లిందని సిబిఐ ఆరోపించింది. నకిలీ పత్రాలతో రుణాలు తీసుకొని తారుమారు చేశారని ఇడి ఆరోపించింది. నిందితులు రియల్ ఎస్టేట్ ఆస్తుల్లో అక్రమంగా పెట్టుబడులు పెట్టారంటూ ఆగస్టులోనూ ఇడి దాడులు నిర్వహించింది.

యూఎస్‌లో 'స్టాచ్యూ ఆఫ్ ఈక్వాలిటీ'

న్యూఢిల్లీ : భారత రాజ్యాంగ ప్రధాన రూపశిల్పి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఎత్తైన విగ్రహం యూఎస్‌లో ఆవిష్కృతమైంది. ఇక్కడ యూఎస్ రాజధానిలోని మేరీల్యాండ్ శివారులో అధికారికంగా ప్రారంభించబడింది. ఈ విగ్రహం ఎత్తు 19 అడుగులు. భారత్ వెలుపల ఇదే ఎత్తయిన విగ్రహం కావటం గమనార్హం. ఈ కార్యక్రమానికి యూఎస్‌లోని వివిధ ప్రాంతాల నుంచి 500 మందికి పైగా భారత అమెరికన్లు, ఇతర దేశాల నుంచి వచ్చిన ప్రజలు హాజరయ్యారు. జై భీమ్ నినాదాల మధ్య ఈ ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. స్టాచ్యు ఆఫ్ యూనిటీగా పిలవబడే సర్దార్ పటేల్ విగ్రహాన్ని నిర్మించి, గుజరాత్‌లోని సర్దార్ సరోవర్ డ్యామ్‌కు మీటర్ల దిగువన నర్మదాలోని ఒక ద్వీపంలో ప్రతిష్టించిన ప్రముఖ కళాకారుడు, శిల్పి రామ్ సుతార్ ఈ విగ్రహాన్ని తయారు చేశారు.

అమెరికా తీరుపై మండిపడుతున్న అరబ్ నేతలు

టెల్ అవీవ్ : గాజాపై ఇజ్రాయిల్ దాడికి మద్దతుగా అమెరికా తన భారీ యుద్ధ నౌకలను ఇప్పటికే మధ్యధరా సముద్ర తూర్పు తీరానికి పంపింది. ఇటువంటి చర్యలు పరిస్థితిని మరింత దిగజార్చుతాయని అరబ్ నేతలు హెచ్చరించినట్లు తెలిసింది. అమెరికానే ఈ కథంతా నడిపిస్తోందని ఇరాన్, సిరియా, లెబనాన్ మండిపడుతున్నాయి. గాజాపై ఇజ్రాయిల్ దాడులు ఆపకపోతే అంతకు రెట్టించిన పరిహారాన్ని చెల్లించుకోవాల్సి ఉంటుందని ఇరాన్ ఇప్పటికే హెచ్చరించింది. దాడులను ఆపి, చర్చల ద్వారా శాంతియుత పరిష్కారానికి కృషి చేయాలని ఇరాన్ కోరింది. పాలస్తీనీయుల స్వతంత్ర దేశం ఏర్పాటు ఒక్కటే ఈ సమస్యకు పరిష్కారమని ప్రపంచ నేతలు అభిప్రాయపడుతున్నారు. ఘర్షణలను మరింత రెచ్చగొట్టే చర్యలను ఆపాలని, అంతర్జాతీయ మానవ హక్కుల చట్టాలను గౌరవించాలని బ్లింకెన్‌కు సౌదీ అరేబియా రాజు తేల్చి చెప్పారు.

సామూహిక వలసలపై బాంబు దాడి 70 మంది మృతి

ఆదివారం మధ్యాహ్నానికల్లా గాజాను ఖాళీ చేయాలని, లేని పక్షంలో తీవ్రమైన పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని ఒక వైపు హుకుం జారీ చేస్తూ, మరో వైపు సామూహిక వలసలుపోతున్న గాజా వాసులపై ఇజ్రాయిల్ వైమానిక దాడులకు దిగింది. వాహనాల్లో దక్షిణ ప్రాంతానికి వెళ్తున్న వారిపై ఇజ్రాయిల్ జరిపిన బాంబు దాడిలో మహిళలు, పిల్లలతో సహా 70 మంది చనిపోయినట్లు ఎపి వార్తా సంస్థ తెలిపింది. దక్షిణ గాజాపై వైమానిక దాడులతో, ఇళ్లు ఖాళీ చేసి ఈజిప్టుకు వలసపోతున్నవారు రఫా సరిహద్దులో విశ్రాంతి తీసుకుంటుంటే వారిపైనా దాడులు జరిగాయి.

గాజాకు సాయం అందజేసేందుకు ముందుకొచ్చిన చైనా

గాజాకు అత్యవసర సాయం అందజేస్తామని చైనా విదేశాంగ మంత్రి వాంగ్ యీ తెలిపారు. అత్యవసర మానవతా సాయాన్ని ఐక్యరాజ్య సమితి ద్వారా గాజాకు అందిస్తామని వాంగ్ యీ తెలిపారు. పాలస్తీనా సమస్య శాంతి, న్యాయం, అంతర్జాతీయ చట్టం, మనస్సాక్షితో ముడిపడి ఉందని ఆయన అన్నారు. సమస్య పరిష్కారానికి ఐక్యరాజ్యసమితి ముందుకు రావాలని ఆయన కోరారు. రెస్యూ కమిటీ అత్యవసర సంప్రదింపులలో వాంగ్ యీ చురుకుగా పాల్గొంటున్నారు. ఇదిలావుండగా ఇజ్రాయిల్, హమాస్ మధ్య మధ్యవర్తిత్వం వహించేందుకు ప్రయత్నిస్తామని రష్యా ప్రకటించింది.


పాలస్తీనియన్లను ఇజ్రాయిల్ ఊచకోత కోసే ప్రమాదం ఉందని ఐక్యరాజ్యసమితి ప్రత్యేక ప్రతినిధి ఫ్రాన్సిస్కా అల్బనీస్ శనివారం ఆందోళన వ్యక్తం చేశారు.

హమాస్‌ను తుడిచిపెట్టేస్తా అత్యవసర కేబినెట్ సమావేశంలో నెతన్యాహు

గాజాను నుంచి హమాస్‌ను పూర్తిగా తుడిచిపెట్టేస్తానని యూదు దురహంకారి, బెంజిమిన్ నెతన్యాహు హూంకరించారు. ఆదివారం టెల్ అవీవ్‌లో మంత్రివర్గ అత్యవసర సమావేశాన్ని ఆయన నిర్వహించారు. గాజాలో హమాస్‌ను తుడిచిపెట్టేస్తామని ఆయన అన్నారు. భద్రత విషయంలో దేశమంతా ఒక్కటిగా ఉందనే సందేశాన్ని దేశీయంగా, వెలుపలా చాటాల్సిన అవసరం ఉందని ఇజ్రాయిలీయులను కోరారు. గాజా వాసులు తమ నివాసాలను ఖాళీ చేసి వెళ్లిపోవడానికి అదనంగా ఇచ్చిన మూడు గంటల గడువు ఆదివారం మధ్యాహ్నం ఒంటిగంటతో ముగిసింది. కేబినెట్ సమావేశంలో నెతన్యాహు మాట్లాడుతూ హమాస్‌ను ఇజ్రాయిల్ నామరూపాల్లేకుండా చేస్తుందని డాంబికాలు పలికారు. మనల్ని కూలదోయాలని హమాస్ భావించింది. కానీ, దానికి భిన్నంగా మనమే హమాస్‌ను నాశనం చేయబోతున్నామంటూ జాతీయ ఉన్మాదాన్ని రెచ్చగొట్టే యత్నం చేశారు.

రెండు విమానాల్లో 471 మంది భారతీయుల రాక

ఆపరేషన్ అజయ్‌లో భాగంగా ఇజ్రాయిల్ నుంచి 471 మంది భారతీయులు రెండు విమానాల్లో ఆదివారం న్యూఢిల్లీలోని విమానాశ్రయానికి చేరుకున్నారు. వారికి కేంద్ర విమానయాన శాఖ సహాయ మంత్రి విజయ కుమార్ సింగ్ స్వాగతం పలికారు. 197 మంది ప్రయాణికులతో మూడో విమానం ఢిల్లీ విమానాశ్రయంలో ఆదివారం ఉదయం దిగినట్లు విదేశీ వ్యవహారాల మంత్రిత్వశాఖ అధికార ప్రతినిధి అరిందమ్ బాగ్చి తెలిపారు. 274 మంది ప్రయాణికులతో నాలుగవ విమానం ఢిల్లీ చేరుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. శుక్ర, శనివారాల్లో రెండు చార్టర్డ్ విమానాల్లో 435 మంది భారతీయులు ఇజ్రాయిల్, గాజా ప్రాంతాల నుంచి వచ్చారు.



ఇజ్రాయిల్ నుంచి న్యూఢిల్లీ విమానాశ్రయానికి చేరుకున్న భారతీయులకు స్వాగతం పలుకుతున్న కేంద్ర విమానయాన శాఖ సహాయ మంత్రి విజయ కుమార్ సింగ్



మీకోసం

ఫ్లాస్కులని ఎంత శుభ్రం చేసినా దుర్వాసన వస్తుంటే... మజ్జిగతో కడగాలి.

జీవన సౌరభం

సామర్థ్యంతో పాటు సాధించాలనే తపన ఉన్నప్పుడే విజయం వస్తుంది.

భారతావనిని ముద్దాడేస్తాం



అల్లరి చిల్లరి పిల్లలం
కల్లలు పలకని బుడుగులం

బుద్ధిగ చదువులు చదివేస్తాం
సుద్దులు ఎన్నో నేర్చేస్తాం

గురువుకు దండం పెట్టేస్తాం
తరువును చక్కగ రక్షిస్తాం

కులమత భేదం వదిలేస్తాం
కలతలు లేకనె మెలిగేస్తాం

ప్రకృతి మాతను మెప్పిస్తాం
సుకృత పథమున నడిచేస్తాం
ఉన్నత విద్యను చదివేస్తాం
మిన్నగ బతుకును మార్చేస్తాం

అవరోధాలను ఎదిరించేస్తాం
నవలోకానికి పునాదులేస్తాం
భారతమాతకు హారతులిస్తాం
భారతావనిని ముద్దాడేస్తాం..

– మీసాల చినగౌరినాయుడు, బొబ్బిలి, 94928 48564.


సమాన అర్థాలు

పిల్లలూ, ఇక్కడ కొన్ని తెలుగు పదాలు ఇచ్చాం. ఇచ్చిన క్లూ ఆధారంగా వాటికి సమానర్థాలు వచ్చే పదాలు మీరు రాయండి.

అడవి	కా న
శరీరం	కా___________
జైలు	కా___________
అంజనం	కా___________
గ్రంథం	కా___________
సమయం	కా___________

దారి చెప్పండి

పిల్లలూ, స్వీటీ ఐస్‌క్రీమ్ బండి దగ్గరకు వెళ్లాలి. కొంచెం దారి చూపించరూ..



నేను గీసిన బొమ్మ





ఎం. భువనేశ్వరి, 7వ తరగతి, గర్ల్స్ హైస్కూలు, సత్తెనపల్లి.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

ఉన్నత లక్ష్యం దాగున్న కళారూపాలు అవి..

పేద, మధ్యతరగతి కుటుంబంలో పుట్టిన అమ్మాయిలకు పెద్దగా ఆశలేం ఉంటాయి.. చదువు, పెళ్లి, పిల్లలు.. ఇంతకు మించి ఆలోచిస్తే.. విభిన్న రంగంలోనో, కళలోనో రాణిస్తే.. మొదట్లో అన్నీ అడ్డుగోడలే.. వాటన్నింటినీ ఎదుర్కొని నిలబడడం ఆషామాషీ కాదు. అలాంటిది ఓ అమ్మాయి తనకిష్టమైన చిత్రకళకు 'చెట్లను రక్షించడమ'నే ఉన్నత లక్ష్యాన్ని ముడిపెట్టి అందరిలో అవగాహన కల్పిస్తున్నారు. ప్రముఖుల ప్రశంసలందుకుంటున్నారు. కడప, పొద్దుటూరుకు చెందిన 25 ఏళ్ల కొడవలూరు ప్రసన్న ఎంచుకున్న ఈ మార్గం గొప్ప భవిష్యత్తు ప్రణాళికలు వేసుకునే ఎంతోమంది యువతకు దిశానిర్దేశం..



పల్లెటూళ్ల నుండి పాలు తెచ్చి పట్నంలో అమ్మే చిరు వ్యాపారి కుటుంబంలో రెండో సంతానంగా ప్రసన్న జన్మించారు. రామచంద్రరాజు, మంజువాణిల గారాలపట్టి. తమ సంతానంగా పుట్టిన ముగ్గురు ఆడపిల్లలను బాగా చదివించాలన్న లక్ష్యం ఉన్న తల్లిదండ్రులు వారు. చదువుతో పాటు చిత్రకళపై ఇష్టం పెంచుకున్న రెండో కూతురు ప్రసన్న అభిరుచిని కూడా ప్రోత్సహించారు. 'నాకు చిన్నప్పటి నుండి బొమ్మలు గీయడమంటే చాలా ఇష్టం. ఇంటర్ పూర్తయ్యాక అమ్మే స్వయంగా నన్ను ఆర్ట్స్ స్కూల్‌లో చేర్పించింది. ఆడపిల్లకు ఇవన్నీ ఎందుకు. పెళ్లి చేసి పంపించేయక అని చాలామంది అనేవారు. అయినా అమ్మానాన్న నన్ను నిరుత్సాహపర్చలేదు. అయితే అమ్మకు ఆరోగ్యం బాగోలేక కొన్ని రోజులకు ఆర్ట్స్‌కు దూరమయ్యాను. హిందీ పండిట్‌గా కోచింగ్ కూడా తీసుకున్నాను. కానీ ఏదో వెలితి నన్ను వెంటాడుతూ ఉండేది. కరోనా వల్ల వచ్చిన విరామం నన్ను మళ్లీ ఆర్ట్స్ వైపు నడిపించింది' అంటున్న ప్రసన్న చెట్లను రక్షించడమనే లక్ష్యం ఎందుకు తీసుకున్నారని అడిగినప్పుడు ఇలా చెప్పారు.



గురువుగారి ప్రోత్సాహం వల్లే..

'మా గురువుగారు రామాంజనేయ రెడ్డి. 'మహేష్ ఆర్ట్స్' అంటే అందరికీ తెలుస్తుంది. 'సేవ్ గర్ల్ చైల్డ్' లక్ష్యంతో ఆయన కళారూపాలు చిత్రించేవారు. వాటిని ప్రముఖులకు అందజేసి అందరికీ అవగాహన కల్పించేవారు. ఉన్నత లక్ష్యాన్ని కళారూపాలతో కూడా ముందుకు తీసుకువెళ్లవచ్చని ఆయన దగ్గరే నేర్చుకున్నాను. ఒకసారి పద్మశ్రీ అవార్డు గెలుచుకున్న, చెట్లను రక్షిస్తున్న తిమ్మప్ప అవ్వ గురించి గురువుగారు చాలా గొప్పగా చెప్పారు. అప్పుడే నా లక్ష్యం నిర్దేశించుకున్నాను. నేను కూడా కళారూపాల ద్వారా వృక్షాలను రక్షించమని అవగాహన కల్పిస్తానని చెప్పాను. గురువుగారు చాలా సంతోషించారు. ఆ దిశగా ప్రోత్సహించారు. సింగిల్ కలర్ ఆర్ట్, సాండ్ ఆర్ట్‌లో గురువుగారు ఎన్నో మెళకువలు నేర్పించారు. మొదట్లో నేను వేయగలనా అని సందేహపడేదాన్ని. కానీ నాలో ఆత్మవిశ్వాసం నింపి, ఎంతో ప్రోత్సహించారు. 'ఆడపిల్లలు ఉన్నత లక్ష్యం వైపు అడుగులు వేయాలి. అప్పుడే నా ఆశయం నెరవేరుతుంది' అని గురువుగారు చాలాసార్లు నాతో అన్నారు' అంటూ విద్య నేర్పిన గురువు గురించి ఆమె చెబుతున్నప్పుడు ఆ మాటల్లో ఆనందం, గురువుపట్ల అమిత గౌరవం ధ్వనించింది.



వందమంది ప్రముఖులకు పైగా 8 మంది గవర్నర్లు, ముఖ్యమంత్రులు, శాస్త్రవేత్తలు, దర్శకులు, నటీనటులు, గాయకులు, సామాజిక కార్యకర్తలు ఇలా ఒకరేమిటి ఇప్పటివరకు వందమందికి పైగా ప్రముఖులకు తన కళారూపాలను బహుకరించారు ప్రసన్న. 'వృక్షో రక్షతి రక్షిత:' నినాదం రాసిన ఆ అందమైన కళారూపాలను చూసిన వారంతా చిన్న వయసులోనే గొప్ప లక్ష్యంతో ముందుకెళుతున్న ఆమెను గొప్పగా ప్రశంసిస్తున్నారు.



స్వామినాథన్‌ను కలవడం గొప్ప అనుభూతి

'ప్రముఖ శాస్త్రవేత్త స్వామినాథన్‌కు నా కళారూపం బహుకరించాను. అప్పుడు ఆయన వీల్‌ఛైర్‌లోనే ఉన్నారు. సరిగ్గా మాట్లాడలేక పోతున్నారు. నాతో ఏదో చెప్పాలని ఎంతో తాపత్రయపడ్డారు. కానీ నాకు అర్థం కాలేదు. ఆ క్షణం నాకు ఎంతో బాధ కలిగింది. ఇటీవలె ఆయన మరణించారన్న వార్త తెలిసినప్పుడు ఆ సంఘటన గుర్తొచ్చి బాగా ఏడుపొచ్చింది' అని చెబుతున్నప్పుడు ప్రసన్న ఎంత సున్నిత మనస్కురాలో అర్థమౌతుంది.

నా కళ ద్వారానే వారిని స్వయంగా కలిశాను

'నేను కూడా అందరిలాగా తెరపైనే సినీతారలను, గాయకులను, దర్శకులను చూసేదాన్ని. కానీ నా కళ వారిని స్వయంగా కలిసేలా చేసింది. బోయపాటి, కాజల్, శంకర్, శ్రీకాంత్, జయప్రద, సుశీలమ్మ, ఇళయరాజా, చరణ్ లాంటి చిత్రసీమలో ఉన్న ప్రముఖులు నా కళారూపాలను చూసి ఎంతో మెచ్చుకున్నారు. సింహం రూపంలో ఉన్న కళారూపాన్ని బోయపాటికి ఇచ్చినప్పుడు ఆయన చాలా ఆశ్చర్యపోయారు. ఇస్రో శాస్త్రవేత్త, సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి ఎన్‌వి రమణ, రోశయ్య, తమిళసై పోలీసు అధికారి సజ్జనార్, ఇలా ఎంతోమంది రాజకీయ, విభిన్న రంగాల ప్రముఖులు నా కళారూపాలను ప్రశంసించారు. ఇదంతా నా కళ ద్వారానే సాధ్యపడింది' అంటూ చెబుతున్న ఆమెలో గొప్ప కళాభిమానం కనిపిస్తుంది.

ఉన్నత లక్ష్యం..

'మాలాంటి మధ్యతరగతి కుటుంబాల్లో పుట్టిన ఆడపిల్లలు ఉన్నత లక్ష్యం వైపు అడుగులు వేయాలంటే తల్లిదండ్రుల ప్రోత్సాహం ఉండాలి. అప్పుడే సమాజం నుండి ఎన్ని ఆటుపోట్లు ఎదురైనా తట్టుకుని నిలబడతారు. నేను సాధిస్తున్న ఈ విజయాలు అమ్మానాన్నను ఎంతో సంతోషపెడుతున్నాయి. ప్రముఖులు నా చిత్రాలను ప్రశంసిస్తుంటే నాన్న తెగ మురిసిపోతాడు. ఒకప్పుడు 'మీకు అసలు బుద్ధుందా.. ఆ పిల్లకు ఇష్టమని బొమ్మలు గీయడం నేర్పుతున్నారు.. అదేమైనా తిండి పెడుతుందా? గౌరవం తెచ్చిపెడుతుందా?' అని అమ్మానాన్నను దెప్పిపొడిచిన వాళ్లే ఇప్పుడు నన్ను పొగుడుతుంటే అమ్మ ఎన్నో సార్లు ఆనందభాష్పాలు రాల్చడం నేను చూశాను. పెళ్లయ్యాక కూడా నా లక్ష్యం కొనసాగిస్తాను' అంటున్న ప్రసన్న ఎంచుకున్న ఉన్నత ఆశయం, భవిష్యత్తులో ఆమెను ఉన్నత శిఖరాల వైపు నడిపించాలని ఆశిద్దాం.



– జ్యోతిర్మయి

బాక్సాఫీసు బరిలో దసరా సినిమాలు

ఏటేటా దసరా పండుగ వచ్చిందంటే టాలీవుడ్ బాక్సాఫీసు దగ్గర సందడి మామూలుగా ఉండదు. టాలీవుడ్ ఇండస్ట్రీలో స్టార్ హీరోలు తమ సినిమాలను దసరా పండుగ సందర్భంగా విడుదల చేయాలనే ఉద్దేశ్యంతో అందుకు అనుగుణంగా సినిమా షూటింగ్‌ను కూడా నిర్వహిస్తుంటారు. అనేక సినిమాలను దసరాకు విడుదలచేస్తుంటారు. గతేడాది దసరాకు రవితేజ హీరోగా సుధీర్ వర్మ దర్శకత్వంలో రావణాసుర, మణిరత్నం దర్శకత్వంలో చియన్ విక్రమ్, కార్తీ, జయం రవి, ఐశ్వర్యరాయ్, త్రిష ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం పొన్నియన్ సెల్వన్, చిరంజీవి హీరోగా మోహన్‌రాజా దర్శకత్వంలో గాడ్‌ఫాదర్, నాగార్జున హీరోగా, సోనాల్‌చౌహాన్ హీరోయిన్‌గా ప్రవీణ్‌సత్తారు దర్శకత్వంలో దీ ఘోస్ట్ సినిమా విడుదలైన విషయం తెలిసిందే. గతేడాది సంక్రాంతి సమయంలో చిరంజీవి వాల్తేరు వీరయ్య, బాలకృష్ణ వీరసింహారెడ్డి పోటీ పడ్డాయి. అదే సమయంలో తమిళం నుంచి దళపతి విజయ్ వారిసు, అజిత్ నటించిన తునీవు విడుదలయ్యాయి. ఈ ఏడాది దసరా పండగ ఉత్సవాలు ఈనెల 15 నుంచి 25 వరకూ జరగబోతున్నాయి. అయితే బాక్సాఫీసును గడగడలాడించేందుకు హీరోలు సిద్ధమవుతున్నారు. సాధారణంగా పండుగల సమయంలో భారీ బడ్జెట్ సినిమాలు విడుదలవుతాయి. స్టార్ ఆర్టిస్టుల సినిమాలు చూసేందుకు పెద్ద సంఖ్యలో ప్రేక్షకులు వస్తుంటారు. దీంతో సినిమా వసూళ్ళ పెరుగుతాయి. చాలామంది నిర్మాతలు ఈ దసరా పండుగపై కన్నేశారు. సినీ ప్రేక్షకులకు మంచి ట్రీట్ రానుంది. కన్నడ, తెలుగు, తమిళ భాషల్లో భారీ బడ్జెట్ చిత్రాలు విడుదలవుతున్నాయి.

ఈ సీజన్‌లో పెద్ద సినిమాల హీరోల చిత్రాలు పోటీపడుతున్నాయి. తొమ్మిది సినిమాలు ఈ సీజన్‌లో విడుదల కానున్నాయి. వాటిలో నందమూరి బాలకృష్ణ 'భగవంత్ కేసరి' (తెలుగు), రవితేజ 'టైగర్ నాగేశ్వరరావు' (తెలుగు), విజయ్ 'లియో'(తమిళం), ట్రాఫ్ గణపత్ (హిందీ), కంగనా రనౌత్ 'తేజస్' (హిందీ), శివ రాజ్‌కుమార్ 'ఘోస్ట్' (కన్నడ), 'యారియాన్–2', 'కిల్లర్స్ ఆఫ్ ది ఫ్లవర్ మూన్' వంటి చిత్రాలు ఉన్నాయి. ఈ సినిమాలన్నీ ఈ నెల 18 లేదా 19 తేదీల్లో థియేటర్లలో సందడి చేయనున్నాయి. ఇక తెలుగు, తమిళ బాక్సాఫీస్ వచ్చేసరికి. 'భగవంత్ కేసరి', 'టైగర్ నాగేశ్వరరావు', 'లియో' సినిమాలపై ప్రేక్షకులు ఆసక్తి కనబరుస్తున్నారు. ఇప్పటికే రిలీజైన పోస్టర్లు, ట్రైలర్లతో ఈ సినిమాపై అంచనాలు అమాంతం పెరిగిపోయాయి. దీంతో అభిమానుల్లో తీవ్ర ఉత్కంఠ నెలకొంది. అందుకే ఈ సారి టాలీవుడ్‌లో బాలయ్య, రవితేజ, విజయ్‌ల మధ్య పోటీ ఉండనుంది. అయితే కోలీవుడ్‌లో మాత్రం లియోదే సందడి ఉంటుంది. ఇక కన్నడలో 'ఘోస్ట్'?, బాలీవుడ్‌లో 'గణ్‌పత్'కు కూడా మంచి క్రేజ్ ఉంది. మొత్తంగా ఇన్ని పెద్ద, చిన్న చిత్రాలన్నీ ఒకే సారి వచ్చేందుకు సిద్ధమవ్వడం వల్ల థియేటర్ల సమస్య వచ్చే అవకాశం ఉందనే చర్చ సినీ పరిశ్రమలో వినిపిస్తుంది. ఈకాలంలోని సినిమాలన్నీ దసరాకే సిద్ధమవుతుండటంతో వెల్లువ ఎలా ఉండనుందో అంటూ అభిమానులు ఆతృతగా ఎదురు చూస్తున్నారు.





భగవంత్‌కేసరి : బాలకృష్ణ హీరోగా డైరెక్టర్ అనిల్ రావిపూడి దర్శకత్వంలో, ప్రముఖ నిర్మాణ సంస్థ షైన్ స్క్రీన్స్ బ్యానర్‌లో రూపుదిద్దుకున్న సినిమా భగవంత్‌కేసరి..కాజల్ అగర్వాల్ హీరోయిన్‌గా నటిస్తుండగా శ్రీలీల కీలక పాత్ర పోషిస్తున్నారు. ఈనెల 19న ఈ సినిమా విడుదల కానుంది.

'లియో': కోలీవుడ్ హీరో విజయ్ నటించిన 'లియో'. ఈనెల 19న విడుదల కానున్న నేపథ్యంలో రోజుకు ఐదు ఆటలు ప్రదర్శించుకునేందుకు తమిళనాడు ప్రభుత్వం అనుమతిచ్చింది. ఈనెల 19 నుంచి 24వ తేదీ వరకు ఐదు ఆటలు ప్రదర్శించుకునే వెసులుబాటును కల్పించింది. ఈనెల 19 నుంచి 24వ తేదీ వరకు ఐదు ఆటలు ప్రదర్శించుకునే వెసులుబాటును కల్పించింది.

టైగర్ నాగేశ్వరరావు : హీరోగా రవితేజ, హీరోయిన్లుగా నుపుర్ సనన్, గాయత్రి భరద్వాజ్ నటిస్తున్న సినిమా 'టైగర్ నాగేశ్వరరావు'. అక్టోబరు 20న భారత దేశ వ్యాప్తంగా విడుదల కానున్నట్లుగా చిత్రనిర్మాతలు ప్రకటించారు. జివి ప్రకాష్ కుమార్ సంగీతం అందిస్తున్నారు. రచన, దర్శకత్వం వంశీ, నిర్మాత అభిషేక్ అగర్వాల్, సహ నిర్మాతగా మయాంక్ సింఘానియా వ్యవహరిస్తున్నారు.



'ఘోస్ట్' : డాక్టర్ శివరాజ్ కుమార్ హీరోగా రూపొందుతోన్న చిత్రం ఘోస్ట్. దర్శకుడు శ్రీని, నిర్మాత సందేశ్ నాగరాజ్. సందేశ్ ప్రొడక్షన్స్ బ్యానర్ పై ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. 19న దసరా కానుకగా కన్నడ, తెలుగు, తమిళ, హిందీ, మలయాళం భాషల్లో భారీ స్థాయిలో విడుదల చేయనున్నారు. ప్రముఖ నటులు అనుపమ్ ఖేర్, జయరామ్, ప్రశాంత్ నారాయణ్, అర్చన జాయిస్, సత్య ప్రకాష్, దత్తన్న ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు.



ఇంగ్లాండ్‌కు షాక్

- అఫ్గాన్ చేతిలో అనూహ్య ఓటమి
- అఫ్గనిస్థాన్ 284/10, ఇంగ్లాండ్ 215/10
- ఐసీసీ 2023 ప్రపంచకప్

ఐసీసీ 2023 ప్రపంచకప్‌లో అతిపెద్ద సంచలనం నమోదైంది. డిఫెండింగ్ చాంపియన్, టైటిల్ ఫేవరేట్లలో ఒకరైన ఇంగ్లాండ్ స్పిన్ వలలో చిక్కుకుంది. 285 పరుగుల ఛేదనలో అఫ్గాన్ స్పిన్నర్ల మాయలో పడి 215 పరుగులకే కుప్పకూలింది. వరల్డ్ చాంపియన్స్ ఇంగ్లాండ్‌ను మట్టికరిపించిన అఫ్గనిస్థాన్ 69 పరుగులతో ఘన విజయం సాధించింది. అఫ్గనిస్థాన్ క్రికెట్ చరిత్రలో ఇదే అతి పెద్ద విజయం.

న్యూఢిల్లీ : షాక్..షాక్. ఇంగ్లాండ్‌కు ఊహించని షాక్ తగిలింది. ఫిరోజ్ షా కోట్లలో అఫ్గాన్‌పై అలవోక నెగ్గుతామనే విశ్వాసంతో మైదానంలో అడుగుపెట్టిన బట్లర్‌సేనకు అఫ్గనిస్థాన్ స్పిన్నర్లు పీడకల మిగిల్చారు. అఫ్గాన్ స్పిన్నర్లు ముజీబ్ రెహమాన్ (3/51), రషీద్ ఖాన్ (3/37) మూడు వికెట్ల ప్రదర్శనతో మాయజాలం చేశారు. 285 పరుగుల ఛేదనలో ఇంగ్లాండ్ 40.3 ఓవర్లలో 215 పరుగులకే కుప్పకూలింది. యువ బ్యాటర్ హ్యారీ బ్రూక్ (66, 61 బంతుల్లో 7 ఫోర్లు, 1 సిక్స్), డెవిడ్ మలాన్ (32, 39 బంతుల్లో 4 ఫోర్లు) మినహా ఇంగ్లాండ్ బ్యాటింగ్ విభాగంలో ఎవరూ రాణించలేదు. 68 పరుగులకే మూడు వికెట్లు చేజార్చుకున్న ఇంగ్లాండ్ మళ్లీ కోలుకోలేదు. అంతకుముందు తొలుత బ్యాటింగ్ చేసిన అఫ్గనిస్థాన్ 49.5 ఓవర్లలో 284 పరుగులకు ఆలౌటైంది. ఓపెనర్ రెహ్మానుల్లా గుర్బాజ్ (80, 57 బంతుల్లో 8 ఫోర్లు, 4 సిక్స్‌లు), ఇక్రమ్ అలిఖిల్(58, 66 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్స్‌లు) అర్ధ సెంచరీలతో మెరిశారు. మూడు వికెట్లతో పాటు 16 బంతుల్లో 28 పరుగులు చేసిన ముజీబ్ రెహమాన్ 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్'గా నిలిచాడు. ప్రపంచకప్ గ్రూప్ దశలో ఇంగ్లాండ్‌కు ఇది రెండో ఓటమి కాగా.. అఫ్గనిస్థాన్‌కు ఇది తొలి విజయం.





మాయలో చిక్కి.. : 285 పరుగుల ఛేదనలో ఇంగ్లాండ్‌కు ఆరంభంలోనే గట్టి ఎదురుదెబ్బ తగిలింది. స్పిన్నర్ ముజీబ్ రెహమాన్ బౌలింగ్ దాడిని మొదలుపెట్టగా.. ఇన్నింగ్స్ రెండో ఓవర్లోనే పేసర్ ఫరూకీ బ్రేక్ సాధించాడు. జానీ బెయిర్‌స్టో (2)ను వెనక్కి పంపించాడు. జో రూట్ (11)ను ముజీబ్ అవుట్ చేయగా.. డెవిడ్ మలాన్ (32)ను మహ్మద్ నబి సాగనంపాడు. దీంతో 12.4 ఓవర్లలో 68 పరుగులకే ఇంగ్లాండ్ మూడు వికెట్లు కోల్పోయింది. ఈ దశలో హ్యారీ బ్రూక్ (66) ఓ వైపు నిలిచినా.. మరో ఎండ్‌లో సహకారం దక్కలేదు. జోశ్ బట్లర్ (9), లివింగ్‌స్టోన్ (10), శామ్ కరణ్ (10), క్రిస్ వోక్స్ (9)లు దారుణంగా విఫలమయ్యారు. ఆదిల్ రషీద్ (20), మార్క్‌వుడ్ (18), టాప్లీ (15 నాటౌట్) చివర్లో ఓటమి అంతరాన్ని కుదించారు. 40.3 ఓవర్లలోనే పది వికెట్లు పడగొట్టిన అఫ్గనిస్థాన్ 69 పరుగులతో ఘన విజయం సాధించింది.

ధనాధన్ : టాస్ నెగ్గి తొలుత బౌలింగ్ ఎంచుకున్న ఇంగ్లాండ్‌కు అఫ్గాన్ ఓపెనర్లు గట్టి పంచ్ ఇచ్చారు. రెహ్మానుల్లా గుర్బాజ్ (8), ఇబ్రహీం జద్రాన్ (30) తొలి వికెట్‌కు 114 పరుగుల భారీ భాగస్వామ్యం నమోదు చేశారు. దూకుడుగా ఆడిన రెహ్మానుల్లా ఏడు ఫోర్లు, 2 సిక్సర్లతో 33 బంతుల్లోనే అర్ధ సెంచరీ సాధించాడు. ఓపెనర్ల నిష్క్రమణ అనంతరం వరుస వికెట్లతో ఇంగ్లాండ్ రేసులోకి వచ్చింది. రహమత్ షా (3), హస్మతుల్లా (14), ఓమర్‌జాయ్ (19) నిరాశపరిచినా.. ఇక్రమ్ ఇలిఖిల్ (58), రషీద్ ఖాన్ (23), ముజీబ్ రెహమాన్ (28) మెరుపులతో అఫ్గనిస్థాన్ 284 పరుగుల భారీ స్కోరు సాధించింది. ఇంగ్లాండ్ బౌలర్లలో ఆదిల్ రషీద్ (3/50), మార్క్‌వుడ్ (2/50) రాణించారు.

పవర్‌లిఫ్టింగ్‌లో మెరిసిన శిల్ప



హైదరాబాద్ : బెంగళూర్‌లో జరిగిన వరల్డ్ పవర్‌లిఫ్టింగ్ కాంగ్రెస్ నేషనల్ చాంపియన్‌షిప్స్ (డబ్ల్యూపీసీ)లో తెలంగాణ పవర్‌లిఫ్టర్లు సత్తా చాటారు. అండర్–90 డెడ్‌లిఫ్ట్‌లో 105 కేజీలు ఎత్తిన డి. శిల్ప గోల్డ్ మెడల్ సాధించింది. ఇదే విభాగంలో 100 కేజీలు ఎత్తిన ఇందూ సిల్వర్ మెడల్ గెల్చుకుంది. ఇతర విభాగాల్లో తర్శియ, శృతి గోల్డ్ మెడల్స్ కొట్టగా.. సౌమ్య రజత పతకం గెల్చుకుంది. డబ్ల్యూపీసీ కర్ణాటక అధ్యక్షుడు మహ్మద్ అజమత్ విజేతలకు బహుమతులు అందజేశారు.

షహీన్‌కు అంత లేదు!

- పాక్ పేసర్‌పై రవిశాస్త్రి వ్యాఖ్యలు

ముంబయి : బౌలింగ్ కార్ఖానా పాకిస్థాన్ క్రికెట్!. ఇమ్రాన్ ఖాన్, వసీం అక్రమ్ నుంచీ ఇప్పటివరకు పాక్ క్రికెట్‌లో ఆ సంస్కృతి కొనసాగుతుంది. ప్రస్తుత పాక్ జట్టులో ఆ జట్టు పేస్ సారథి షహీన్ షా అఫ్రిది. భారత్ సహా ఏ అగ్ర జట్టుతో తలపడినా.. షహీన్ షా అఫ్రిది ప్రస్తావన ఉంటుంది. భారత బ్యాటర్లకు లెఫ్ట్‌ఆర్మ్ పేసర్లను ఎదుర్కొనే బలహీనత ఉంది. లెఫ్ట్‌ఆర్మ్ పేసర్ షహీన్ అఫ్రిది ఈ బలహీనతను కొన్ని సందర్భాల్లో సొమ్ముచేసుకున్నాడు. అయితే, షహీన్ అఫ్రిది మంచి పేసరే కానీ దిగ్గజాలతో పోల్చదగిన స్థాయి అతడికి కాదని భారత మాజీ చీఫ్ కోచ్ రవిశాస్త్రి అన్నాడు.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68